


మణిపూర్ హింస వెనుక కేంద్ర ప్రభుత్వ పెద్దలున్నారు. వారి ఆశీర్వాదంతోనే సీఎం బీరెన్‌సింగ్ అల్లర్లను ప్రోత్సహిస్తున్నారు.
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 26-7-2023

www.navatelangana.com



మణిపూర్‌లో సంపదను అదానీకి కట్టబెట్టే కుట్ర జరుగుతున్నది. వేల ఎకరాల భూమిని, భూగర్భ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర.
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

సంపుటి : 9 | సంచిక : 155 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 10 పేజీలు | వెల : 6.50

రాజకీయ లబ్ది కోసమే మణిపూర్ మంటలు

మత ఘర్షణలతో ఓట్లు పొందేందుకే యూసీసీ బిల్లు

- బీజేపీ కుట్రలను ఐక్యంగా తిప్పికొట్టాలి
- మోడీ సర్కార్‌ను గద్దెదించేందుకు అన్ని శక్తులూ ఏకంకావాలి
- సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేయాల్సిందే...
- అల్లర్లను అరికట్టాలి- ప్రజల ప్రాణాలను కాపాడాలి
- శాంతిని నెలకొల్పేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి
- వామపక్షాల భారీ ప్రదర్శన, అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన



హైదరాబాద్‌లో...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజకీయ స్వార్థం, లబ్ది పొందడం కోసమే మణిపూర్‌లో మంటలు చెలరేగుతున్నాయని సీపీఐ, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శులు కూనంనేని సాంబశివరావు, తమ్మినేని వీరభద్రం విమర్శించారు. పైకి రెండు తెగల మధ్య ఘర్షణగా కనిపిస్తున్నా దానివెనుక బీజేపీ కుట్ర దాగి ఉందన్నారు. దాన్ని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు. మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. అక్కడ అల్లర్లను అరికట్టాలనీ, ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చెప్పారు. మోడీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష శక్తులన్నీ ఏకం కావాలని ...9లో

కేంద్రంపై అవిశ్వాసం..!

ప్రధాని మోడీని సభకు రప్పించటమే లక్ష్యం

- నాలుగోరోజూ కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళనలు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టే దిశగా ప్రతిపక్ష పార్టీలు యోచిస్తున్నాయి. ప్రధాని మోడీని పార్లమెంట్‌కు రప్పించి, మణిపూర్ గురించి మాట్లాడించేందుకే ఈ ప్రయత్నమని పేర్కొంటున్నాయి. ఈ అంశంపై గత రెండు రోజులుగా ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య చర్చ జరుగుతోంది. మంగళవారం రాజ్యసభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే కార్యాలయంలో ప్రతిపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశమై అవిశ్వాస తీర్మాన నోటీసు సమర్పించడంపై తుది నిర్ణయానికి ప్రయత్నిస్తున్నారు. లోక్‌సభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు సంఖ్యా బలం ఉందని తమకు తెలుసునని, అయితే ప్రధాని మోడీ మణిపూర్ ఘాతుకాలకు సమాధానం చెప్పాలని పట్టుబడుతున్న ప్రతిపక్షాలు... ఆ మేరకు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే ఈ అవిశ్వాసానికి పూనుకుంటున్నాయని ఆయా వర్గాలు తెలిపాయి. మరింత చర్చలు, సంప్రదింపుల తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామని ఒక సీనియర్ నేత అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమంపై ప్రతిపక్షాల తీవ్ర నిరసనకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాక్షిగా నిలుస్తున్నాయి. సమావేశాల నాలుగో రోజైన మంగళవారం కూడా ఉభయసభల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మణిపూర్ హింసపై ప్రధాని మోడీ నోరువిప్పాలనే డిమాండ్ నుంచి ప్రతిపక్షాలు తగ్గేదేలేదంటున్నాయి. ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెబుతూనే..మణిపూర్ అంశాన్ని పక్కదారిపట్టించటానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నాయి. అయితే ఒకే రోజు ఇటు బీజేపీ పార్లమెంటరీ సమావేశం..అటు ప్రతిపక్షాల కూటమి(ఇండియా) భేటీఅయి తమ వ్యూహాలకు పదును పెడుతుండటం గమనార్హం.

వీగిపోతుందని తెలిసినా...?

మణిపూర్ అగ్నిగుండంలా మండుతున్నా..ప్రధాని మోడీ నోరు విప్పకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.మణిపూర్ సర్కార్ బీజేపీదే కావటం,పైగా అక్కడి సీఎం పై ఎలాంటి చర్య తీసుకోకపోవటం,అల్లర్ల నివారణకు కేంద్రం చేసిందేమీ లేకపోవటంతో.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమై నాలుగురోజులు గడిచినా సభలో మాట్లాడటానికి ప్రధాని ఇష్టపడటంలేదు. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షాలను తెరపైకి తెచ్చి మణిపూర్‌పై మాట్లాడించేలా చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి. ప్రతిపక్షాలు కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి సిద్ధం కాగానే..కేంద్ర హోంమంత్రి రంగంలోకి దిగి ప్రతిపక్షాలకు లేఖ రాశారు. రండి..మణిపూర్‌పై చర్చిద్దామంటూ కబురుపంపారు. అయినా ప్రతిపక్ష (ఇండియా) కూటమి వెనక్కి తగ్గటంలేదు. పార్లమెంట్‌లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మెజారిటీ ఉన్నా, తమ తీర్మానం వీగిపోతుందని తెలిసినా అవిశ్వాసానికి సిద్ధమవుతోంది. ఎందుకంటే స్పీకర్ అవిశ్వాసానికి అనుమతిస్తే..దీనిపై అనివార్యంగా విస్తృతమైన చర్చకు, ఓటింగ్‌కు అవకాశం లభిస్తుంది.


(ఫైల్)

ఇండియా కూటమిపై మోడీ విసుర్లు


- ఈస్ట్ ఇండియా కంపెనీ, ఇండియన్ ముజాహిదీన్ వంటి వాటి పేర్లలో కూడా ఇండియా ఉందంటూ వ్యాఖ్య

న్యూఢిల్లీ: పార్లమెంటు లైబ్రరీ భవనంలో ప్రారంభమైన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోడీ ప్రతిపక్షాల కూటమిపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా హల్‌చల్ చేస్తున్నాయి. ముందుగా సమావేశానికి ...2లో

దేశ రక్షణే మా లక్ష్యం

- ప్రధాని విమర్శలను తిప్పి కొట్టిన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ప్రతిపక్షాలపై ప్రధాని విమర్శలను కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తిప్పికొట్టారు. మణిపూర్ గాయాన్ని నయం చేయడానికే తమ ప్రతిపక్ష కూటమి ఉందని అన్నారు. మణిపూర్‌లో భారతదేశ సిద్ధాంతమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని పునర్‌నిర్మిస్తామని స్పష్టం చేశారు. "ప్రధాని గారూ.. మీరు ఎలా కావాలంటే అలా పిలుచుకోండి. మేము ఇండియా. మణిపూర్ ...2లో


(ఫైల్)

దేశం అప్పు రూ.220.5 లక్షల కోట్లు

అందులో కేంద్ర ప్రభుత్వం అప్పు రూ.155.6 లక్షల కోట్లు

- అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అప్పు రూ.76.1 లక్షల కోట్లు : కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి



నవతెలంగాణ -న్యూఢిల్లీ బ్యూరో

దేశం అప్పు రూ.220.5 లక్షల కోట్ల (జీడీపీలో 80.9 శాతం)ని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. మంగళవారం రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. అందులో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.155.6 లక్షల కోట్లు (జీడీపీలో 71 శాతం), అన్ని రాష్ట్ర ప్రభుత్వాల అప్పు రూ.76.1 లక్షల కోట్లు (జీడీపీలో 35 శాతం) అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే అప్పుల్లో రూ.51 లక్షల కోట్లు (624.65 బిలియన్ యుఎస్ డాలర్లు) విదేశీ అప్పు ఉందని మరో ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనికి 19.66 బిలియన్ యూఎస్ డాలర్ల వడ్డీ చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.

రైతు రుణమాఫీ పథకం అమలు చేయటం లేదు

కేంద్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ పథకం అమలు చేయటం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. గత మూడేండ్లు, ప్రస్తుత సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఎటువంటి రైతుల రుణమాఫీ పథకం అమలు చేయలేదని, ఈ కాలంలో దీనికి సంబంధించి ఎటువంటి నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు.

36 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ

36 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకున్నామని, అందులో పది సంస్థల ప్రయివేటీకరణ ప్రక్రియ పూర్తి అయిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. రాజ్యసభలో ...2లో

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

- ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ, అతిభారీ వర్షాల నేపథ్యంలో ...9లో

ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్ష...

- ఆత్మహత్యలకు పాల్పడుతున్న దళిత విద్యార్థులు
- హార్వర్డ్, జాన్స్ హాప్‌కిన్స్ వర్సిటీలు దీనికి భిన్నం



వివరాలు 2లో..

ముందుగానే హామీ తీసుకోండి

- వెనక్కి ఇవ్వబోమని స్పష్టంగా చెప్పమనండి



- 'అవార్డ్ వాపసీ'పై పార్లమెంటరీ కమిటీ సూచన

వివరాలు 2లో..



గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వే ఉద్రిక్తం

రెండు గ్రామాల నిర్వాసితుల దిగ్బంధం

- ఇండ్ల నుంచి రాకుండా పోలీసుల మోహరింపు
- రైతుసంఘం నేతలు ఎక్కడికక్కడ అరెస్టు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ చింతకాని

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో మంగళవారం నిర్వహించిన భూ సేకరణ సర్వే ఉద్రిక్తతకు దారితీసింది. ఈనెల 28వ తేదీలోగా సర్వే పూర్తి చేయకపోతే నోటిఫికేషన్ రద్దవుతుందనే పేరుతో అధికారులపై ప్రభుత్వం వైపు నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో ...9లో

వనమా ఎన్నిక చెల్లదు

హైకోర్టు సంచలన తీర్పు

నవతెలంగాణ-హైదరాబాద్

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని సంచలన తీర్పు ఇచ్చింది. కొత్తగూడెం ఎమ్మెల్యేగా జలగం వెంకట్రావును ప్రకటించింది. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ ప్రత్యర్థి జలగం వెంకట్రావు దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరించింది. ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చిన వనమా వెంకటేశ్వరరావుకు. ఐదు లక్షల రూపాయల జరిమానా విధించింది. పిటిషనర్ జలగం వెంకట్రావుకు కోర్టు ఖర్చులు చెల్లించాలని ఆదేశించింది. 2018 ఎన్నికల్లో వనమా కాంగ్రెస్ పార్టీ తరఫున కొత్తగూడెంలో గెలుపొందారు. తర్వాత ఆయన టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ పార్టీలో చేశారు. అప్పుడు టీఆర్ఎస్ తరఫున జలగం వెంటకట్రావు పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఇద్దరూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. వనమా ఎన్నికను జలగం సవాల్ చేస్తూ 2019లో హైకోర్టులో ఎలక్షన్ పిటిషన్ దాఖలు ...2లో



మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై ఎలక్షన్ పిటిషన్ విచారణ

వివరాలు 2లో..

ఫీవర్ ఫియర్..!

ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు రోగులు క్యూ

- ఓపీలో సగం జ్వర పీడితులే..
- జిల్లా, ఏరియా, యూపీహెచ్‌సీలదీ అదే పరిస్థితి



నవతెలంగాణ-సిటీబ్యూరో/ధూల్‌పేట్

వాతావరణం మారడం, వరుసగా వర్షాలు కురవడం, పారిశుధ్య నిర్వహణ పడకేయడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా గల్లీ, కాలనీ, మున్సిపాల్టీ, కార్పొరేషన్ అనే తేడా లేకుండా జ్వరాలతో బాధపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. నగరంలోని ప్రధాన ఆస్పత్రులైన గాంధీ, ఉస్మానియాతోపాటు కింగ్‌కోఠి జిల్లా ఆస్పత్రి, ఏరియా హాస్పిటల్స్, యూపీహెచ్‌సీలకు వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. ఈ ఆస్పత్రుల్లోని ఓపీలో సగం మంది సీజనల్ వ్యాధులతో బాధపడుతున్న వారే ఉన్నారు.

దగ్గు, జ్వరం, జలుబు..

సీజనల్ వ్యాధులతో హైదరాబాద్ జనం అల్లాడుతున్నారు. ఎడతెరిపివ్వని వర్షాలు, దోమల పెరుగుదల, పారిశుధ్యం మూలంగా వ్యాధుల తీవ్రత పెరుగుతోంది. జ్వరం, దగ్గు, జలుబు, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలతో జనం రెండు, మూడ్రోజులుగా ఆస్పత్రులకు ఎక్కువగా క్యూ కట్టారు. గాంధీ ఆస్పత్రిలో సాధారణ ఓపీతో పోలిస్తే 10 రోజుల నుంచి రోగుల సంఖ్య పెరిగింది. ఇక్కడికి ప్రస్తుతం రోజూ దాదాపు 3,500 వరకు రోగులు వస్తున్నారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి సాధారణ రోజుల్లో వెయ్యి నుంచి 1500 వరకు ఓపీ ఉండగా.. ప్రస్తుతం 1700 నుంచి 2వేల మంది వరకు వస్తున్నారు. కింగ్‌కోఠి హైదరాబాద్ జిల్లా హాస్పిటల్‌కు సైతం రోగుల తాకిడి ఎక్కువగానే ఉంది. ప్రతి రోజూ వెయ్యి మందికి తగ్గకుండా రోగులు వస్తున్నారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఉన్న ...2లో

భారీ వర్షం.. పొంగుతున్న వాగులు

ఉమ్మడి వరంగల్‌లో స్తంభించిన రాకపోకలు

- పిడుగుపాటుకు 25 గొర్రెలు మృతి
- జలపాతాల సందర్శనకు అనుమతి రద్దు
- బ్యారేజీల బ్యాక్ వాటర్‌తో భారీగా నష్టం

వివరాలు 9లో


ములుగులో...

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 60,000	▲ 160
22 క్యారెట్లు	- 55,000	▲ 150
కిలో వెండి	- 80,000	▲ 500

బ్యాంకుల ప్రయివేటీకరణ ఆపండి

బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్ డిమాండ్

- ప్రభుత్వ బ్యాంకులను శత్రువులుగా చూస్తున్నారు
- లాభాలు ఆర్జిస్తున్నా ప్రయివేటుకా..?

కేంద్రంపై బ్యాంక్ నేతల ఆగ్రహం



కొల్‌కతా: దేశంలోని సామాన్య ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు బ్యాంకుల ప్రయివేటీకరణకు స్వస్తి చెప్పాలని బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్ డిమాండ్ చేసింది. కొల్‌కతా యూనివర్సిటీ ఇన్‌స్టిట్యూట్ హాలులో సోమవారం జరిగిన సదస్సులో వక్తలు ప్రసంగిస్తూ ఎట్టి పరిస్థితుల లోనూ బ్యాంకుల ప్రయివేటీకరణను అనుమతించబోమని స్పష్టం చేశారు. ఆర్థికంగా విఫలమైన సంస్థలకు చేయూత అందించాలని, ప్రభుత్వ రంగంలోని పారిశ్రామిక యూనిట్లను మరింత అభివృద్ధి చేయాలని వారు కోరారు. బ్యాంకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజల మద్దతు కోరతామని చెప్పారు. 'ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసి పారిశ్రామికవేత్తల ప్రయోజనాలు కాపాడాలని చూడకూడదు. రుణ బకాయిలన్నింటినీ కేంద్రమే వసూలు చేయాలి. రుణాల ఎగవేతదారులు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాలి' అని వారు తెలిపారు.

సదస్సు అనంతరం బ్యాంక్ బచావో దేశ్ బచావో కమిటీ జాయింట్ కన్వీనర్ సౌమ్యా దత్తా విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా తాము ఏకమయ్యామని చెప్పారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడడమే తమ లక్ష్యమని అన్నారు. 'బ్యాంకులలో పనిచేసే ఉద్యోగుల సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. పదవీవిరమణ చేసిన కొంతమంది ఉద్యోగులనే మళ్లీ తాత్కాలికంగా విధులలోకి తీసుకుంటున్నారు. దేశవ్యాప్తంగా బ్యాంకులలో రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్ట్ కార్మికులు ఊడవడం, తుడవడం, ఇతర విధులు నిర్వర్తిస్తున్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందాలంటే కేంద్ర ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఖాళీలను భర్తీ చేయాలి' అని కోరారు.

అంతకుముందు సదస్సులో ఆమె ప్రసంగిస్తూ ప్రభుత్వ రంగంలోని బ్యాంకులు, సంస్థలను ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దీనివల్ల దేశ ఆర్థిక పునాది దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ బ్యాంకుల వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు.

మంచ్ జాయింట్ కన్వీనర్ బిశ్వరంజన్ రాయ్ మాట్లాడుతూ వ్యవసాయం నుండి మైనింగ్ వరకూ, చిన్న తరహా పరిశ్రమలు, విద్యార్థుల నుంచి పేదల వరకూ అందరికీ సులభ పద్ధతిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. దీనిని ప్రయివేటు బ్యాంకుల నుంచి ఆశించలేమని అన్నారు. సామాజిక భద్రత, ప్రభుత్వ పథకాలను సర్కారు బ్యాంకులే అమలు చేస్తాయని వివరించారు. అలాంటి ప్రభుత్వ రంగ బ్యాంకులను కేంద్రం శత్రువుల మాదిరిగా చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లాభాలు ఆర్జిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను కూడా ప్రయివేటు వ్యక్తుల చేతిలో పెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. తమ ఆందోళనకు ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని కోరారు.

పీఎస్‌యూల కారణంగానే దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నదని ప్రధాని చెబుతుంటారని, అయితే అలాంటి వాటిని ప్రయివేటీకరించి నాశనం చేస్తున్నారని సంచార్ నిగమ్ పెన్షనర్ల సంక్షేమ సంఘం సంయుక్త ప్రధాన కార్యదర్శి దిలీప్ సాహా విమర్శించారు. ప్రజలు కష్టపడి దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోతుందని అంటూ ఈ పరిస్థితి మారాలని అన్నారు.

ఈ సదస్సుకు వివిధ బ్యాంక్ సంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, తాత్కాలిక కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. బెఫీ ప్రధాన కార్యదర్శి దెబాశిష్ బసు చౌదరి, అఖిలభారత బ్యాంక్ అధికారుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి సంజయ్ దాస్, డీవైఎఫ్ఐ నాయకుడు వాజిద్ హుస్సేన్, ఎస్ఎఫ్ఐ నాయకుడు దెబానిల్ పాల్, కాంగ్రెస్ నాయకుడు అశుతోష్ ఛటర్జీ తదితరులు హాజరైన వారిలో ఉన్నారు.

ఎస్సీలపై నేరాలలో మధ్యప్రదేశ్ టాప్

- ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : 2021లో మధ్యప్రదేశ్‌లోనే ఎస్సీలపై అత్యధిక నేరాలు జరిగాయి. జాతీయ నేర రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) విడుదల చేసిన సమాచారం ప్రకారం ఆ సంవత్సరం కేరళలో ఎస్టీలపై అధిక నేరాలు చోటుచేసుకున్నాయి. 2020లో కూడా ఎస్సీలపై నేరాల విషయంలో మధ్యప్రదేశ్‌దే మొదటి స్థానం. 2019లో రాజస్థాన్ మొదటి స్థానంలో ఉండగా, మధ్యప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. 2021లో ఎస్సీలపై నేరాల విషయంలో జాతీయ సగటు రేటు 22.6 కాగా మధ్యప్రదేశ్‌లో 63.6గా నమోదైంది.


రాజస్థాన్ 60.8 రేటులో రెండో స్థానంలో నిలిచింది. 2011 జనగణన ఆధారంగా ఎస్సీల జనాభాను లెక్కించారు. లక్ష మంది ఎస్సీ జనాభాపై జరిగిన నేరాలకు సంబంధించి రేటును లెక్కించారు. అన్ని రకాల నేరాలు, వేధింపులను దీనిలో చేర్చారు.ఎస్సీలపై జరిగిన నేరాల సంఖ్యకు సంబంధించి ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో (9,492) ఉండగా రాజస్థాన్ (7,435), మధ్యప్రదేశ్ (7,211) తర్వాతి స్థానాలలో నిలిచాయి. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద 2011లో దేశంలో 45,619 కేసులు నమోదయ్యాయి. ఇక ఎస్టీలపై నేరాలకు సంబంధించి కేరళ మొదటి స్థానంలో నిలవగా రాజస్థాన్ రెండో స్థానంలో, మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉన్నాయి. నేరాల సంఖ్య విషయానికి వస్తే మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశాలు మొదటి మూడు స్థానాలలో నిలిచాయి.

వనమా ఎన్నిక చెల్లదు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ పిటిషన్‌ను ఆమోదిస్తూ హైకోర్టు మంగళవారం కీలక తీర్పు చెప్పింది. ఎన్నికల అఫిడవిట్‌లో వాస్తవాలు దాచిపెట్టారని తేల్చింది. 2018 డిసెంబర్ 18 నుంచి ఎమ్మెల్యేగా జలగం వెంకట్రావు కొనసాగుతారని వెల్లడించింది. కొత్తగూడెం పీఎస్‌లో ఒక కేసు గురించి వనమా కావాలని వెల్లడించలేదు. పాల్వంచలోని 300 గజాల జాగాలోని ఇల్లు గురించి 2004 నుంచి వరసగా మూడు ఎన్నికల్లో చూపించారు. 2018 ఎన్నికల్లో చూపించలేదు. అందులో సగం స్థలం భార్య అంజలికి అమ్మినట్టు చెబుతున్నారు. మిగిలిన స్థలం నుంచి కూడా వనమా అఫిడవిట్‌లో పేర్కొనలేదు. అంజలి తన భార్య కాదని వనమా వాదించినప్పటికీ సేల్‌డీడ్‌లో 151 గజాల అమ్మకానికి సంబంధించిన సేల్‌డీడ్‌లో వనమా భార్యగా పేర్కొంటున్న అంజలి విక్రయించినట్టుగా రికార్డుల్లో ఉందని పిటిషన్ పేర్కొన్నారు. ఈ వివాదంలోకి వెళ్లడం లేదని, అయితే గత అఫిడవిట్లల్లోని స్థలం ఏమైందో తేల్చలేదని తప్పుపట్టింది. ఎన్నికల కేసులో సాక్ష్యం చెప్పడానికి కూడా వనమా రాలేదని తప్పుపట్టింది. 'ఎన్నికల అఫిడవిట్‌లో వాస్తవాలు దాచడం, ఆదాయ లెక్కలు చెప్పకపోవడం అవినీతి కిందకే వస్తుంది..' అని తీర్పు చెప్పింది

పీఎన్‌బీ 'అగ్రికల్చర్ కస్టమర్ మీట్'



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) నగరంలోని ఎన్ఐఎంఎస్ఎంఈలో అగ్రికల్చర్ కస్టమర్ మీట్‌ను ఏర్పాటుచేసింది. మంగళవారం జరిగిన ఈ సమావేశానికి సర్కిల్ హెడ్ ఎన్‌వీఎస్ ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 100 మంది పైగా అధిక విలువ కలిగిన వ్యవసాయ రంగ ఔత్సాహికవేత్తలు, ఎస్‌హెచ్‌జిలు పాల్గొనగా.. రూ.7.50 కోట్ల విలువ చేసే రుణాలను మంజూరు చేశారు.

బీసీ విద్యార్థులకు కూడా ఫీజులు.. :గంగుల

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్


ప్రతిష్టాత్మక విద్యాలయాల్లో ప్రవేశం పొందిన బీసీ విద్యార్థులకు సంపూర్ణంగా ఫీజులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని ఆయన ఆదేశించారు. వెనుకబడిన వర్గాలు అన్నిరంగాల్లో అభ్యున్నతి సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తున్నదని ఆయన తెలిపారు. బీసీ విద్యార్థులు దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాలయాలైన ఐఐటీ, ఐఐఎం, సెంట్రల్ వర్సిటీలు సహా 200 కు పైగా సంస్థల్లో ప్రవేశం పొందారనీ, అలాంటి వారికి సంపూర్ణంగా ఫీజులను (ఆర్టీఎఫ్) చెల్లించేందుకు ప్రభుత్వం గతంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం ఉండేదనీ, ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి బీసీలకు అందజేయాలనే సీఎం ఆదేశం మేరకు అమలు చేస్తున్నామని తెలిపారు.

ఈ నిర్ణ యంతో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10వేల మంది బీసీ విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఇందుకు అదనంగా ఏటా రూ. 150 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తుందన్నారు. ఇప్పటికే యూఎస్, యూకే, ఆస్ట్రే లియా తది తర దేశాల్లో చదువుకునే విద్యార్థులకు అందిస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల తో పాటు ఫీజు రీయంబర్స్‌మెంట్ కూడా చెల్లిస్తున్నామని తెలిపారు.

మైహోం సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

- కార్మికుడు మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

నవతెలంగాణ–మేళ్లచెర్వు



సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు లోని మైహోం సిమెంట్ పరిశ్రమలో మంగళవారం ప్రమాదం జరిగింది. నాలోయూనిట్ నిర్మాణ పనుల్లో లిఫ్టు వైరు తెగిపోయింది. 50 అడుగుల ఎత్తు నుంచి లిఫ్టు పడిపోవడంతో కార్మికుడు మృతిచెందాడు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్ఐ సురేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మైహోం సిమెంట్ పరిశ్రమలో 4వ యూనిట్ నిర్మాణ పనుల్లో ప్రమాదం జరిగింది. ఘటనలో మధ్యప్రదేశ్ కు చెందిన అరవింద్‌సింగ్(28) అనే కార్మికుడు మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. మృతిచెందిన కార్మికునికి సంబంధించి కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. మృతుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్టె సిమెంట్ క్లస్టర్ కన్వీనర్ పట్టెపు సైదులు, సీపీఐ(ఎం) నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా సంస్థలలో కుల వివక్ష...

న్యూఢిల్లీ : 2005లో బాంబే ఐఐటీలో విజయ్ నూకల అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఉదంతం నేపథ్యంలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక ఓ నివేదికను ప్రచురించింది. ఉన్నత విద్యా సంస్థలలో కుల వివక్ష ఎలా జడలు విప్పుతోందో ఆ నివేదిక బట్టబయలు చేసింది. విజయ్ ఆత్మహత్య ఉదంతం తర్వాత ఆధునిక భారతావని వదనంపై ఏర్పడిన గాయాలు పెద్దవై పోతూనే ఉన్నాయి. ఐఐటీ బాంబేలోనే దర్శన్ సోలంకి అనే దళిత విద్యార్థి జీవితం విషాదాంతం కావడం వ్యవస్థ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ఐఐటీలు, ఐఐఎంలు వంటి ఉన్నత విద్యా సంస్థలు ఒకప్పుడు విద్యార్థులకు స్వర్గధామంలా కన్పించేవి. వాటిలో సీటు దొరికితే చాలు... చిరకాల స్వప్నాలను సాకారం చేసుకోవచ్చునని వారు ఆశించేవారు. కానీ ఇప్పుడో? ఆ సంస్థలలో అంతా అనిశ్చితి...భయానక వాతావరణం. ముఖ్యంగా దళిత విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగించాల్సి వస్తోంది.

2014-2021 మధ్యకాలంలో ఐఐటీలు, ఐఐఎంలు, ఐఐఎస్‌సీలు, ఇతర కేంద్ర యూనివర్సిటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలలో చదువుతున్న 122 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2021లో లోక్‌సభకు తెలిపింది. వీరిలో సగం మంది దళిత బిడ్డలే. విద్యాలయాలలో ప్రవేశించిన కుల రక్కసి కోరలలో చిక్కి వీరంతా బలయ్యారు. కుల పక్షపాతం అనేది క్యాన్సర్‌లా వ్యాపించి సరస్వతీ మందిరాలను దహించివేస్తోంది.

అనికెత్ అంభోర్ నుండి దర్శన్ సోలంకీ వరకూ అందరూ ఈ వివక్షకు గురై ప్రాణా లు విడిచిన వారే. విద్యా సంస్థల నుండి కుల భూతాన్ని తరిమేయడంలో వ్యవస్థ వైఫల్యం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది. ఫలితంగా ఎందరో విద్యార్థుల మేథస్సు ఎవరికీ పనికిరాకుండా పోతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచంలో ప్రతి 40 సెకన్లకు ఒకరు చొప్పున ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ బలవన్మరణాల వెనుక అన్నీ కన్నీటి కథలే...వ్యథలే. వీరిని కాపాడుకోవడంలో సమాజం దారుణంగా విఫలమవుతోంది.

ఆ వర్సిటీల తీరే వేరు

ఐఐటీలతో పోలిస్తే హార్వర్డ్ యూనివర్సిటీ, జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలు విద్యార్థుల ఆత్మహత్యలను నివారించడంలో ఎంతో ముందడుగు వేశాయి. ఈ రెండు విశ్వవిద్యాలయాలు విద్యార్థుల మానసిక ఆరోగ్య అంశాలకు పెద్ద పీట వేశాయి. తమ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా నిరోధించాయి. విద్యార్థుల బాగోగులు చూసే విషయంలో వీటికి మంచి పేరుంది. ఐఐటీలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటోంది. అక్కడ విద్యార్థుల బాగోగులను పట్టించుకునే వారే ఉండరు. అసలు అధ్యాపకులకే ఆ సోయి ఉండదు. హార్వర్డ్, జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలలో విద్యార్థుల మానసిక ఆరోగ్యం కోసం వర్క్‌షాపులు, పలు కార్యక్ర మాలు నిర్వహిస్తారు. స్వేచ్ఛగా చర్చించుకునేందుకు అవకాశం ఇస్తారు. అవసరమైన విద్యార్థులకు మద్దతు ఇస్తూ ప్రోత్సహిస్తారు. కౌన్సిలింగ్ ఇవ్వడం, మానసిక నిపుణులతో మాట్లాడించడం వంటి సమగ్ర ఆరోగ్య సేవలు అందిస్తారు.

ఐఐటీలలో ఇలాంటివి మచ్చుకైనా కానరావు. సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు విద్యార్థులకు అవసరమైన మద్దతు ఆ సంస్థలతో లభించదు. హార్వర్డ్, జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంటే ఐఐటీలు కూడా విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించే అవకాశం ఉంటుంది. తద్వారా వారిలో మనోధైర్యాన్ని నింపి ఆత్మహత్య ప్రయత్నాల నుండి వారిని దూరం చేయవచ్చు.

మంత్రి శ్రీనివాస్ గౌడ్‌పై ఎలక్షన్ పిటిషన్ విచారణ

నవతెలంగాణ–హైదరాబాద్

తన ఎన్నికపై సవాల్ చేసిన పిటిషన్‌ను కొట్టేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వేసిన మధ్యంతర అభ్యర్థన పిటిషన్‌ను రాష్ట్ర హైకోర్టు తిరస్కరించింది. విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. 2018లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచాక ఆయన మంత్రి అయ్యారు. ఆ ఎన్నికల అఫిడవిట్ సమర్పించాక దానిని తిరిగి తీసుకుని మార్పులు చేర్పులు చేశారనీ, ఇది చట్ట వ్యతిరేకమని పేర్కొంటూ రాఘవేంద్రరాజు ఎన్నికల పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని జస్టిస్ లక్ష్మణ్ విచారణ చేపట్టి శ్రీనివాస్ గౌడ్ లేవనెత్తిన సాంకేతిక అంశాలు చెల్లవని తేల్చారు. ఎన్నికలు జరిగిన 45 రోజుల్లోగా ఎన్నిక చెల్లదని పిటిషన్ దాఖలు చేయాలన్న వాదనను సుప్రీంకోర్టు సైతం తోసిపుచ్చిందని గుర్తు చేశారు. రాఘవేంద్రరాజు దాఖలు చేసిన మెయిన్ పిటిషన్‌పై విచారణ చేపడతామని స్పష్టం చేశారు.

దేశ రక్షణే మా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

గాయాన్ని నయం చేయడానికి, ప్రతి మహిళ, చిన్నారుల కన్నీరు తుడిచేందుకు మా కూటమి ఇండియా ఉంది. ప్రజలందరిలో ప్రేమ, శాంతిని, తిరిగి తీసుకువస్తాం. మణిపూర్‌లో భారతదేశ ఆత్మను పునర్‌నిర్మిస్తాం " అని ట్వీట్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తున్నది...

- భారత ఆహార సంస్థతోనే సమస్యలు...:

రైస్ మిల్లర్స్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో –హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తమకు అన్ని విధాల సహకరిస్తున్నదనీ, అయితే భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)తోనే సమస్యలొస్తున్నాయని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ విమర్శించింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు గంపా నాగేందర్ మాట్లాడారు. రాష్ట్రంలో 110 లక్షల టన్నుల ధాన్యం రైస్ మిల్లుల్లో ఉందనీ, ఈ క్రమంలో రాబోయే పంటను ఎక్కడ నిల్వ చేసుకోవాలనే దానిపై ఇప్పటికే పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ ను కలిసినట్టు తెలిపారు. కొత్తగా వచ్చే పంటను స్థలాభావం వల్ల అన్‌లోడ్ చేసుకోవడానికి వారం రోజులు పడుతుందనీ, కేంద్ర ప్రభుత్వమే స్థలం చూపించాలని కోరారు. రబీ ధాన్యంపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమలో చాలా సమస్యలున్నాయనీ, అసత్యా ప్రచారాలు, అపోహలను నమ్మవద్దని కోరారు.

రాష్ట్రంలో 3 వేల మిల్లర్లలో ఎక్కడో ఒక దగ్గర జరిగేదాన్ని మొత్తానికి ఆపాదించడం సరికాదని తెలిపారు. యాసంగిలో 50 శాతం ధాన్యం నూకలవుతుందని వివరించారు. నూకల నష్టాన్ని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే భారత ఆహార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1,400 కోట్లు రావాల్సి ఉందని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం ఎక్కువగా పండుతుందనీ, వర్షాలు ఎక్కువగా రావడంతో ధాన్యం తడిచిందనీ, ముందు అనుకున్న దాని కన్నా బియ్యం తక్కువగా వస్తున్నాయని తెలిపారు. నాణ్యమైన ధాన్యాన్ని ఇస్తే తమకు ఎక్కువ ధాన్యం ఇచ్చే అవసరం లేదని తెలిపారు. గతంలో టన్నుకు 67 కిలోలు వస్తే, తడిచిన తర్వాత 60 కిలోలు మాత్రమే వస్తుందని చెప్పారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల తో పాటు ప్రభుత్వం నుంచి సాయం కోరుతూ తెలంగాణ ఆటో డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ నిజామాబాద్ జిల్లా కమిటీ ప్రతినిధులు కవితని కలిసి వినతి పత్రం అందజేశారు. వారి వినతి పట్ల కవిత సానుకూలంగా స్పందించారు.

ముందుగానే హామీ తీసుకోండి

న్యూఢిల్లీ : 2015లో ఎదురైన 'అవార్డ్ వాపసీ' చేదు అనుభవం భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూసేందుకు ప్రభుత్వానికి పార్లమెంటరీ కమిటీ కొన్ని సూచనలు చేసింది. రాజకీయ కారణాలతో నిరసన తెలుపుతూ ఏ దశలోనూ తమకు ఇచ్చిన అవార్డులను వాపసు ఇవ్వబోమని అవార్డు గ్రహీతల నుంచి ముందుగానే లిఖితపూర్వక హామీ పొందాలని సిఫార్సు చేసింది. కర్నాటకకు చెందిన ప్రముఖ రచయిత ఎంఎం కాల్‌బర్గీ దారుణ హత్యను నిరసిస్తూ తమకు ఇచ్చిన అవార్డులను వాపసు చేస్తున్నామని ఆ సందర్భం లో 39 మంది రచయితలు సాహిత్య అకాడమీకి తెలియజేసిన విషయం విదితమే. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీని (రవాణా, టూరిజం, సంస్కృతి) ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సోమవారం పార్లమెంట్ ఉభయసభలకు తన నివేదికను అందజేసింది. 'అవార్డులను వాపసు చేయడం సరైన చర్య కాదు. ఇతర అవార్డు గ్రహీతల విజయాలను ఇది తక్కువ చేసి చూపుతుంది. అంతేకాక అవార్డుల పేరు ప్రతిష్టలపై కూడా ప్రభావం పడుతుంది. రాజకీయ అంశాలకు, సాంస్కృతిక వ్యవహారాలకు సంబంధం లేదు. అకాడమీ ఓ స్వతంత్ర సంస్థ. అవార్డు ఎప్పుడు ఇచ్చినా దానిని అందుకునే వారి అనుమతి తప్పనిసరి. దీనివల్ల రాజకీయ కారణాలతో దానిని వాపసు చేయడం జరగదు. అలా వెనక్కి ఇవ్వడం దేశానికి అవమానకరం. వాపసు ఇవ్వబోమని హామీ పొందకుండా అవార్డులు ఇవ్వకూడదు. ఒకవేళ అవార్డును వెనక్కి ఇస్తే భవిష్యత్తులో వారి పేరును అవార్డు కోసం పరిశీలించకూడదు' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి నేతృత్వంలోని కమిటీ సూచించింది. ఈ కమిటీలో 10 మంది రాజ్యసభ, 31 మంది లోక్‌సభ ఎంపీలు సభ్యులుగా ఉన్నారు.

కాగా అలాంటి హామీ ఏదీ ముందుగా పొందనవసరం లేదని ఒక సభ్యుడు అభిప్రాయపడ్డారు. మనది ప్రజాస్వామ్య దేశమని, రాజ్యాంగం ప్రతి పౌరుడికి భావ ప్రకటనా స్వేచ్ఛను కల్పించిందని, అవార్డును వాపసు చేయడం కేవలం నిరసనలో భాగమేనని ఆయన తెలిపారు. మరో సభ్యుడు కూడా ఆయనతో ఏకీభవించారు.

ఫీవర్ ఫియర్..!

(మొదటిపేజీ తరువాయి)

నాలుగు ఏరియా ఆస్పత్రులకు రోజుకు 400 వరకు ఓపీ ఉంటుంది. యూపీహెచ్‌సీలకు సాధారణ రోజుల్లో 50 వరకు ఓపీ ఉండగా.. ప్రస్తుతం 100కు పైగా ఉంటుంది. ఈ ఓపీల్లో సగం వరకు సీజనల్ వ్యాధుల బారిన పడిన వారే ఉంటున్నట్టు వైద్యులు చెబుతున్నారు. వారం రోజులుగా వాతావరణ మార్పులతో ఈ పరిస్థితి ఏర్పడినట్టు వైద్యులు చెబుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మూడేండ్లుగా మలేరియా కేసులు పెద్దగా నమోదు కాలేదు. డెంగ్యూ కేసులు ఏటా వస్తున్నాయి. 2021లో 4 వేలు, 2022లో మరో నాలుగు వేల డెంగ్యూ కేసులు వెలుగు చూశాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు 500కు పైగా కేసులు బయట పడ్డాయి. రెండు, మూడు నెలల్లో కేసులు మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు.

పాత రోగులు.. కొత్త రోగులు..

రోగుల తాకిడి ఎక్కువగా ఉన్న ఆస్పత్రులకు వచ్చే వారిలో ఇది వరకు డాక్టర్లను సంప్రదించి మరోసారి చూపించుకునేందుకు వచ్చే కేసులు కూడా ఉంటున్నాయి. కొత్తగా ఓపీకి వచ్చేవారి వివరాలు నమోదు చేసి, డాక్టర్లను సంప్రదించే వరకు గంటల సమయం పడుతోంది. దీంతో పేషెంట్లు లైన్‌లో గంటల కొద్దీ నిలబడాల్సి వస్తుండటంతో మొదటిసారి ఓపీ కోసం వచ్చిన వారికి ఆలస్యమవుతోంది. పాత రోగులు, కొత్త రోగులు కలిసి వస్తుండటంతో ఆస్పత్రుల ఓపీ విభాగాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

నాలుగు రోజుల మెడిసిన్

జ్వరం, దగ్గు, నీరసం, జలుబు, ఒంటి నొప్పులు లాంటి లక్షణాలతో ఆస్పత్రులకు వచ్చే పేషెంట్లకు వైద్యులు మొదట నాలుగు రోజులకు సరిపడా మెడిసిన్ రాసిస్తున్నారు. తగ్గకుంటే మరోసారి రావాలని సూచిస్తున్నారు. రెండోసారి వస్తే టెస్టులకు రెఫర్ చేస్తున్నారు. బ్లడ్ శాంపిల్స్ సేకరించి తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్లకు పంపుతున్నారు. రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఈ శాంపిల్స్ ఫలితాలు రావడానికి దాదాపు 24 గంటల వరకు సమయం పడుతోంది.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. కలుషిత నీరు, ఫుడ్‌కు దూరంగా ఉండాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. వేడి ఆహారం తీసుకోవాలి. వాతావరణంలో మార్పులు, కలుషిత నీటితో వాంతులు, విరేచనాలు, డయేరియా బారిన పడే ప్రమాదం ఉంటుంది. వరదలు తగ్గాక దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా, కలరా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ జాగ్రత్తలు తీసుకుంటే రోగాల బారినపడకుండా ఉండొచ్చు.

డాక్టర్ రాజారావు, సూపరింటెండెంట్, గాంధీ ఆస్పత్రి

ఏపీలో భారీగా తగ్గిన ధాన్యం సేకరణ

- తెలంగాణలో తగ్గి పెరిగింది :

లోక్‌సభలో మంత్రి నరేంద్ర సింగ్ తోమర్

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం సేకరణ భారీగా తగ్గుతుంది. తెలంగాణలో తగ్గి పెరిగింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఇచ్చిన వివరాలు స్పష్టం చేస్తున్నాయి. లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఏపీలో కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరణ 2020-21లో 56.66 లక్షల మెట్రిక్ టన్నుల చేస్తే, 2021-22లో అది 44.61 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గిందని, 2022-23లో 28.34 లక్షల మెట్రిక్ టన్నులు తగ్గింది. తెలంగాణలో ధాన్యం సేకరణ 2020-21లో 94.53 లక్షల మెట్రిక్ టన్నుల చేస్తే, 2021-22లో అది 73.94 లక్షల మెట్రిక్ టన్నులకు తగ్గిందని, 2022-23లో 88.26 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగిందని తెలిపారు. గత రెండేండ్లుగా ఏపీ, తెలంగాణలో పత్తి సేకరణ జరగటం లేదు. అంతక ముందు తెలంగాణలో పత్తి సేకరణ తగ్గగా, ఏపిలో పెరిగింది. ఏపిలో వేరుశెనగ సేకరణ గత రెండేళ్లుగా జరగటం లేదు. అంతకు ముందు రెండేళ్లు సేకరణ జరిగింది. తెలంగాణ సోయాబిన్ సేకరణ గత మూడేళ్లుగా జరగ లేదు. అంతకు ముందు రెండేళ్లు జరిగింది. తెలంగాణలో సన్ ఫ్లవర్ 2022-23లో 6,500 మెట్రిక్ టన్నులు సేకరించారు. అంతకు ముందు రెండేండ్ల సేకరణ జరగలేదు. ఏపీ, తెలం గాణలో శెనగ సేకరణ తగ్గింది. ఏపీలో పెసలు సేకరణ 2022 -23లో జరగలేదు. 2021-22లో 2,209.52 మెట్రిక్ టన్నులు సేకరణ జరిగింది. తెలంగాణలో 2022-23లో కేవలం 58.35 మెట్రిక్ టన్నుల సేకరణ జరిగింది. 2021-22లో సేకరణ జరగలేదు.

దేశం అప్పు రూ.220.5 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సీపీఐ(ఎం) ఎంపీ ఎలమారం కరీం అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2016లో 36 కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకున్నామని, అందులో హెచ్‌పీసీఎల్, ఎయిర్ ఇండియా, డ్రెజ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వంటి పది సంస్థల ప్రయివేటీకరణ ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్, బీపీసీఎల్, ఐడీబీఐ బ్యాంక్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సిఈఎల్ వంటి 26 ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ప్రకియ వివిధ దశల్లో ఉందని తెలిపారు.

బ్యాంకులకు రూ.5.71 లక్షల కోట్లు మొండి బకాయిలు

దేశంలో రూ.5.71 లక్షల కోట్లు మొండి బకాయిలు ఉన్నాయని కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి భగవత్ కరడ్ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 2023 మార్చి 31 నాటికి దేశంలోని బ్యాంకులకు రూ.5,71,515 కోట్లు మొండి బకాయిలు ఉన్నాయని ఆర్‌బీఐ తెలిపినట్లు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీలకు మినహా కుల గణన జరగలేదు

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జన గణనలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ) మినహా కులాల వారీగా జనాభాను కేంద్ర ప్రభుత్వం లెక్కించలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తెలిపారు. లోక్‌సభలో ఒకప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. రాబోయే జనాభా గణనలో కుల వివరాలను సేకరించాలని కొన్ని రాజకీయ పార్టీలు, కొన్ని సంఘాలు అభ్యర్థించాయని తెలిపారు.

'ఉపాధి' నిధుల విడుదలలో రూ.20,309 కోట్ల కోత

గత మూడేండ్లలో ఉపాధి హామీ నిధులు విడుదలలో రూ.20,309.2 కోట్లు కోత జరిగింది. ఈ మేరకు లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి ఇచ్చిన సమాధానంలో ఈ విషయం స్పష్టం అయింది. ఉపాధి హామీకి 2020-21లో రూ.1,11,170.86 కోట్ల నిధులు విడుదల అయితే, 2021-22 నాటికి రూ.98,467.85 కోట్లకు తగ్గిందని, 2022-23 నాటికి రూ.90,861.96 కోట్లకు తగ్గిందని తెలిపారు.

గత ఐదేండ్లలో దేశం అప్పులు

ఏడాది	కేంద్రం అప్పు (లక్షల కోట్లు)	రాష్ట్రాల అప్పు (లక్షల కోట్లు)	మొత్తం (లక్షల కోట్లు)
2018-19	రూ.93.3	రూ.47.9	రూ.133
2019-20	రూ.105.1	రూ.53.5	రూ.150.9
2020-21	రూ.121.9	రూ.61.6	రూ.174.1
2021-22	రూ.138.7	రూ.67.9	రూ.195.5
2022-23	రూ.155.6	రూ.76.1	రూ.220.5

ఇండియా కూటమిపై మోడీ విసుర్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీ చేరుకోగానే నేతలంతా చప్పట్లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రతిపక్షాల ఇండియా కూటమిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇండియా అని పేరు పెట్టుకొన్నంత మాత్రాన... ప్రతిపక్షాల తీరు మారుతుందా..? అని ప్రశ్నించారు. గతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ, ఇండియన్ ముజాహిదీన్ వంటి వాటి పేర్లలో కూడా ఇండియా ఉందన్నారు. ఆఖరికి పీఎఫ్ఐ వంటి ఉగ్ర సంస్థల పేరులో కూడా ఇండియా ఉందన్నారు. ఇప్పటి వరకు ఇలాంటి దిశ, దశ లేని ప్రతిపక్షాన్ని చూడలేదన్నారు. కాగా.. ఈ సమావేశంలో మణిపూర్ హింస నేపథ్యంలో ప్రతిపక్షాల ఆందోళన, పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలపై బీజేపీ పార్లమెంటరీ పార్టీ చర్చించింది.

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా పంచాయత్ రాజ్ ఇంజనీర్ వారి కార్యాలయం, పిఆర్, హన్మకొండ
టెండర్ నోటీసు: తేది:24-07-2023
దిగువ పేర్కొన్న హన్మకొండ జిల్లాలో నిర్వహించాల్సిన మూడు (03) పనులను సిడిపి/15వ సిఎఫ్‌సి/ఎంఎంపి ప్రకారం రూ.55.32 లక్షల అంచనా వ్యయంతో చేపట్టాలి. టెండర్లు http://tenders.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ లో అప్‌లోడ్ చేసిన మరియు ప్రచురించిన తేదీ నుంచి ఏడు (07) పని దినాల్లో 27-07-2023 నుంచి 04-08-2023 వరకు అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉంచబడును. పూర్తి వివరాలను ఈ కార్యాలయం నుంచి పొందవచ్చును.
సం/-
డిస్ట్రిక్ట్ పంచాయత్ రాజ్ ఇంజనీర్
DIPR R.O.No.4633-PP/CL/ADVT/1/2022-23, Dt.25.07.2023

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిఆర్ డివిజన్, భద్రాచలం
ఎన్‌ఐటి నెం.డిపి/3/టెండర్లు/2023-24, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ తేది:21-07-2023కు అనుబంధం
... టెండర్ ఫామ్‌ను 28-07-2023 నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ... సంప్రదించాల్సిన నెంబర్: 08743-231312 పూర్తి వివరాల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ యొక్క వెబ్‌సైట్ https://tender.telangana.gov.in నందు సంప్రదించగలరు.
DIPR R.O.No.1102-DP/CL/ADVT/1/2023-24, Dt.25-07-2023
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ఉప్పొంగిన క'న్నీటి' కష్టం..!

నదీ పరివాహక ప్రాంతాలు అల్లకల్లోలం

- తీవ్ర నష్టాన్ని మిగిల్చిన వరద
- నీటిలోనే మునిగిన పత్తి, సోయా, కంది మొక్కలు
- మూడు సార్లు విత్తనం వేసినా.. చేతికొచ్చే పరిస్థితి లేదు
- పైరు ఎదుగుదల దశలోనే అన్నదాతలకు తీరని నష్టం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంపైనే ఆశలు





ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం ఆనందపూర్ గ్రామానికి చెందిన ఈ రైతు పేరు నోముల రాజురెడ్డి. పెన్‌గంగా నదీ తీరంలో సొంతంగా 10 ఎకరాలు ఉంది. మరో 12 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. తొలుత వర్షాభావ పరిస్థితులతో వేసిన విత్తనాలు మొలకెత్తలేదు. రెండుసార్లు విత్తనాలు విత్తాల్సి వచ్చింది. పత్తి పైరు పెరిగిన తర్వాత అధిక వర్షాలతో పెన్‌గంగా నది ఉగ్రరూపం దాల్చి తీర ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో పత్తి పైరు బురదలో కూరుకపోయి మురిగిపోయింది. చాలా వరకు కొట్టుకుపోయింది. 10 ఎకరాల వరకు పంట నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి సుమారు రూ.30వేల వరకు నష్టం జరిగినట్టు చెబుతున్నారు. ఇలా అనేక మంది రైతులకు వరద తీవ్ర నష్టం చేకూర్చింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, జైనథ్

ఎడతెరిపి లేని వర్షాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి తీరని నష్టాన్ని మిగిల్చాయి. నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో తీర ప్రాంతాలు అల్లకల్లోలంగా మారాయి. రెండుసార్లు వేసిన విత్తనం భూమిలోనే ఉండిపోతే.. మూడోసారికి విత్తనం మొలకెత్తితే.. ఆ పైరునూ వరద ముంచింది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న పచ్చని పైర్లను వరద ముంచెత్తడంతో అన్నదాతల ఆవేదన అంతా ఇంతా కాదు. కోలుకోలేని నష్టం సంభవించింది. పత్తి, సోయా, కంది పంట పొలాల్లో బురద, ఇసుక మేటలు వేయడంతో మొక్కలు నీటిలోనే మురిగిపోయాయి. ఖరీఫ్ ప్రారంభంలోనే నష్టాలను చవి చూసిన తమకు రానున్న కాలం ఏ మేరకు సహకరిస్తుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అందించే సాయంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 80శాతం మంది రైతులు వర్షాధారం మీదనే ఆధారపడి సాగు చేస్తుంటారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో 16.80లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగు చేస్తుండగా.. ఇందులో అధికభాగం 11లక్షల ఎకరాల్లో పత్తి పంట వేశారు. 5లక్షల ఎకరాల్లో సోయా, కంది పంటలు వేశారు. ఖరీఫ్ ఆలస్యమైనా పంట ఎదుగుతుందని సంబర పడిన అన్నదాతలు తాజాగా కురిసిన వర్షాలతో కన్నీరు మున్నీరవుతున్నారు. మహారాష్ట్ర ప్రాంతంలోనూ ఇదే మాదిరి వర్ష ప్రభావం ఉండటంతో గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా, వార్దా నదులు ఉప్పొంగి ప్రవహించాయి. వాగులు, వంకలు సైతం ఉగ్రరూపం దాల్చడంతో వాటి పరివాహక ప్రాంతాల్లోని పైర్లు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టిన రైతులకు చివరకు కన్నీరే మిగిలింది.

మూడు సార్లు విత్తనాలు

మృగశిరకార్తె ప్రారంభంలో రైతులు విత్తనాలు వేసినా.. వర్షాలు రాకపోవడంతో విత్తనాలు భూమిలోనే పోయాయి. తర్వాత వర్షం కురవడంతో మళ్లీ విత్తారు. ఆ తర్వాత మళ్లీ వర్షాల జాడ లేక వేసిన విత్తనాలు మొలకెత్తలేదు. తీరా వర్షాలు ఊపందుకున్నాక విత్తనాలు వేయగా.. పత్తి, సోయా, కంది పైర్లు కొంత ఎత్తు వరకు పెరిగాయి. దీంతో రైతులు కలుపు తీయించడం, ఎరువులు వేయడం వంటి చర్యలు చేపట్టారు. పైరు ఎదిగే క్రమంలో వర్షాలు పడటంతో వరద తాకిడికి పైర్లు తట్టుకోలేక కొట్టుకుపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో పంటలను పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు సుమారు 25వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ వేలాది ఎకరాల్లో నష్టం జరిగింది. మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో స్వల్పంగా పంటలు దెబ్బతిన్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో మాత్రం నష్టం మరింత ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులకు ఇన్సూరెన్సు సౌకర్యం లేకపోవడంతో వాతావరణ ఆధారిత బీమా వర్తించే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఈ విపత్తును పరిగణనలోకి తీసుకొని రైతులను ఆదుకోవాల్సి ఉంటుంది.

వరదతో పైరంతా పోయింది



నాకు పెన్‌గంగా నదీ తీరంలో 2.50ఎకరాల పొలం ఉంది. పత్తి, కంది పంట వేశాను. రెండు సార్లు విత్తనాలు మొలవకపోవడంతో మూడోసారి కూడా వేశాను. పైరు ఎదిగేందుకు ఎరువులు వేసి కలుపు తీయించాను. ఇప్పుడు వర్షాలు అధికం కావడం.. నది ఉప్పొంగడంతో పైరు వరదపాలైంది. ఎకరానికి పెట్టుబడి రూపంలో సుమారు రూ.30వేల వరకు ఖర్చు చేశాను. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకుంటుందనే ఆశతో ఉన్నాం.

– పి.రమేష్, డొలార, జైనథ్ మండలం

వర్షంలోనూ జీపీ కార్మికుల సమ్మె

- దప్పు చప్పులతో బోనాల ఊరేగింపు నిరసన ర్యాలీలు

నవతెలంగాణ- విలేకరులు

తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం వర్షంలోనూ కొనసాగింది. నిరసన ర్యాలీలు, ధర్నాలు చేశారు. పలుచోట్ల డప్పు చప్పుల మధ్య బోనాలతో ఊరేగింపు తీశారు.

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టారు. ఏన్కూర్‌లో దీక్ష శిబిరం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ వర్షంలో ర్యాలీ చేపట్టి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కొణిజర్లలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అధికారులు కార్యాలయంలో వెళ్లకుండా అడ్డుకున్నారు. కార్యాలయం గేట్‌కు తాళం వేసే ప్రయత్నం చేయగా ఎంపీడీవో రమాదేవి హామీతో ఆందోళన విరమించారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. కామేపల్లిలో జెడ్పీటీసీ ప్రమీణ్‌కుమార్ నాయక్ సంఘీభావం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో భిక్షాటన చేశారు. ఆళ్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు.

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో డీసీసీ అధికార ప్రతినిధి, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కార్మికులతో కలిసి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్‌లో పంచాయతీ కార్మికులు వర్షంలోనే వంటావార్పు నిర్వహించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలో పంచాయతీ కార్మికులు డప్పు చప్పుల్ల మధ్య బోనాలతో ఊరేగింపు తీశారు.

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో రేణుకాఎల్లమ్మకు బోనాలు సమర్పించి పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. సంస్థాన్‌నారాయణపురంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో సమ్మెకు కౌలురైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అన్నెంపాపిరెడ్డి సంఘీభావం తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు ఆవుకు వినతిపత్రం ఇచ్చారు. ఇచ్చోడ మండల కేంద్రంలో ఒంటి కాలుపై నిల్చొని నిరసన తెలిపారు.

మావోయిస్టులపై సమిష్టి వ్యూహంతో దాడి

- నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల డీజీపీల సమావేశంలో నిర్ణయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నిషేధిత మావోయిస్టులపై సమిష్టి వ్యూహాలతో దాడులు నిర్వహించాలనీ, అందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని మావోయిస్టు ప్రభావిత నాలుగు రాష్ట్రాల డీజీపీలు నిర్ణయించారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ నేతృత్వంలో మహారాష్ట్ర డీజీపీ రజనీశ్ సేత్, ఛత్తీస్‌గఢ్ డీజీపీ అశోక్ జునేజా, ఆంధ్రప్రదేశ్ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిలతో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశమై మావోయిస్టుల కార్యక్రమాలను నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మావోయిస్టుల కార్యకలాపాలు, ప్రస్తుతం వారి బలం, కొత్త రిక్రూట్‌మెంట్ అనే అంశాలపై ఆయా రాష్ట్రాల డీజీపీలు చర్చించారని తెలిసింది. అయితే, ఏమరపాటు తగదనీ, సరిహద్దు రాష్ట్రాలుగా మావోయిస్టు కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ వారి కార్యకలాపాలను కఠినంగా అణచివేయడానికి సమిష్టిగా వ్యూహాలతో ముందుకు సాగాలని నిర్ణయించినట్టు తెలిసింది. ముఖ్యంగా కొత్తగా మావోయిస్టుల్లో ఎవ్వరూ చేరకుండా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యకలాపాలను కూడా ఆయా రాష్ట్రాలు చేసేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇంటిలిజెన్స్ అదనపు డీజీ అనిల్‌కుమార్, రాష్ట్ర ఆపరేషన్స్ ఐజీ ప్రభాకర్‌రావు, రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్, మరో ఐజీ రాజీవ్‌కుమార్ మీనా, సీఆర్పీఎఫ్ అదనపు డీజీ చారుసిన్హా, కేంద్ర ఇంటిలిజెన్స్ బ్యూరో అధికారులు హాజరయ్యారు.



ఇంటర్ స్పాట్ డీఏ వెంటనే ఇవ్వాలి

- విద్యాశాఖ కార్యదర్శికి టీపీటీఎల్ఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న అధ్యాపకులకు డీఏ, రెమ్యూనరేషన్‌ను వెంటనే ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రయివేట్ టీచర్లు లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్, నాయకులు కొమ్ము విజయ్, పుట్టపాగ విజయ్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. మార్చ్, ఏప్రిల్‌లో జరిగిన ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న లెక్చరర్లకు ఇప్పటివరకు డీఏ ఇవ్వకుండా ఆపారని తెలిపారు. రెండు నెలలు గడిచినా ఇవ్వకపోవడం అన్యాయమని విమర్శించారు. డీఐఈవోలను అడిగితే విద్యాశాఖ నుంచి ఆలస్యమవుతున్నట్టు సమాధానమిస్తున్నారని పేర్కొన్నారు. డీఏ ఇంకా తాత్సారం చేయకుండా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పాట్ రెమ్యూనరేషన్ కూడా ఇంకా ఇవ్వలేదని తెలిపారు. ఆన్‌లైన్ పేరుతో ఆలస్యం చేయడం సరైంది కాదనీ, వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.

సర్కారు నిర్ణయంతో తెలంగాణ విద్యార్థులకు నష్టం : టీజూడా

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మెడికల్ కాలేజీల్లో 2014 తర్వాత పెరిగిన సీట్లతో పాటు కొత్త కాలేజీల్లో తెలంగాణ విద్యార్థులకు కేటాయించిన 15 శాతం రిజర్వేషన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలగించిందని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) తెలిపింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ టీజూడా అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో మాత్రం కొత్త కాలేజీల్లో మాత్రమే రిజర్వేషన్‌ను తొలగించారనీ, పాత కాలేజీల్లో పెరిగిన సీట్లకు రిజర్వేషన్ ను యధావిధిగా వర్తింపజేస్తున్నారని తెలిపారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని వివరించారు.

మణిపూర్ ఘటనలకు బీజేపీదే బాధ్యత

ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

- ప్రధాని స్పందించాలి
- వామపక్షాలు, ప్రజాసంఘాల డిమాండ్
- రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

నవతెలంగాణ- విలేకరులు



"మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన దారుణాలు, ఘర్షణలకు అక్కడ అధికారంలో ఉన్న బీజేపీనే బాధ్యత వహించాలి.. ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి.. ప్రధాని నరేంద్ర మోడీ స్పందించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి.. గిరిజన మహిళలపై జరిగే ఆకృత్యాలు జాతీయ మహిళా కమిషన్‌కు కనపడటం లేదా.." అంటూ సీపీఐ(ఎం), సీపీఐ, ప్రజాసంఘాల నేతలు ప్రశ్నించారు. మంగళవారం కూడా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు.మంచిర్యాల జిల్లా కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. తాండూర్ ఐబిలో రాస్తారోకో చేశారు. జన్నారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. మణిపూర్‌లో బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని ర్యాలీ నిర్వహించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య తదితరులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో టీఏజీఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ తీశారు. టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు తొడసం భీంరావు, లంక రాఘవులు, బైరి సోమేశ్ పాల్గొన్నారు.రంగారెడ్డి జిల్లా మహేశ్వరం పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శించారు. యాచారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తాలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. నూతనకల్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. హుజూర్‌నగర్‌లో ప్రధాన రహదారిపై ర్యాలీ తీశారు. శాంతిభద్రతలను కాపాడలేని మణిపూర్ ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. మిర్యాలగూడ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఖమ్మం ధర్నాచౌక్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో వర్షంలో తడుస్తూనే పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. భద్రాచలంలో మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేశారు. సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద ర్యాలీ తీశారు. హుస్నాబాద్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.

సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఐ.యస్ సదన్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి. అబ్బాస్ మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలకు ఆ ప్రభుత్వమే కారణమని, వెంటనే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. హయత్‌నగర్ బస్ డిపో వద్ద జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందోజు రవీంద్రాచారి మాట్లాడారు. హైదరాబాద్ చిలకలగూడ గాంధీ విగ్రహం ముందు సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. మెహదీపట్నం చౌరస్తాలో ఆవాజ్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

మణిపూర్ ఘటన నిందితులను వెంటనే అదుపులోకి తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలోని ప్రధాన విధులతో పాటు, శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. చేవెళ్ల పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శంకర్‌పల్లి చౌరస్తా వద్ద నిరసన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, సాగర్ రహదారిపై రాస్తారోకో చేశారు.

లాంఛనప్రాయంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank

బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హెూసర్ మెయిన్ రోడ్, బెంగళూరు– 560068.

ఏదైతే,

ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్, ఈ పదం సక్సెస్సర్ మరియు అసైన్‌ను కలుపుకొని) మరియు రుణగ్రహీత& సహరుణగ్రహీత, దిగువ పేర్కొన్న ("రుణగ్రహీత(లు), ఈ పదం అతడి యొక్క/దీని యొక్క /వారి యొక్క సంబంధిత (సక్సెస్సర్స్, అసైన్స్, చట్టబద్ధవారసులు) ప్రకారం గృహ సంబంధిత రుణం లోన్ అగ్రిమెంట్‌కు అనుగుణంగా జారీ చేయబడింది. దిగువ సంతకందారుడైన సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ("అధీకృత అధికారి") అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ("యాక్ట్") క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను లోన్ అగ్రిమెంట్ ప్రకారం తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ ప్రత్యేకంగా పేర్కొన్న రుణగ్రహీతలకు/ సహ–రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి.

రుణగ్రహీతలు/సహ–రుణగ్రహీత పొందిన బకాయి మొత్తాన్ని డిమాండ్ నోటీసులో పేర్కొన్న విధంగా తిరిగి చెల్లించేందుకు ఆసక్తి కనబర్చలేదు మరియు విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీతలు/సహ–రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వదమేమనగా, దిగువ–పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకొన్నారు. ఆస్తుల యొక్క లాంఛనప్రాయం స్వాధీనతకు సంబంధించిన వివరాలు దిగువ ఇవ్వబడినవి.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ లోన్ అకౌంట్ నెంబర్	ఆస్తి వివరణ/ లాంఛనప్రాయంగా స్వాధీనతా తేదీ	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	అలవాల వీరభద్రం / అలవాల పద్మ/ LBKHA00000581988	(ఆస్తికి సంబంధించి లోన్ డాక్యుమెంట్‌లోని వివరాల ప్రకారం/ఆస్తి డాక్యుమెంట్‌లోని వివరాల ప్రకారం ప్లాట్ నెంబర్లు 115, సర్వే నెంబర్ 472& 473, ఖమ్మం–జిపి లిమిట్స్, ఖమ్మం అర్బన్ మండలం, ఖమ్మం, తెలంగాణ, ఖమ్మం–507001 (ప్రదేశం యొక్క విస్తీర్ణం. హద్దులు:ఉత్తరం: సేల్ డీడ్ ప్రకారం, దక్షిణం: సేల్ డీడ్ ప్రకారం, తూర్పు: సేల్ డీడ్ ప్రకారం, పడమర: సేల్ డీడ్ ప్రకారం /లాంఛనప్రాయంగా స్వాధీనతా తేదీ: 20-07-2023	13.07.2021 Rs. 3,89,941.00/-	ఖమ్మం

ఇందుమూలంగా పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/ హామీదారు(ల)కు మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా 30 రోజుల ప్రకటన ఇవ్వబడింది, ఒకవేళ బకాయిల చెల్లింపులో విఫలమైనట్లయితే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తర్వాత తాకట్టుపెట్టిన ఆస్తులను విక్రయించబడును.

తేది:26, జులై, 2023
ప్రదేశం: ఖమ్మం

అధీకృత అధికారి
సెక్యూర్డ్ క్రెడిటార్



ఒకే దేశం...ఒకే పెన్షన్ ఎందుకు అమలు చేయరు?

- కనీస పెన్షన్ రూ.9వేలుగా నిర్ణయించాలి
- 'నో ఇన్‌క్రీజ్ ఇన్ పెన్షన్–నో ఓట్' స్టిక్కర్ ఆవిష్కరణలో టాప్రా అధ్యక్షప్రధాన కార్యదర్శులు నారాయణరెడ్డి, కృష్ణమూర్తి

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

'ఒకే దేశం..ఒకే టాక్స్' అంటూ గొప్పలు చెబుతున్న కేంద్ర ప్రభుత్వం 'ఒకే దేశం...ఒకే పెన్షన్'ను ఎందుకు చేయడంలేదని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.నారాయణరెడ్డి, పి.కృష్ణమూర్తి ప్రశ్నించారు. కనీసం పెన్షన్ రూ.9వేలు ఉండాలని, దీన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనీ, ఈపీఎస్ పెన్షన్ లేని బీపీఎల్ ఉద్యోగులకు ఆసరా ఫించన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'నో ఇన్‌క్రీజ్ ఇన్ పెన్షన్–నో ఓట్' స్టిక్కర్ ఆవిష్కరించారు.

అనంతరం వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తమ సమస్యలను ఏ పార్టీ పరిష్కరిస్తుందో, వాటిని మ్యానిఫెస్టోలో చేరుస్తుందో, పెన్షన్ పెంచుతామని ప్రస్తావిస్తుందో ఆ పార్టీకే ఓటేస్తామని ప్రకటించారు. పెన్షన్ పెంపు, ఇతర సమస్యలను పరిష్కరించాలని దశాబ్ద కాలంగా పోరాడుతున్నా కేంద్రప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నదని అన్నారు. భగత్‌సింగ్ కోషియారి కమిటీ రిపోర్టు ప్రకారం డీఏ మూడువేలకుపైగా చెల్లించాలని, పెరుగుతున్న ధరలకనుగుణంగా డీఏ పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో బీపీఎల్ పెన్షనర్లకు ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి కె.నాగేశ్వర్‌రావు, ఉపప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి, ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, నాయకులు అరుణ, సమ్మయ్య, బి. రామారావు, ఎన్.సోమయ్య పాల్గొన్నారు.

జీపీ వర్కర్ల సమ్మెకు సీఐటీయూ మద్దతు

నేడు మండల కేంద్రాల్లో సంఘీభావ ప్రదర్శనలు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. వారికి సంఘీభావంగా మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావ ప్రదర్శనలు చేయాలని కార్మికులకు పిలుపునిచ్చింది. సోమవారం ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రంలోని 12,769 పంచాయతీల్లో 50 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారిలో అత్యధికులు దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలేననీ, 20–30 ఏండ్ల నుంచి పనులు చేస్తున్నప్పటికీ వారి పనికి గుర్తింపు, పని భద్రత, కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలేవీ అమలు కావడం లేదని పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూలై ఆరో తేదీ నుంచి జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. వారి పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నట్టుగానే జీవో నెం.60 ప్రకారం రూ.15,600 వేతనాన్ని అమలు చేయాలనీ, జీఓ నెం.51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించి సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలను విడుదల చేయాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై వేధింపులను ఆపాలని కోరారు.

మల్టీపర్పస్ విధానంతో నైపుణ్యం లేని పనులు చేస్తూ కార్మికులు తమ ప్రాణాలను కోల్పోతున్న తీరును వివరించారు. ప్రమాదంలో మరణించిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, నష్టపరిహారం లాంటివి కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి ఉద్యోగి, కార్మికునికి రూ.399 కేంద్ర ప్రభుత్వ తపాల బీమా ప్రీమియంతో ప్రభుత్వమే రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ,కార్మిక సంఘాల జేఏసీతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు.

మిషన్ భగీరథ కార్మికుల సమ్మె

- పంపు ఆపరేటర్లను కొనసాగించాలని డిమాండ్

నవతెలంగాణ – నల్లగొండ కలెక్టరేట్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె మంగళవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మిషన్ భగీరథ కార్మిక సంఘాల జేఏసీ చైర్మెన్ జంజిరాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వీఆర్ఏలను పంపు ఆపరేటర్లుగా రిక్రూట్ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధిత సర్టిఫికెట్‌ను కలిగి 15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్లను కొనసాగించాలని కోరారు. మిషన్ భగీరథ ఎస్ఈ సురేష్ కుమార్, డిఈలు రామకృష్ణ, గిరిధర్, సీయాన్ కాంట్రాక్టర్ శేఖర్ కార్మికుల వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పినట్టు తెలిపారు. ఈ సమ్మెలో ఆ సంఘం కో చైర్మెన్లు టి.కృష్ణ, బి.వెంకటేశం, కార్యదర్శులు ఎండి.జానీ, ఎన్.శ్రీను, కె.సైదులు, లక్ష్మమ్మ, యాదమ్మ సైదులు, శంకర్, రఫీ, వెంకటమ్మ, నరేందర్, మల్లేష్, నరేందర్, కృష్ణ, రవి, మధు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ ప్రకటన

ICICI Bank

బ్రాంచి ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మనహళ్లి, హెూసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు-560068.

దిగువ రుణగ్రహీతలు బ్యాంకు నుండి పొందిన రుణ సదుపాయంలో అసలు మరియు వడ్డీని తిరిగిచెల్లించుటలో డీఫాల్టైనందుట ద్వారా వారి ఖాతాలు నాన్–పెర్ఫామింగ్ అసెట్ (ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. వారి గతంలో తెలిసిన చిరునామా పై సెక్యూరిటైజేషన్ అండ్ రీ–కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్–2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి నోటీసు జారీచేయబడినది. అయితే, వారికి బట్వాడా కానందున, ఈ బహిరంగ ప్రకటన రూపేనా ఇందుమూలంగా తెలియజేయబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ–రుణగ్రహీత/ హామీదారు పేరు/ (రుణ ఖాతా నంబరు)& చిరునామా	స్వాధీనంచేసుకున్న సెక్యూర్డ్ అసెట్ ఆస్తి చిరునామా	పంపిన నోటీసు తేదీ/నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తాలు	ఎన్‌పిఏ తేది
1.	సత్యనారాయణ స్వామి ఫెర్టిలైజర్స్, చిట్టిమెళ్ల శ్రీధర్ & చిట్టిమెళ్ల భారతి / ఇ.నం. 4-5-1-డి/3, వాసవి కాలనీ, గణేష్ స్ట్రీట్, జనగాం, తెలంగాణ,-506167/ 070305500141.	ఆస్తి–1: జనగాం జిల్లా యొక్క జనగాం సబ్–డిస్ట్రిక్ట్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో జనగాం మున్సిపాలిటీ పరిధిలోని జనగాం పట్టం, వార్డు నం.6, బ్లాక్ నం.3 వద్దగల సర్వే నం.161/2, 161/1/8 మరియు 161లో ప్లాట్ నం.9,10,11& 12 యొక్క 622.75చ.గ.లు లేదా 520.61చ.మీ.ల విస్తీర్ణంతో ఖాళీ ప్లాట్ ల్యాండ్ ఆస్తి. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.13, పడమర: 30అ.ల వెడల్పు రోడ్డు, ఉత్తరం: పొనుగంటి శ్యామ్ సుందర్ యొక్క ఖాళీ ప్లాట్లు, దక్షిణం: 20అ.ల వెడల్పు రోడ్డు, ఆస్తి–2: జనగాం జిల్లా యొక్క జనగాం సబ్–డిస్ట్రిక్ట్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో జనగాం మున్సిపాలిటీ పరిధిలోని జనగాం పట్టం వద్దగల సర్వే నం.128/సి మరియు 129/సి లో ప్లాట్ నం.11 యొక్క 150.00చ.గ.లు లేదా 125.40చ.మీ.ల విస్తీర్ణపు ల్యాండ్ ఏరియాలోకి వచ్చు మున్సిపల్ ఇంటి నం.4-5-1/డి/3 గల గ్రౌండ్& మొదటి అంతస్తులు కలిగియున్న ఆర్‌సిసి భవనము మొత్తం ఆస్తి. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.10, పడమర: ప్లాట్ నం.12, ఉత్తరం: ఇతరుల ఖాళీ స్థలము, దక్షిణం: 30అ.ల వెడల్పు రోడ్డు, ఆస్తి–3: జనగాం జిల్లా యొక్క జనగాం సబ్–డిస్ట్రిక్ట్ మరియు రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో జనగాం మున్సిపాలిటీ పరిధిలోని జనగాం పట్టం వద్దగల వార్డు నం.6, బ్లాక్ నం.3లోని సర్వే నం.173/8 లో 252.64 చ.గ.లు లేదా 211.20క.మీ.ల విస్తీర్ణంతో ల్యాండ్ యొక్క ఏరియాలోకి వచ్చు ప్లాట్ నం.ఎఫ్-8 యొక్క పాక్షికంగా మరియు ఎఫ్-7 యొక్క పాక్షికంగా ఖాళీ ప్లాట్లు ఆస్తి. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ ఎఫ్-8 యొక్క భాగం, పడమర: ప్లాట్ సం.ఎఫ్-7 యొక్క భాగం, ఉత్తరం: పి. రామ్ మోహన్ యొక్క ఖాళీ ప్లాటు, దక్షిణం: 25అ.ల వెడల్పు రోడ్డు.	16-06-2023 Rs. 1,85,75, 201.00/-	30-04-2023

నోటీసుకు ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకోబడుచున్నవి. పై రుణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులు (వర్తించునట్లుగా) ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా బకాయిని తిరిగి చెల్లించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నియమాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడుతాయి.

తేది: జులై 26, 2023
ప్రదేశం: జనగాం

అధీకృత అధికారి,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

సంపాదకీయం


బేటీ 'బచావో'...

అమ్మాయిలు లేకపోతే అమ్మలు ఉండరు. అమ్మలు లేకపోతే మనిషి జన్మ ఉండదు. అసలు ఈ సృష్టే ఉండదు. ఆ అమ్మ ఇప్పుడు ప్రమాదంలో ఉంది. ఆడపిల్ల గడప దాటితేనే కాదు, కడుపులో ఉన్నా రక్షణ లేదు. దేశ లింగ నిష్పత్తిలో పెరిగిపోతున్న అసమానతలు చెబుతున్న సత్యమిది. మహిళా, శిశు సంక్షేమశాఖ ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం కర్నాటక,

> దేశంలో అమ్మాయిల నిష్పత్తి తగ్గిపోవడానికి తరతరాలుగా కొనసాగుతున్న లింగ వివక్ష ఓ ప్రధాన కారణం. ఈ వివక్ష ఇటీవల కాలంలో మరింత పెరిగిపోతున్నది. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న బీజేపీ నాయకుల గురించి రోజూ వింటూనే ఉన్నాం. కాపాడాల్సిన వారే అకృత్యాలకు పాల్పడుతున్నారు. మహిళల పట్ల చులకన భావం పెరిగిపోయింది. ఈ భావన మత ఛాందసం నుండి పుట్టిందే. మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెచ్చి మహిళల పరిస్థితిని మరింత దిగజార్చుతున్నారు.

ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, బీహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, చండీఘర్‌తో పాటు మొత్తం 12రాష్ట్రాలలో గత రెండేండ్ల కాలంలో లింగ నిష్పత్తి తగ్గిపోయింది. అయితే నిటి అయోగ్ నివేదికలో మాత్రం బేటీ బచావ్... బేటీ పఢావో పథకం అద్భుతంగా పని చేస్తున్నదని చెబుతున్నారు. గతంతో పోలిస్తే లింగ నిష్పత్తి మెరుగ్గా ఉందని నివేదించారు. మరి ఈ పథకం అంత గొప్పగా పనిచేస్తుంటే దేశంలోని ఇన్ని రాష్ట్రాలలో అమ్మాయిల నిష్పత్తి ఎందుకు తగ్గిపోయినట్టో ఏలినవారే సమాధానం చెప్పాలి.

తిమ్మిని బమ్మిని చేయడం, మాటల గారడీతో ప్రజలను మాయ చేయడంలో మన దేశ పాలకులకు మించిన వారులేరు. ఈ విషయం మరోసారి స్పష్టమయింది. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి(డబ్ల్యూసీడీ) మంత్రిత్వశాఖ ఇటీవల అందించిన సమాచారమే దీనికి చక్కటి ఉదాహరణ. ఈ లెక్కలు ఆందోళన కలిగిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం దేశంలోని పలు రాష్ట్రాల్లో లింగ నిష్పత్తి గణనీయంగా తగ్గిపోతున్నది. ఆయా రాష్ట్రాలలో బాలుర సంఖ్యతో పోలిస్తే బాలికల సంఖ్య తక్కువగా ఉంది. కండ్ల ముందు లెక్కలు ఇంత స్పష్టంగా కనిపిస్తుంటే బేటీ బచావో... బేటీ పఢావో పథకం గొప్ప ఫలితాలను ఇస్తుందని మన ప్రధాని ఊదరగొడుతున్నారు. అవకాశం దొరికిన ప్రతిచోట ఈ పథకం గురించి గొప్పలు చెప్పుకుంటున్నారు.



వాస్తవానికి దేశంలో లింగ నిష్పత్తిలో సమతుల్యత ఉన్న రాష్ట్రం కేరళ. ఆ తర్వాత పుదుచ్చేరి, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి. కానీ నిటి అయోగ్ నివేదిక ప్రకారం ఒక్క లఢక్‌లో మాత్రమే బాలుర కంటే బాలిక సంఖ్య అధికంగా ఉంది. అలాగే పథకం కింద కేటాయించిన నిధులు ఎక్కడా పూర్తి స్థాయిలో ఉపయోగించడం లేదు. ఉదాహరణకు లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న హర్యానాలో చూస్తే రూ.249.84లక్షలు కేటాయిస్తే రూ. 142.26 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. అంటే నిధుల ఉపయోగం ఏ మేరకు ఉందో దీన్ని బట్టి తేలిపోయింది.

గుజరాత్ మోడల్ అంటూ ప్రధాని గొప్పగా చెప్పుకుంటున్న తన రాష్ట్రంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 2012-14లో ఆ రాష్ట్రంలో 1000 బాలురకు గాను 907మంది బాలికలు ఉంటే 2015 నాటికి ఆ సంఖ్య 854కు పడిపోయింది. లింగ వ్యత్యాసంలో గుజరాత్ దేశంలోనే మూడవ స్థానంలో ఉందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అంటే ప్రధాని సొంత రాష్ట్రంలోనే అమ్మాయిల పుట్టుక పట్ల ఇంతటి వివక్ష ఉంటే ఇక దేశం పరిస్థితి ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ లెక్కలన్నింటినీ మరుగునపెట్టి బేటీ బచావో... బేడీ పఢావో అద్భుత ఫలితాల నిస్తుందంటూ పచ్చి అబద్ధాలు చెప్పడం మన పాలకులకే చెల్లింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు నిండినా ఆడపిల్ల పుడితే భారంగా, అరిష్టంగా భావిస్తున్న దేశం మనది. పేదరికం కూడా దీనికి తోడవుతున్నది. అందుకే కడుపులో ఉన్నది అమ్మాయి అని తెలిస్తే పిండాన్ని విచ్ఛిన్నం చేసే దుర్మార్గం మన దగ్గర యధేచ్ఛగా సాగుతూనే ఉంది. డబ్బుకు ఆశపడి స్కానింగ్‌లు చేస్తున్న డయగ్నొస్టిక్ సెంటర్లకు, అబార్షన్లు చేస్తున్న వైద్యులకైతే కొదవే లేదు. వీటిని కట్టడి చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అవుతున్నాయన్నది తాజా లెక్కలు చెబుతున్నాయి.

దేశంలో అమ్మాయిల నిష్పత్తి తగ్గిపోవడానికి తరతరాలుగా కొనసాగుతున్న లింగ వివక్ష ఓ ప్రధాన కారణం. ఈ వివక్ష ఇటీవల కాలంలో మరింత పెరిగిపోతున్నది. మహిళలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న బీజేపీ నాయకుల గురించి రోజూ వింటూనే ఉన్నాం. కాపాడాల్సిన వారే అకృత్యాలకు పాల్పడుతున్నారు. మహిళల పట్ల చులకన భావం పెరిగిపోయింది. ఈ భావన మత ఛాందసం నుండి పుట్టిందే. మనుధర్మ శాస్త్రాన్ని ముందుకు తెచ్చి మహిళల పరిస్థితిని మరింత దిగజార్చుతున్నారు. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో మహిళలు అభద్రతా భావంలో జీవిస్తున్నారన్నది పచ్చి నిజం. ప్రభుత్వ లెక్కలే ఈ విషయాన్ని నొక్కివక్కాణిస్తున్నాయి.

రోజురోజుకూ మహిళలపై దాడులు పెరిగిపోతున్నా రక్షణ విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నోరు విప్పి మాట్లాడటం లేదు. మనుధర్మం పాలిస్తున్న చోట, మత ఛాందసం రాజ్యమేలుతున్న చోట అమ్మాయిల రక్షణ కోరుకోవడం మన అత్యాశే అవుతుంది. అయితే ఈ మత ఛాందసం ఇలాగే పెచ్చరిల్లితే భవిష్యత్‌లో లింగ నిష్పత్తి మరింత పడిపోవడం ఖాయం. అందుకే ఈ మత ఛాందసుల భారి నుండి మన ఆడ బిడ్డలను కాపాడుకుందాం. తద్వారా మన దేశాన్ని, ఈ సృష్టిని నిలబెట్టుకుందాం.

అమెరికాకు పోటీగా చైనా జెట్ ఇంజన్ రూపకల్పన, ఉత్పత్తి!

అమెరికా, దాని మిత్ర దేశాలు ప్రపంచాన్ని ప్రశాంతంగా ఉండనివ్వటం లేదు. అందువలన ప్రతి దేశం తన భద్రత గురించి జాగ్రత్తపడటం సాధారణ అంశమే. ఇటీవలి కాలంలో కొన్ని దేశాలను బూచిగా చూపి ఆ పేరుతో మిలిటరీ ఖర్చు పెంచేట్లు అమెరికా కుట్రలు చేస్తోంది, తప్పుడు సమాచారం అందిస్తోంది. ఎందుకంటే ఆయుధాలను అమ్ముకొని లాభాలు సంపాదించటమే పనిగా అమెరికన్ కార్పొరేట్లు పెట్టుకున్నాయి. ఉదాహరణకు మనకు చైనాతో విరోధాన్ని పెంచేందుకు అరుణాచల్‌ప్రదేశ్ సరిహద్దులు మన ప్రాంతంలో చైనా కొత్త గ్రామాలను నిర్మిస్తున్నట్లు కొన్ని ఫొటోలను అమెరికా విడుదల చేసింది. అది వాస్తవం కాదని, తమ ప్రాంతంలోనే పాతబడిన ఇండ్ల స్థానంలో కొత్తవాటిని నిర్మిస్తున్నట్లు మన మిలిటరీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. అమెరికా మాటలను నమ్మి అవసరం కంటే అధికంగా మిలిటరీ ఖర్చు చేసిన దేశమేదీ బాగుపడిన దాఖలాల్లేవు. సాధారణ పరిస్థితుల్లో కూడా ప్రతిదేశం తన మిలిటరీ పరికరాలను నవీకరించుకోవటం అవసరం, దానికి మన దేశం మినహాయింపు కాదు. దానిలో భాగంగానే ఫ్రాన్సు నుంచి మన దేశ రాఫెల్ యుద్ధ విమానాలను మన ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇటీవలనే ప్రధాని నరేంద్రమోడీ అక్కడికి వెళ్లి కొత్తగా కొన్ని ఒప్పందాలు కుదుర్చుకొని వచ్చారు. ఫ్రెంచి కంపెనీతో కలసి జెట్ ఇంజన్ల అభివృద్ధికి ఒప్పందం చేసుకున్నట్లు కూడా ప్రకటించారు.



ఎం. కోటేశ్వరరావు
8331013288

> ఈ ఏడాది ప్రారంభంలో ఒక చైనా పత్రికలో రాసిన విశ్లేషణలో తమ జె -20 ఐదవ తరం బాంబరు అమెరికా తయారీ ఎఫ్ - 35, ఎఫ్ -22 కంటే ఉన్నతమైనదని పేర్కొన్నారు. ఒక ఉదంతంలో తూర్పు చైనా సముద్రంలో చైనా-అమెరికా విమానాలు చాలా దగ్గరగా వచ్చాయి. ఆ సందర్భంగా అమెరికన్ పైలట్లు చైనా విమానాన్ని చూసి ప్రభావితులైనట్లు అమెరికా పసిఫిక్ ఎయిర్‌ఫోర్సు కమాండర్ జనరల్ కెనెత్ విల్స్‌బాచ్ చెప్పిన మాటలను ఆ పత్రిక ఉటంకించింది.

పారిస్‌లో ఇటీవలనే విమాన ఎగ్జిబిషన్ జరిగింది. ఈ సందర్భంగా నాటో కూటమి గూఢచార సంస్థలో పని చేసి రిటైరైన ఒక అధికారి బ్రేకింగ్ డిఫెన్స్ అనే మీడియాతో మాట్లాడుతూ చేసిన వ్యాఖ్యకు ప్రాధాన్యత ఉంది." చైనా స్వంతంగా జెట్ ఇంజన్ల రూపకల్పన, ఉత్పత్తి చేసేదిగా మారాలని ఎవ్వరూ కోరుకోవటం లేదని " అన్నాడు. అది ఒక్క చైనాకే వర్తిస్తుందని ఎవరైనా అనుకుంటే పొరపాటు. ఇప్పటికే ఆ రంగంలో ఉన్న దేశాలు ఎవరికైనా షరతులతో అమ్ముతాయి తప్ప ఎవరినీ స్వంతంగా ఎదగనివ్వవు. పశ్చిమ దేశాలు ఎంతగా అడ్డుకుంటున్నప్పటికీ సవాలుగా తీసుకొని చైనా ముందుకు పోవటం వాటికి ఆందోళన కలిగిస్తోంది. పశ్చిమ దేశాలు ప్రత్యేకించి అమెరికా ఇతర దేశాలను భయపెట్టేందుకు ముందుగానే హడావుడి ప్రకటనలు చేస్తాయి. ఎగ్జిబిషన్లలో ప్రదర్శిస్తాయి. చైనా అంశానికి వస్తే అది చేసి చూపించిన తరువాతే చెబుతుంది. పారిస్ విమాన ప్రదర్శన జూన్ 24న ముగిసింది. అక్కడ చైనా స్టాల్ ఉన్నప్పటికీ ఎవరూ ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. తరువాత నాలుగు రోజులకు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా రాడార్లకు దొరకని, గురిచూసి దాడిచేసే చైనా ఐదవ తరం చెంగుడు జె-20 బాంబరు వీడియోను విడుదల చేసింది. దాని సత్తా గురించి పశ్చిమ దేశాలు ఇప్పుడు జుట్టుపీక్కుంటున్నాయి. అంతకు ముందు పరీక్షించినప్పటికీ తొలిసారిగా జె-20ని రెండు డబ్ల్యుఎస్-15 కొత్త ఇంజన్లతో విడుదల చేశారు. దీంతో అమెరికా, దాని మిత్ర దేశాలు ఆందోళన చెందుతున్నాయి.

గతంలో చైనా తమ విమానాలకు అవసరమైన జెట్ ఇంజన్లను రష్యా నుంచి కొనుగోలు చేసింది. అవి ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. ఎంతకాలం ఇతర దేశాల నుంచి కొనుగోలు చేస్తాం, మనమే ఎందుకు రూపకల్పన చేసి ఉత్పత్తికి పూనుకోకూడదని 2016 ఆగస్టులో జెట్ ఇంజన్ల విడిభాగాలు తయారు చేసే యూనిట్లను ఒక దగ్గరకు చేర్చి 750 కోట్ల డాలర్ల పెట్టుబడి, 96వేల మంది సిబ్బందితో ఏరో ఇంజిన్ కార్పొరేషన్ ఆఫ్ చైనా(ఎఇసిసి)ను ఏర్పాటు చేశారు. అది చేపట్టిన అనేక ప్రాజెక్టులలో డబ్ల్యుఎస్-15 ఇంజిన్ ఒకటి. రెండు సార్లు విఫల పరీక్షల తరువాత ఇటీవలే దాన్ని జయప్రదంగా ఎగురవేశారు. అంతకు ముందే అదే సీరీస్‌లో తక్కువ సామర్ధ్యం కలిగిన ఇంజన్లు తయారు చేసి జె-20 విమానాలకు అమర్చారు. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న జెట్ ఇంజన్లను కూడా వాటికి అమర్చుతున్నారు, జె-20 బాంబరును 2011 నుంచీ నిర్వహిస్తున్నారు. సమర్ధవంతమైన స్వంత ఇంజన్లతో నడపటమే తాజా ప్రత్యేకత. ఎక్కడి నుంచైనా యుద్ధ విమానాలను కొనుగోలు చేసినపుడు రెండు నుంచి ఎనిమిది వరకు ఇంజన్లను అదనంగా కొనుగోలు చేస్తారు. ఖర్చు రీత్యా అన్ని దేశాలు ఇలా చేయలేవు. ఇంజన్లు విడిగా కావాలంటే తమ సుఖోయి-35 ఫైటర్ జెట్‌లను ఎక్కువగా కొనుగోలు చేయాలని రష్యా షరతు పెట్టింది. అందువలన దాని మీద ఆధారపడటం సాధ్యం కాదని చైనా భావించింది. కొన్ని అంశాల్లో ఆ విమానాల కంటే తమ జె-16 ఫైటర్లు మెరుగైనవని చైనా నిపుణులు పేర్కొన్నారు. జూన్ 28న ఎగిరిన జె-20 బాంబరుకు ఒక కొత్త ఇంజను, మరొక పాత ఇంజను అమర్చారు. ఒకటి విఫలమైతే రెండవది పని చేస్తుంది. పరీక్షలో నిగ్గుతేలినప్పటికీ ఇంకా అనేక పరీక్షలు, మెరుగుపరచిన తరువాతే ఆ ఇంజన్లను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తారని చైనా మాజీ సైనికాధికారి సాంగ్ ఝోంగ్‌పింగ్ చెప్పాడు.

ఈ ఏడాది ప్రారంభంలో ఒక చైనా పత్రికలో రాసిన విశ్లేషణలో తమ జె -20 ఐదవ తరం బాంబరు అమెరికా తయారీ ఎఫ్ - 35, ఎఫ్ -22 కంటే ఉన్నతమైనదని పేర్కొన్నారు. ఒక ఉదంతంలో తూర్పు చైనా సముద్రంలో చైనా-అమెరికా విమానాలు చాలా దగ్గరగా వచ్చాయి. ఆ సందర్భంగా అమెరికన్ పైలట్లు చైనా విమానాన్ని చూసి ప్రభావితులైనట్లు అమెరికా పసిఫిక్ ఎయిర్‌ఫోర్సు కమాండర్ జనరల్ కెనెత్ విల్స్‌బాచ్ చెప్పిన మాటలను ఆ పత్రిక ఉటంకించింది. అమెరికా నవీకరణ అవసరాన్ని గురించి చెప్పేటపుడు చైనా ఆయుధ వ్యవస్థల గురించి అటువంటి వ్యాఖ్యలు చేస్తుంటారని వాటిని పట్టించుకోనవసరం లేదని కొందరు కొట్టిపారవేశారు. కానీ విమానం ఎగిరిన తీరు చూస్తే దాని కంట్రోలు వ్యవస్థలు సక్రమంగానే ఉన్నట్లు కనిపిస్తోందని, గతంలో ఈ మాత్రం కూడా తెలియలేదనే వ్యాఖ్యలు వెలువడ్డాయి. తమ ఎఫ్-35 మాదిరిగా జె-20 ఉందని దాని గురించి అడగ్గా విల్స్‌బాచ్ ఏమీ మాట్లాడలేదు. అయినప్పటికీ చైనా విమానం గురించి సమాచారం పెద్దగా తెలియదంటూనే అమెరికా పత్రికల్లో రెండింటి గురించి విశ్లేషణలు చేస్తున్నారు. తమ ఎఫ్35, ఎఫ్22ను కాపీ కొట్టినట్లు ఆరోపిస్తున్నారు. తమ విమానాలతో వేగం, సాంకేతిక అంశాలను పోల్చి చూపుతున్నారు. చైనా గురించి ఇలాంటి ఆరోపణలు, ఎద్దేవాలు ఎప్పటి నుంచో చేస్తున్న సంగతి తెలిసిందే.

ప్రస్తుతం అమెరికా విమానాల సామర్థ్యం తమకంటే మెరుగైనదే అని చైనా నిపుణులు చెబుతున్నారు. తమ వాటిని మెరుగుపరచుకొనే క్రమంలో బీజింగ్ ఉంది. జె-20 విమాన సామర్థ్యం గురించి పశ్చిమ దేశాలు నిర్ధారణకు రాలేకపోతున్నాయి. ఒక వేళ చైనా వాటిని వినియోగంలోకి తెస్తే ఎఫ్ 22తో చైనాను ఢీకొట్టగలమా, తగినన్ని అందుబాటులో ఉన్నాయా అని తర్జనభర్జన పడుతున్నాయి. చైనా డబ్ల్యుఎస్-15 జెట్ ఇంజన్ ఉత్పత్తి ఆలస్యం అవుతున్నదని గతంలో వార్తలు వచ్చాయి. 2019 చివరి నాటికే 50 జె-20 విమానాలను చైనా తయారు చేయనుందని పశ్చిమ దేశాలు అంచనా వేశాయి. ఒక వేళ 50 లేదా వంద తయారు చేసినా అమెరికా వద్ద ప్రస్తుతం ఉన్నవాటి కంటే చాలా తక్కువ అని, లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ నివేదిక ప్రకారం 195 ఎఫ్-22 విమానాలను ఇప్పటికే అంద చేయగా వాటిలో 186పోరుకు సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వచ్చాయి. మరోవైపున వికీపీడియా సమాచారం ప్రకారం చైనా వద్ద జె-20 విమానాలు మూడు రకాలు 210కి పైగా ఉన్నాయి. ఇలాంటి బాంబర్లను అమెరికా తరువాత చైనా మాత్రమే రూపొందించింది. తాజా సమాచారం ప్రకారం 2023లో లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీ 147 నుంచి 153 ఎఫ్-35 ఫైటర్ జెట్లను తన ఖాతాదార్లకు అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది, అయితే వాటిలో 50 వరకు ఈ ఏడాది తయారుకాకపోవచ్చునని బల్గేరియన్ మిలిటరీ డాట్ కామ్ జూలై 22న పేర్కొన్నది. ఇదే సమయంలో చైనా జె-20 ఉత్పత్తి ఏడాదికి 120 మించనున్నదని కూడా తెలిపింది. ఎఫ్-35ఏ, సి రకాల బాంబర్లు నాలుగు నుంచి ఆరు క్షిపణులను, అదే జె-20 ఎనిమిది క్షిపణుల వరకు మోసుకుపోగలదని కూడా ఆ వార్తలో పేర్కొన్నారు.



స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ(సిప్రి) 2022 వార్షిక నివేదికలో ప్రపంచంలో మిలిటరీ ఖర్చు కొత్త రికార్డు నెలకొల్పినట్లు పేర్కొన్నది. అంతరిక్షం, సైబర్ రంగాలలో అమెరికా ముందున్నందున మిగిలిన దేశాలతో పాటు చైనా కూడా తన సామర్థ్యాన్ని మెరుగుపరచుకుంటున్నది. సైబర్ నిఘాలో అమెరికా ప్రపంచ ఛాంపియన్ అని చైనా వర్ణిస్తున్నది. చైనా రూపొందిస్తున్న సైబర్ ఆయుధాలతో ఉపగ్రహాలను కూడా అదుపులోకి తెచ్చుకోవచ్చని సిఐఏ తన నివేదికలలో పేర్కొన్నది.

> స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధనా సంస్థ(సిప్రి) 2022 వార్షిక నివేదికలో ప్రపంచంలో మిలిటరీ ఖర్చు కొత్త రికార్డు నెలకొల్పినట్లు పేర్కొన్నది. అంతరిక్షం, సైబర్ రంగాలలో అమెరికా ముందున్నందున మిగిలిన దేశాలతో పాటు చైనా కూడా తన సామర్థ్యాన్ని మెరుగుపరచుకుంటున్నది. సైబర్ నిఘాలో అమెరికా ప్రపంచ ఛాంపియన్ అని చైనా వర్ణిస్తున్నది. చైనా రూపొందిస్తున్న సైబర్ ఆయుధాలతో ఉపగ్రహాలను కూడా అదుపులోకి తెచ్చుకోవచ్చని సిఐఏ తన నివేదికలలో పేర్కొన్నది.

అమెరికాకు చెందిన స్టార్‌లింక్ ఉపగ్రహ సమాచార వ్యవస్థ ద్వారా రష్యా సేనల గురించి ఎప్పటికప్పుడు ఉక్రెయిన్‌కు అందచేస్తున్న సంగతి తెలిసిందే. ప్రపంచ మిలిటరీ ఖర్చు 2021తో పోల్చితే 2022లో 3.7శాతం పెరిగింది. డాలర్లలో 2022 ఖర్చు 2,240బిలియన్లు, ఇది ప్రపంచ జిడిపిలో 2.2శాతం. మొత్తం ఖర్చులో మొదటి ఐదు స్థానాల్లో ఉన్న దేశాల వాటా 63శాతం. అమెరికా 39, చైనా 13, రష్యా 3.9,భారత్ 3.6, సౌదీ 3.3శాతం చొప్పున కలిగి ఉన్నాయి. ఇక రష్యా ఖర్చు దాని జిడిపిలో ఒక ఏడాది కాలంలో 3.7 నుంచి 4.1శాతానికి పెరిగింది. ఇదే కాలంలో ఉక్రెయిన్ ఖర్చు 640శాతం పెరిగి జిడిపిలో 3.2 నుంచి 34శాతానికి పెరిగింది. దక్షిణ చైనా సముద్రం గురించి అమెరికా లేవనెత్తుతున్న వివాదం, తైవాన్‌పై చైనాను రెచ్చగొడుతున్న కారణంగా ఈ ప్రాంతంలోని అనేక దేశాలు ఆయుధాల కొనుగోలుకు పూనుకున్నాయి.

అమెరికా రక్షణ ఖర్చు 877 బి.డాలర్లతో పోలిస్తే చైనా 292 బి.డాలర్లు తక్కువే. ఆత్మరక్షణ సిబ్బంది తప్ప మిలిటరీ ఖర్చు లేదని చెప్పుకొనే జపాన్ ఖర్చు 46బి.డాలర్లకు చేరింది.దక్షిణ కొరియా 46.4బి.డాలర్లకు పెంచింది.ఈ రెండు దేశాలూ అమెరికా రక్షణలో ఉన్నాయి. మన దేశం 2021తో పోలిస్తే మరుసటి ఏడాది ఖర్చు(81.4బి.డాలర్లు) ఆరుశాతం పెంచినట్లు సిప్రి పేర్కొన్నది. స్టాక్‌హోం సంస్థ పరిగణనలోకి తీసుకున్న అంశాల ప్రకారం ప్రపంచంలో 40దేశాలు గణనీయంగా ఖర్చు చేస్తున్నాయి. వాటిలో మన దేశం మూడవ స్థానంలో ఉండగా మన పొరుగునే ఉన్న పాకిస్తాన్ 10.3 బి.డాలర్లతో 24వదిగా ఉంది. తలసరి మిలిటరీ ఖర్చును డాలర్లలో చూస్తే అమెరికా 2,240,చైనా 163, శ్రీలంక 116, పాకిస్తాన్ 50, మయన్మార్ 48, భారత్ 43,బంగ్లాదేశ్ 27, నేపాల్ 7 చొప్పున ఖర్చు చేస్తున్నది. అమెరికా, ఇతర ధనిక దేశాల కూటమి ప్రపంచాన్ని ఉద్రిక్తతల వైపు నడిపిస్తూ వినాశనం వైపు నడిపిస్తున్నది.

దేశంలో 'డీ రిజర్వేషన్' మొదలైన చారిత్రక దినం... జూలై 26!

రాజర్షి ఛత్రపతి సాహు మహరాజ్ 2 జూలై 1894న కొల్హాపూర్ రాజసింహాసనాన్ని అధిష్టించాడు. రాజులైన.. వారెవరైనా... పరిపాలనలో, సమాజంలోనూ బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని అంగీకరించడమూ, తదనుగుణంగా నడుచుకోవడమూ... వేలాది సంవత్సరాలుగా మన దేశంలో నడుస్తూ వస్తున్నది. బ్రాహ్మణాధిపత్యాన్ని రాజులు అంగీకరించాలి, దానికి బదులుగా... రాజు దైవాంశ సంభూతుడని ప్రచారం చేసి, రాజుల నిరంకుశ పాలనకు ధర్మబద్ధత కలిగించే పని బ్రహ్మణులు నిర్వర్తించాలి. మన దేశంలో అనాదిగా కొనసాగుతున్న 'సనాతన ధర్మం' ఇది.కొల్హాపూర్ రాజైన సాహూ మహారాజ్ మాత్రం... దీన్ని ధిక్కరించి మానవతా ధర్మం వైపు నిలబడ్డాడు. నేటికి సరిగ్గా 121యేళ్ల క్రితం... 26 జులై 1902న అతను ఎవ్వరూ ఊహించని విధంగా ఒక అద్భుతమైన అడుగు వేశాడు. బ్రాహ్మణుల నుండి తీవ్ర వ్యతిరేకతల మధ్య... తన రాజ్యంలోని విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలలో దళితులు, వెనుకబడిన వారికి 50శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ రాజశాసనం జారీ చేశాడు. ఆధునిక భారతదేశంలో రిజర్వేషన్లకు అలా అంకురార్పణ జరిగింది. అందుకే సాహూ మహారాజ్ ఆధునిక రిజర్వేషన్ల పితామహుడిగా పేరొందాడు. ఆ తర్వాత మరో 50ఏండ్లకు... అంబేద్కర్ మహనీయుడు రాజ్యాంగ రచన చేసినప్పుడు... నిమ్న వర్గాలకు రిజర్వేషన్ ఇవ్వాలనే సాహు సదాశయాన్ని రాజ్యాంగబద్ధం చేశాడు.




ఆర్. రాజేశమ్
9440443183

1874 జూన్ 26న కుంబీ అనే శూద్ర కులంలో జన్మించిన సాహు మహారాజ్... మరాఠా సామ్రాజ్యాన్ని ఏలిన వీర శివాజీ మనుమడు. సాహు మూడేండ్ల వయసులో తన తల్లిని కోల్పోయాడు. కొల్హాపూర్ రాణి ఆనందీబాయి 1884 మార్చి 17న అతన్ని దత్తత తీసుకున్నది. 20సంవత్సరాల చిన్న వయసులో కొల్హాపూర్‌కు రాజయ్యాడు. 1922 మే6న చనిపోయేంతవరకు... 28సంవత్సరాల పాటు కొల్హాపూర్ రాజ్యాన్ని పాలించాడు. సాహు తాతగారైన ఛత్రపతి శివాజీ సైతం స్వయంగా కులవ్యవస్థ బాధితుడిగా చరిత్రకెక్కాడు. తన పరాక్రమంతో ఎన్నో రాజ్యాలను జయించిన శివాజీ... చక్రవర్తిగా పట్టాభిషిక్తుడు కావాలని ప్రయత్నాలు ప్రారంభించిన వేళ... "నువ్వు శూద్ర కులానికి చెందిన వాడివి కాబట్టి నీకు పట్టాభిషేకం చేయం" అంటూ పూణేలోని బ్రాహ్మణులు తీర్మానించారు. తప్పనిసరి పరిస్థితు లలో శివాజీ కాశీ పట్టణం నుండి గంగాభట్టు అనే ఒక బ్రాహ్మణుడిని ఆ పని కోసం తీసుకొచ్చాడు. నిలువెత్తు బంగారం సంభావనగా సమర్పించా లనే షరతుపై ఆ బ్రాహ్మణుడు పనికి ఒప్పుకున్నాడు. ఇంతా చేసి... తన కాలి వేలుతో శివాజీ నుదుటికి బొట్టుపెట్టి పట్టాభిషేక తతంగం కానిచ్చి... "శూద్రుడివైన నీకు ఇదే గొప్ప!" అంటూ అవమానించాడు.

1894లో సాహు మహరాజ్ పాలకుడిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు... బ్రాహ్మణులు కొల్హాపూర్ పరిపాలనా వ్యవస్థలో చాలా స్థానాల్లో గుత్తాధిపత్యం చేజిక్కించుకున్నారు. 500మంది రాజాస్థాన ఉద్యోగులు ఉంటే... అందులో కేవలం పదిమంది బ్రాహ్మణేతరులు మాత్రమే ఉన్నారు. మూడుశాతం జనాభా ఉన్న వర్గం చేతిలో 97శాతం ఉద్యోగాలు కబ్జాకు గురయ్యాయి. ఇది తీవ్ర అన్యాయమని గుర్తించిన సాహు మహారాజ్ ఆ తప్పును సరిదిద్దడానికే ఆ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాడు. నిజానికి మనుస్మృతి సాకుతో కొనసాగిన అన్యాయపు తతంగానికే రిజర్వేషన్లు అని పేరు పెట్టడం సమంజసం. సాహు మహారాజు తీసుకొచ్చిన న్యాయప్రక్రియ... ఆ అక్రమ రిజర్వేషన్ల రద్దు కాబట్టి... దాన్ని "డీ రిజర్వేషన్" అనడమే సమంజసం! సాహు రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసిన తర్వాత... 1912 నాటికి సుమారు 200మంది బ్రాహ్మణేతర వర్గాల ప్రజలు కొలువు సంపాదించగలిగారు. దేశంలో గతంలో ఎవ్వరూ ఊహించని పరిణామమిది.

రిజర్వేషన్లతో పాటు...ఉచిత, నిర్బంధ విద్యను ప్రవేశపెట్టి తన రాజ్యంలో సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాడు ఆ ప్రజల రాజు. మతంపై బ్రాహ్మణ ఆధిపత్యమే అన్ని అనర్థాలకు మూల కారణ మని గుర్తించి దాన్ని కూల్చివేయాలని నిర్ణయించు కున్నాడు. రాజ్యంలోని మతపరమైన సంస్థల ఆదాయం, ఆస్తులు ప్రభుత్వా నికి చెందుతాయని 9 జూలై 1917న శాసనం జారీ చేశాడు. దేవాలయాల్లో వెనుకబడిన కులాల వారిని పూజారులుగా నియమించా లని కూడా ఆయన ఆదేశించారు. 1920లో మతపరమైన ఆచారాలను నిర్వహించడంలో వెనుకబడిన వర్గాలకు శిక్షణ ఇవ్వడానికి ఒక వేద పాఠశాలను స్థాపించాడు. బ్రాహ్మణులకు అగ్ర హారాలను కేటాయించే సంప్రదాయానికి కూడా సాహు మహరాజ్ తెరదించాడు. తన రాజ్యంలో బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలు ఏర్పాటు చేయడంతో పాటు... వారి ఉన్నత విద్య కోసం ఉపకారవేతనాలు, ప్రోత్సాహక బహుమతులు అందించాడు. 1919 బాల్య వివాహాల రద్దు చట్టంతో పాటు... 1919 జులై 12న కులాంతర, వర్ణాంతర వివాహాలను చట్టబద్ధం చేస్తూ స్పెషల్ మ్యారేజీ యాక్ట్ తీసుకొచ్చాడు. 1920 జనవరి 17న జోగిని, దేవదాసీ వ్యవస్థ రద్దు చట్టం వచ్చింది. వ్యభిచార వృత్తిలో ఉన్న స్త్రీలకు పునరావాస పథకాన్ని అమలు పరిచాడు.



వేల సంవత్సరాలుగా మనువాద రిజర్వేషన్ల వ్యవస్థ మన దేశంలో పకడ్బందీగా అమలు జరిగింది. కులదురహంకార శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం మత గ్రంథాలను, దేవుడి పేరును సైతం దుర్వినియోగపరిచారు. ఆ కారణంగా దేశం ఎన్నో విధాలుగా నష్టపోయింది. సాహు, అంబేద్కర్, వీపీ సింగ్‌లు తీసుకొచ్చిన సామ్యవాద రిజర్వేషన్లు ఆ నష్టాన్ని పూడ్చడానికి ప్రయత్నించాయి. అయితే... అవి అంతంత ఫలితాలనే ఇచ్చాయని గణాంకాలు నిరూపిస్తున్నాయి. 73ఏండ్ల ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, 30ఏండ్ల ఓబీసీ రిజర్వేషన్ల తర్వాత... వివిధ తరగతులు ప్రభుత్వ ఉద్యోగాల్లో దక్కించుకున్న శాతమెంతో తెలిపే ప్రభుత్వ గణాంకాలు పరిశీలిస్తే... విస్తుగొలిపే వాస్తవాలు బయటపడతాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనెల్ అండ్ ట్రయినింగ్ (డీఓపీటీ) పార్లమెంటుకు సమర్పించిన తాజా నివేదిక ప్రకారం... వివిధ ప్రభుత్వశాఖల్లోని మొత్తం గ్రూప్-ఏ పోస్టులు 83,000 పైచిలుకు కాగా, అందులో ఎస్సీలకు 11,004(13శాతం), ఎస్టీలకు 4,400(5శాతం), ఓబీసీలకు 10,500 (13శాతం), ఓసీలకు 57,343(69శాతం) ఉద్యోగాలు దక్కాయి. అదేవిధంగా గ్రూప్-బికి చెందిన మొత్తం పోస్టులు 2,90,941లో... ఎస్సీలకు 46,625 (16శాతం), ఎస్టీలకు 20,915 (7శాతం) ఓబీసీలకు 42,995(15శాతం) ఉద్యోగాలు మాత్రమే దక్కగా రిజర్వేషన్ సౌకర్యం లేని ఇతర తరగతుల వారు 1,80,406 (62శాతం) ఉద్యోగాలు దక్కించు కున్నారు. న్యాయస్థానాలలో, వ్యాపారరంగంలో... 90శాతం అగ్రవర్ణాల ఆధిపత్యమే కొనసాగుతున్నది. మరోవైపు ఈడబ్ల్యూఎస్ పేరుతో... కులవ్యవస్థ బాధితులకు దక్కాల్సిన రిజర్వేషన్లను, కులవ్యవస్థ వల్ల లాభపడ్డ వర్గాలకు అందిస్తున్నారు. సాహు మహరాజ్ ఎంతో దూరదృష్టితో సమాజాభివృద్ధిని కాంక్షించి తీసుకొచ్చిన సంస్కరణలను... నేటి పాలకులు నిర్వీర్యపరుస్తున్నారన్నది సుస్పష్టం.

సాహూ మహరాజ్ అందించిన ఉద్యమ స్ఫూర్తిని నేటి కాలంలో ముందుకు కొనసాగించాల్సిన అవసరం ఉన్నది. ఆధునిక రాజ్యంగా ముందుకు సాగాలని కోరుకునే ఏ సమాజమైనా గతంలో జరిగిన చారిత్రక తప్పిదాలను దిద్దుకోవడం... సమ్మిళిత అభివృద్ధిని సాధించడం అత్యంత అవసరం. చరిత్రలో కొందరు స్వార్థపర, కుల దురహంకార శక్తులు... మతనమ్మకాల అండతో కొనసాగించిన సామాజిక వివక్షను సమూలంగా నిర్మూలించి... అన్ని పార్శ్వాలలో సామాజిక న్యాయాన్ని విస్తరించాల్సిన అవసరం ఉన్నది. ఆయా వర్గాలకు అందజేయపడుతున్న రిజర్వేషన్లు, ఇతర సానుకూల చర్యలేవి కూడా వారిపట్ల దయతో... భిక్షగా ఇస్తున్నవి కావు. భరతమాత బిడ్డలందరికీ సమన్యాయం, సమాన అవకాశాలు అందించడ మనేది నవ భారత నిర్మాణ ప్రక్రియలో ఒక భాగంగా సాగాలి. సాహు, పూలే. అంబేద్కర్లు చూపిన మార్గంలో... మనువాద నిర్మూలనకు, సమసమాజ స్థాపనకు, సామాజిక న్యాయ శక్తులు ఐక్యంగా ఉద్యమించడమే... 'రిజర్వేషన్స్ డే' నేడు మనకందిస్తున్న విలువైన సందేశం!

(నేడు 'రిజర్వేషన్స్ డే')

మణిపూర్ మంటల్లో 'వెలుగుతున్న' భారత్

భారతదేశంలో అభివృద్ధి వెలిగిపోతోందని చెప్పేవారి సంఖ్య పెరిగింది. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిదేండ్ల స్వదేశీ నినాదంతో శివతాండవం చేస్తున్నవారు భారత్ వెలుగుతోందని గొంతు చించుకుని అరుస్తున్నారు. దేశ ప్రధాని నరేంద్రమోడీని విమర్శించిన వారిని సోషల్ మీడియా ద్వారా బండబూతులు తిడుతూ మెసేజ్‌లు పంపుతున్నారు. ఈ మూకలన్నీ మణిపూర్ మారణహోమాన్ని, మహిళలపై జరిగిన నీచ నికృష్టదాడిని ఏవిధంగా సమర్థించుకుంటాయో? సిగ్గుశరం వదిలేస్తే రాజభోగం పొందవచ్చనే సామెత ఉంది. ఆ రెండూ వదిలేసిన ఆరెస్సెస్-బీజేపీ మూర్ఖులు ఏమైనా చెప్పగలరు. కానీ ఈ దేశంలో, ప్రపంచంలో మానవత్వమున్న మనుషులుగా జీవిస్తున్న కోట్లమంది ప్రజలు మణిపూర్‌ను, భారత్‌ను చూసి ముక్కున వేలేసుకుని ఆశ్చర్యపోతున్నారు. ఆవేదన చెందుతున్నారు. భారత సంస్కృతీ సాంప్రదాయాల్ని గొప్పగా చెప్పుకునే ప్రపంచ దేశాల పత్రికలు ఎటువంటి హెడ్డింగులు పెట్టాయో చూడండి.

ప్రపంచ మీడియాలో మణిపూర్ ఘోరకలిని చూసాకగానీ మోడీ మెదడులో చలనం కలిగిందా? అంత వరకు మన మీడియా, మన పాలకులు మొద్దు నిద్రపోతున్నారా? అంతేకాదు మనం దేవుళ్లుగా కొలిచే ఈ దేశంలో పుట్టిన బాబాల రాసలీలలు, బాబా గుర్మీత్‌సింగ్ (డేరాబాబా) వందలమంది ఆడపిల్లల మానప్రాణాలు బలిగొన్న విషయం అన్ని దేశాల ప్రజలు చూసారు. మీడియా ద్వారా గుజరాత్‌లో జరిగిన మారణహోమం, ఆరోజు బిల్కిస్ బానో కుటుంబంపై జరిగిన దాడి, 14మందిని ఊచకోత కోయడం వల్లనే భారత్




వెలిగిందేమో? గత తొమ్మిదేండ్లుగా యూపీలో కతువా, ఉన్నావో ఘటనలవంటి అనేక మరణమృదంగాలు మన చెవుల్లో మారుమోగాయి. ఈ అల్లర్లలో లైంగిక దాడులకు పాల్పడినవారు, సాక్షుల్ని బెదిరించడం, చంపించడం జగమెరిగిన సత్యం. ఇటీవల 3నెలల నుండి జరుగుతున్న రెజ్లర్ల పోరాటం. అంతర్జాతీయ రెజ్లింగ్ బాడీ (డబ్ల్యుఎఫ్ఐ) మందలించేవరకు మన ప్రధానినోరు విప్పని స్థితి. ఒక స్త్రీ తనపై లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేస్తే వెంటనే సదరు వ్యక్తిపై కేసు నమోదు చేయాలని చట్టాలు చెపుతున్నాయి. కానీ పదిమంది యువతులు ఒకసారి కాదు, ఎన్నో రోజులుగా, మరెన్నోసార్లు మాపై అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు చేసినా రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై ఎలాంటి కేసు నమోదు చేయలేదు. నెలల తరబడి ఆడవాళ్లు ఢిల్లీ నగరం రోడ్లపై కూర్చుని ఎలుగెత్తి అరిచినా మన ప్రధాని, హోంమంత్రి చెవులకు వినిపించలేదు. దేశప్రజలతో పాటు ప్రపంచ మీడియా కూడా ముఖాలపై ఉమ్మివేస్తే కానీ వీళ్లు చలించరన్నమాట. పోలీసులు ఎట్టకేలకు స్పందించారు. దీన్నిబట్టి ఏమర్థమవుతుంది?



బి. హైమావతి
9391360886

మణిపూర్ కొండప్రాంతాలలో నివసించేది గిరిజన ప్రజలు. వాళ్లెంత కొట్టుకు చచ్చినా ఎవరు చూస్తార్లే అని పాలకుల భావం. వీళ్ల సమస్యలు గాలికొదిలేసి దేశ ప్రధాని విదేశాల్లో చక్కర్లు కొడుతూ, ఖరీదైన విందులారగిస్తూ, ఈ దేశంలో వెలగబెడుతున్న రాచకార్యాల్ని గొప్పగా చర్చించి వచ్చారు. పాపం పండింది. మణిపూర్ మంటల వెలుగు ప్రపంచమంతా చూసారు. మర్డర్లు, మానభంగాలే కాదు, మన దేశంలో ఇంకా చాలా వింతలున్నాయి. ఆడవాళ్ళను నగ్నంగా ఊరేగించగల సాంప్రదాయం కూడా మా గొప్పే చూడండన్నారు. ఏ పోరాటాల్లోనైనా ముందుగా బలయ్యేది మహిళలే. రెండు తెగల మధ్య భూమి సమస్యలపై సాగుతున్న పోరాటం 200మంది ప్రాణాలు బలిగొన్నది. ఇందులో మహిళలున్నారు. భర్తల్ని, కొడుకుల్ని, సోదరుల్ని పోగొట్టుకుని ఏడుస్తున్న వారు కూడా మహిళలే. ఇండ్లతో పాటు పెంచుకున్న గొడ్డుగోదా పోగొట్టుకుని, తిండిగింజలకు దూరమై, తిండీ, నిద్రా లేక ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని కాలం గడుపుతున్న మణిపూర్ ప్రజల్ని, మహిళల్ని చూసాకైనా భారతదేశంలో మహిళలు కండ్లు తెరవాలి. ఇంత రాక్షస మనస్తత్వం, భావజాలాన్ని ప్రజలపై రుద్దుతున్న బీజేపీని ఓడించకపోతే, అది చెప్పే నీతులు విని ఇదే మన నిజమైన హిందూ సంస్కృతి అని నమ్మితే, మనల్ని కాపాడటానికి ఏ దేవుడూ దిగిరాడు. ఎందుకంటే మనం కొలిచే రాముడు నిండునెలలతో ఉన్న భార్యను అడవుల్లో వదిలేశాడు. రావణాసురుడు బలవంతంగా ఎత్తుకుపోయినపుడు అగ్నిప్రవేశం చేయించాడు. మరొక శృంగార పురుషుడు కృష్ణుడు. ఆయనకీ చీరలెత్తుకెళ్ళిన అలవాటు ఉందికదా! దాన్ని మన గొప్ప చర్యగా పూజిస్తున్నామాయే. మరి సతీ అనసూయను బట్టలిప్పి ఇనుముతో గుగ్గిళ్లు వండితేనే నువ్వు పతివ్రతవన్న వాళ్లు మనకు దేవుళ్లాయే. అందుకే ఈ దేశంలో స్త్రీల బట్టలూడదీయడమే సంస్కృతిగా భావించే మూర్ఖులు పెరుగుతున్నారేమో ఆలోచించండి.


అనుదినం..జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
బుధవారం 26 జులై 2023

ప్రాథమిక పాఠశాలల పనివేళలల మార్పు తగదు

- టీఎస్ యూటీఎఫ్

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలను ఉదయం 9 బదులు 9.30 గంటలకు ప్రారంభించటం అశాస్త్రీయమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) అభిప్రాయ పడుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పని వేళలు మార్చాలంటే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితర భాగస్వామ్యంతో (స్టేక్ హెూల్డర్స్) అభిప్రాయాలను సేకరించి నిర్ణయించాలని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చిన సందర్భంలో ఆ విధంగా చర్చించి, నిర్ణయించిన తర్వాతే ప్రస్తుత పనివేళలపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కానీ ఇప్పుడు ఏమాత్రం చర్చ లేకుండానే మార్పు చేయటం విచారకరమని పేర్కొన్నారు. ఈ మార్పు కొద్దిమంది ఉపాధ్యాయులకు ఉపయోగపడవచ్చునేమో కానీ విద్యార్థులు, తల్లిదండ్రులకు ఏమాత్రం ఉపయోగం లేదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుపై ప్రభావం చూపుతుందని స్పష్టం చేశారు. కాబట్టి రాష్ట్ర విద్యా శాఖ పాఠశాలల పనివేళలల మార్పుపై అశాస్త్రీయంగా ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

అర్హులైన బీసీలందరికీ ఆర్థిక సహాయం అందించాలి

నవతెలంగాణ-ఖమ్మం

అర్హులైన బీసీలందరికీ ఆర్థిక సహాయం అందించాలని తెలుగుదేశం పార్టీ ఖమ్మం పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డీఆర్ఓ శిరీషకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంట్ ఉపాధ్యక్షులు మల్లాది హనుమంతరావు మాట్లాడుతూ అర్హులైన బిసి సోదరులకు సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు .లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండబాల కర్ణకర్, అరెం రామయ్య ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, నాగార్జునపు శ్రీనివాస్, రాష్ట్ర మహిళా కార్యదర్శి చుండూరు రాజరాజేశ్వరి, మల్లెంపాటి అప్పారావు, పద్వి రావుట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.



హార్వెస్ట్ విద్యాసంస్థల్లో ఎస్‌పీఎల్, ఏఎస్‌పిఎల్ విద్యార్థి ఎన్నికలు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, ప్రజాస్వామ్య పద్ధతులలో విద్యార్థి నాయకులను ఎన్నుకోవడానికి తమ విద్యాసంస్థల్లో ప్రతి సంవత్సరం విద్యార్థి ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి ఈ.వి.ఎం. ఓటింగ్ విధానంలో విద్యార్థి ఎన్నికలు నిర్వహించామని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. రవి మారుత్, ప్రిన్సిపల్ ఆర్ పార్వతి రెడ్డి తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన విద్యార్థి ఎన్నికల కోసం ఆరు పోలింగ్ బూతులను, 15 ఈవిఎంలను ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిజమైన లోక్ సభ, శాసనసభ ఎన్నికలను తలపించే విధంగా ఎన్నికలు నిర్వహించామన్నారు. ఈ ఎన్నికలలో ఆరు నుండి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఓటింగ్లో పాల్గొంటారని ఎస్.పి.ఎల్. ఏ.ఎస్.పి.ఎల్ అభ్యర్థులకు తమ ఓటింగ్ ఇచ్చారన్నారు. పదవ తరగతి నుండి ఎస్‌పిఎల్‌కి 17 మంది, తొమ్మిదో తరగతి నుండి ఎ.ఎస్.పి.ఎల్ కి 26 పోటీపడ్డారన్నారు. అభ్యర్థులకు పోలైన ఓటింగ్ శాతాన్నిబట్టి విజేతలుగా ఎంపిక చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కమీషనర్‌గా సీనియర్ ఉపాధ్యాయులు సోషల్ డిపార్ట్మెంట్ హెడ్ వి.ఎస్.ఎన్. మూర్తి వ్యవహరించారు. పోలింగ్ సిబ్బందిగా ఉపాధ్యాయులు, సెక్యూరిటీగా ఎన్.సి.సి. విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది

- ఎస్సై బొల్లగాని సతీష్

నవతెలంగాణ-నేలకొండపల్లి

మంచి క్రమశిక్షణను అలవర్చుకోవడం ద్వారానే విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని ఎస్సై బొల్లగాని సతీష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థుల క్రమశిక్షణ- నైతిక విలువలు- ఉన్నత లక్ష్యాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ సత్యనారాయణ శాస్త్రి అధ్యక్షతన జరిగిన సెమినార్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులను, గురువులను, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. ఆకతాయిలుగా మారకుండా ధరించే దుస్తులు, కేశాలంకరణ వంటి వేషాధారణలో చక్కటి విద్యావంతునిగా ఆదర్శంగా ఉండాలన్నారు. లోక ఆకర్షణలకు బానిసలు కావద్దన్నారు. సెల్ ఫోన్లను, ఇంటర్నెట్ ను అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించరాదన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులే తమకు హీరోలుగా భావించి వారిని అనుకరించాలన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ఎస్సై సతీష్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఆర్ ఆమోస్, అధ్యాపకులు వై.సత్యనారాయణ రెడ్డి, గురవయ్య, భరత్, సూర్య ప్రకాష్, లక్ష్మణ్, భాస్కర్, ఏసోబు, ప్రమోదు, అరుణ, సత్యనారాయణ, బోధ నేతల సిబ్బంది పాషా, వెంకటనారాయణ, లక్ష్మి, అటెండర్ లలిత తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించిన జీపీ కార్మికులు

- సంఘీభావం తెలిపిన సీపీఐ(ఎం), సీపీఐ, టీడీపీ

నవతెలంగాణ-కొణిజర్ల

రాష్ట్ర జేఏసీ పిలుపులో బాగంగా మంగళవారం పంచాయతీ కార్మికులు ఎంపీడీవో కార్యలయాన్ని ముట్టడించారు. ఎంపీడీవో రమాదేవి తోపాటు ఇతర సిబ్బందిని కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకొని ధర్నా నిర్వహించారు. ధర్నాకు సీపీఐ(ఎం), సీపీఐ, టిడిపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, జిల్లా నాయకులు తాళ్లపల్లి క్రిష్ణ, సీపీఐ నాయకులు స్వర్ణ రమేష్, టిడిపి మండల అధ్యక్షుడు తాతా సుధాకర్‌లు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యలయాన్ని ముట్టడించిన విషయం తెలుసుకున్న పోలీసులు మండల పరిషత్ కార్యాలయం వద్దకు వచ్చి సీపీఎం సీపీఐ టీడీపీ నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీపి కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు నల్లమోతు నరేష్, గరిడేపల్లి భాస్కర్, వేము రవి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం), రైతు సంఘాల నాయకుల అరెస్ట్‌ని ఖండించండి



కొణిజర్ల : గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో రైతుల పక్షాన పోరాడుతున్న చింతకాని సీపీఎం మండల కార్యదర్శి మడిపల్లి గోపాల్ రావు, రైతు సంఘం నాయకులు ఉపేందర్ లను అరెస్ట్ చేసి కొణిజర్ల పోలీసు స్టేషన్ కి మంగళవారం తరలించారు. అక్రమ అరెస్ట్ లను ఖండిస్తూ సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావులు తీవ్రంగా ఖండించారు.

వానలతో పొంగుతున్న వాగులు



నవతెలంగాణ-కారేపల్లి

ఎడతెరిపిలేని వర్షాలతో కారేపల్లి మండలంలో వాగులు, చెరువు అలుగులు పొంగుపొర్లి ప్రవహిస్తున్నాయి. మండలంలోని పెద్దచెరువైన గాదెపాడు భూపతిరాయుని చెరువు అలుగు పడింది. గతంలో ఈచెరువు అలుగు పడితే 10 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగేవి నేడు చెరువు అలుగు వద్ద పెద్ద బ్రిడ్జీని నిర్మించటంతో ఇబ్బందులు తొలిగాయి. బుగ్గవాగు, నాగరాజు కట్టు, కోటిలింగాల వాగులు పొంగి పొర్లిపోతున్నాయి.

మణిపూర్‌లో మంటలు ఆర్పండి

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- కేంద్ర ప్రభుత్వానికి సీపీఐ(ఎం), సీపీఐల విజ్ఞప్తి

నవతెలంగాణ-ఖమ్మం

మణిపూర్ రాష్ట్రంలో గత మూడు నెలల నుండి జరుగుతున్న హింసాత్మక ఘటనలు యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. కూకీ తెగకు చెందిన గిరిజనులపై మారణ హెూమం సాగుతోంది. ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడి, హత్య చేయటం సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చౌక్‌లో మణిపూర్ మారణకాండను ఆపాలని, శాంతిని నెలకొల్పాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. జడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సభ జరిగింది. సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయా పార్టీల రాష్ట్ర, జిల్లా నేతలు మాట్లాడుతూ మణిపూర్‌లో కొండ కోనల్లో శాంతియుతంగా జీవనం కొనసాగిస్తున్న ప్రజల మధ్య మతోన్మాద ప్రభుత్వం తన లబ్ధి కోసం 54శాతం పైన ఉన్న మైతి కులస్తులకు, కూకి నాగా గిరిజన తెగల మధ్య తన రాజకీయ లబ్ది కోసం చిచ్చు పెట్టిందన్నారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మైతీలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టిందని చెప్పారు. ఆదివాసీలను అడవుల నుండి బయటకు పంపించి రిజర్వేషన్లు పొంది, విలువైన ఖనిజ సంపదను పొందాలనే కుట్రలు పన్నిందన్నారు. ఈ దుర్మార్గాన్ని నిరసిస్తూ కూకి నాగా ఆదివాసీ తెగల ప్రజలు నిరసన తెలియజేయగా, వారిపై గత మూడు నెలల నుండి బీజేపీ అండతో మైతి కులస్తులు తీవ్రమైన దాడులకు పాల్పడుతున్నారని వెల్లడించారు. గృహ దహనాలు, చర్చిలతోపాటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. హత్యాకాండ కొనసాగిస్తున్నారు. హింసాత్మకమైన ఘటనలకు పాల్పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని బాధ్యత వహించి దోషులను కఠినంగా శిక్షించాలని, అక్కడ శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా నాయకులు యం.సుబ్బారావు, బండి రమేష్, యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేష్, సీపీఐ జిల్లా నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఏపూరి లతాదేవి, ఎర్రబాబు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్‌రావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, మహమ్మద్ సలాం, మేకల శ్రీనివాసరావు, సీపీఐ(ఎం) నాయకులు ఎస్ కే బషీర్, దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, బండారు యాకయ్య, బోడపట్ల సుదర్శన్, ప్రవీణ్, వై శ్రీనివాసరావు, భూక్య శ్రీనివాసరావు, బత్తిని ఉపేందర్, కత్తుల అమరావతి, సీపీఐ నాయకులు ఇటికల రామకృష్ణ, తాటి నిర్మల, బెజవాడ రవి, గాదె లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అనుచరులకే ప్రభుత్వ పథకాలు

- బీసీ రుణాలపై స్పష్టత లేదు.

- మళ్ళీ మైనార్టీ రుణాలు అంటూ నయా మోసం

- నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్

నవతెలంగాణ-ఖమ్మం

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ పార్టీ ముఖ్య అనుచరులకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని, మధ్యతరగతి సామాన్య పేదలకు ఏమాత్రం లబ్ది చెందడం లేదని నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ జావేద్ ఆరోపించారు. మంగళవారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయం (సంజీవరెడ్డి భవనం)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడే కేసిఆర్ కు ప్రజలు గుర్తు వస్తారని 9 ఏళ్ల నుండి ఇచ్చిన హామీ ఏ ఒక్కటి అమలు చేయలేదని, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు, నిరుద్యోగ భృతి, మూడు ఎకరాల భూ పంపిణీ హామీలు అమలు చేయకుండా కొత్త హామీలతో ప్రజలను మోసం చేసేందుకు తయారు అవుతున్నాడని ఆరోపించారు. బీసీ రుణాల పంపిణీలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తు దారుల నుండి సుమారు రూ.350కోట్లు వచ్చాయని నియోజక వర్గానికి 300 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 607 మండలాల్లో ఇంచు మించు రెండు లక్షల మందిని ఎంపిక చేసిందని, ఇందులో 70 శాతం మంది బీఆర్ఎస్ గులాబీ నేతల అనుచరులే ఉన్నారని అన్నారు. అధికారుల బదిలీలోనూ ప్రభుత్వం తమకు అనుకూలంగా ఉన్న అధికారిని తమకు కావాల్సిన స్థానంలో స్థాన చలనం చేస్తుందని ,అవసరం లేని పోస్ట్ ని కూడా కల్పించి ఆ పోస్ట్ లోకి పార్టీకి అనుకూలంగా ఉన్న అధికారిని నియమించుకుంటున్న సంఘటనలు జిల్లాల్లో కోకొల్లలుగా ఉన్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటమి తప్పదని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు సిద్ధంగా ఉందని, అధికారం లోకి రాగానే ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చు కుంటామని తెలిపారు. బిసి సెల్ అధ్యక్షులు బానాల లక్ష్మణ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు మోజాహిద్ సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ ఎన్నికల వేళ బీఆర్ఎస్ మయ మాటలకు ప్రజలు లొంగిపోవద్దని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా మైనారిటీ అధ్యక్షులు మూజహిద్ హుస్సేన్, నగర మైనారిటీ సెల్ అధ్యక్షులు అబ్బాస్ బెగ్, ఖమ్మం నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఏలూరి రవికుమార్, బీసి సెల్ నగర అధ్యక్షుడు బాణాల లక్ష్మణ్, 23 డివిజన్ అధ్యక్షులు సయ్యద్ మహమూద్, 20 డివిజన్ అధ్యక్షులు మూజహిద్, తదితరులు పాల్గొన్నారు.





ఎంఎల్సీకి డీఎస్సీ ఉపాధ్యాయులు వినతి

నవతెలంగాణ-ఖమ్మం

డిఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం వర్తింప చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, న్యాయం జరిగేలా చూడాలని డీఎస్సీ 2003 పాత పెన్షన్ సాధన సమితి నాయకులు బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, స్థానిక సంస్థల ఎంఎల్సీ తాత మధుసూదన్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు సంక్రాంతి రవి కుమార్, రామనాథం, ముజీబ్ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ నుండి కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం అమలు లోకి వచ్చిందని, కానీ తమ పరీక్షలు, ఫలితాలు అంతకు ముందే అయిపోయిన, పాలనా పరమైన అసాధారణ జాప్యం వల్ల తాము 2005లో నియామకం పొంది అత్యంత నష్టదాయకమైన సీపీఎస్ పరిధిలోకి నెట్టివేయబడ్డామని, తమను పాత పెన్షన్ పథకం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. దీని వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకపోగా, లాభం జరుగుతుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల మంది కి లబ్ధి చేకూరుతుందని ఆయన దృష్టికి తెచ్చారు. దీనికి ఎంఎల్సీ మధు స్పందిస్తూ సమస్యను తప్పనిసరిగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చూస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏఎం శ్రీనివాస్, జెబిసి ప్రసాద్, భాస్కర్, సైదుబాబు, పల్లా రవి, రామారావు, శారద, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై ప్రధాని నోరువిప్పాలి

- పార్లమెంటు ఆవరణలో బీఆర్ఎస్ ఆందోళన

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మణిపూర్ రాష్ట్రంలో నెలకొన్న అస్థిర పరిస్థితులు, హింసాత్మక ఘటనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పార్లమెంటులో నోరువిప్పాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా చోటుచేసుకున్న అరాచకాలను తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటు ఆవరణలో ఆందోళనకు దిగారు. ఎంపీ రవిచంద్ర మాట్లాడుతూ.. మణిపూర్ రాష్ట్రంలో నెలకొన్న అస్థిర, అరాచక పరిస్థితుల పట్ల యావత్ దేశం విస్తుపోతున్నదని ఆవేదన చెందారు. మహిళల్ని నగ్నంగా ఊరేగించడం, యువకులను ఘోరంగా హత్య చేసి ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మణిపూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ప్రధాని మోడీ నోరువిప్పాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు, సహచర ఎంపీలు జోగినపల్లి సంతోష్ కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, రంజిత్ రెడ్డి తదితరులతో కలిసి పార్లమెంట్ ఆవరణలో నేలపై కూర్చొని రెండో రోజు మంగళవారం కూడా నిరసన వ్యక్తం చేశారు. ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ సస్పెన్షన్ ను ఎత్తివేయాలంటూ ఎంపీలు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనపై ప్రధాని మోడీ సిగ్గుతో తలదించుకోవాలన్నారు. పెద్ద పెట్టున నినాదాలు చేశారు.





ఐద్వా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

నవతెలంగాణ-ముదిగొండ


అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో ఖమ్మం లోటస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో (సీపీఎం కార్యాలయం) ప్రముఖ సంఘ సేవకురాలు కెప్టెన్ లక్ష్మీ సెహగల్ వర్ధంతి సందర్భంగా మంగళవారం మహిళలకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి మంగళవారం లాంఛనీయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పని ఒత్తిడితో తమ ఆరోగ్యాన్ని పట్టించుకోపోవటంతో మహిళలు పలు రకాల జబ్బులకు గురవుతున్నారన్నారు. మహిళల సంరక్షణకు ఐద్వా పలు కార్యక్రమాలు చేపడుతుందన్నారు. మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రముఖ సంతాన సాఫల్య నిపుణులు, ప్రసూతి స్త్రీల వ్యాధి వైద్యురాలు వి.లావణ్య పలువురు మహిళలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్యశిబిరానికి మహిళల నుండి విశేష స్పందన లభించి, విజయవంతమైంది. అనంతరం సామాజిక సేవకురాలు కెప్టెన్ లక్ష్మీ సేహగల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ లావణ్యను ఐద్వా మండల కమిటీ శాలువాతో ఘనంగా సత్కరించి మహిళ ఛాయాచిత్రం ఉన్న ఫోటోను అందజేసి వైద్యురాలు లావణ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ, మండల అధ్యక్షకార్యదర్శి మందరపు పద్మ, పయ్యావుల ప్రభావతి, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వైస్ఎంపీపీ మంకెన దామోదర్, చిరుమర్రి ఎంపీటీసీ సభ్యురాలు కోలేటి అరుణ, సీఐటీయూ మండల కన్వీనర్ టీఎస్ కళ్యాణ్, వ్యకాస మండల కార్యదర్శి వేల్పుల భద్రయ్య, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షకార్యదర్శి బట్టు రాజు, మెట్టెల సతీష్, సిపిఐ(ఎం) నాయకులు మందరపు వెంకన్న, ఇరుకు నాగేశ్వరరావు,కోలేటి ఉపేందర్,కందిమల్ల తిరుపతి, కందుల భాస్కర్ రావు, ఐద్వా మండల కమిటీ సభ్యులు డి లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

అడుగు దూరంలో వైరా ప్రాజెక్టు



నవతెలంగాణ-వైరా

వైరా ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో నిండేందుకు ఒక్క అడుగు దూరంలో ఉన్నది. ఆది, సోమ, మంగళ వారాల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్ట్‌కు క్రమంగా వరద పెరిగింది. మంగళ వారం సాయంత్రం 6 గంటలకు నీటి మట్టం 17. 3 అడుగులకు చేరింది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 18.3 అడుగులు. రాష్ట్ర వ్యవసాయ ప్రణాళిక ప్రకారం జులై 20, 25 నాటికి ఖరీఫ్ వరి నాట్లు వైరా ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు సాధ్యం కాలేదు. వ్యవసాయాధికారులు గ్రామాలలో రైతు సమావేశాలు నిర్వహించి ఖరీఫ్ ను ఒక నెల ముందుకు తేవాలని, అదే విధంగా రబీ వరి సాగు కూడా నెల ముందుకు తెచ్చి రబీలో అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా చూడాలని భావించినా రైతుల ఆశలు నెరవేరలేదు. ప్రాజెక్ట్ లో 12, 13 అడుగుల నీటి మట్టం సమయంలో నారు మడులకు నీరు విడుదల చేసి ఉంటే ఇప్పటికి ఖరీఫ్ వరి నాట్లు పూర్తి అయి ఉండేవి. కానీ రైతులు కూడా అందుకు డిమాండ్ చేయలేదు. తత్ఫలితంగా ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో ఎప్పటి లాగే ఆగస్టు చివరి వరకు వరి నాట్లు పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నవి. జూలై చివరి వారంలో నారు మడులకు నీరు విడుదల చేయాలన్న డిమాండ్‌ను సీపీఎం ఆధ్వర్యం లోని రైతు సంఘం, తెలుగు దేశం పార్టీలు ముందుకు తెచ్చినవి. ప్రాజెక్ట్ కు మంగళ వారం సాయంత్రానికి కూడా నీటి వరద ఉధృతిగానే చేరుతుందని నీటి పారుదల శాఖ డి.ఈ శ్రీనివాసరావు తెలిపారు. అందువలన రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లు వెంటనే నారు మడులు పోసుకోవటానికి నీరు విడుదలకు తేదీని ప్రకటించి రైతులను ఖరీఫ్ వరి సాగుకు సమాయత్తం చేయాలి.



రాపల్లిలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

నవతెలంగాణ - బోనకల్

గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల పరిధిలోని రాపల్లి గ్రామంలో వ్యవసాయ పొలాలకు ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ దిమ్మె మంగళవారం కూలిపోయింది. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. ట్రాన్స్ఫార్మర్ కోసం ఏర్పాటు చేసిన దిమ్మె నాసిరకంగా నిర్మించడం వల్ల అది వర్షాలకు కూలిపోయిందని రాపల్లి రైతులు అంటున్నారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని రాపల్లి రైతులు కోరుతున్నారు.

మణిపూర్ ఘటనపై వామపక్షాల నిరసన

నవతెలంగాణ-కారేపల్లి

మణిపూర్‌లో జరుగుతున్న ఆకృత్యాలను నిరసిస్తూ సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం కారేపల్లిలో నిరసన చేపట్టాయి. కారేపల్లిబస్టాండ్ సెంటర్‌లో ప్రధాని మోడీ, మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఈసందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే.నరేంద్ర, ఎన్డీ మండల కార్యదర్శి వై.ప్రకాష్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ బానోత్ బన్సీలాల్, సీపీఐ(ఎం) నాయకులు వజ్జా రామారావు, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వై.జానకి తదితరులు పాల్గొన్నారు.

రేపు వల్లాపురంలో ఆర్సిఎం చర్చి ప్రారంభం



ముదిగొండ : మండల పరిధిలో వల్లాపురంలో ఆర్సిఎం చర్చి నూతన ప్రార్థన మందిరం ప్రతిష్ట మహెూత్సవం ఈనెల 27న గురువారం నిర్వహించనున్నట్లు వెంకటాపురం విచారణ గురువులు, ఫాదర్ తానంగి ప్రేమసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చి ప్రారంభానికి వరంగల్ పీఠాధిపతులు, ఖమ్మం పీఠా అపోస్తోలిక పాలనధికారి రేవ, ఉడుమల బాల ముఖ్యఅతిథులుగా హాజరై చర్చిని ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని ఆర్సిఎం సంఘస్తులు, సేవకులు, శ్రేయోభిలాషులు, విశ్వాసులు భారీగా తరలివచ్చి దైవార్చనలో పాల్గొని దైవాశీస్సులు పొందగలరని ఆయన కోరారు. 26 ఉదయం బుధవారం దైవమాత స్వరూపంలో గ్రామ పురవీధుల్లో ప్రదక్షణ నిర్వహించి బిషప్ కు స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసామని రేవ ఫాదర్ ప్రేమసాగర్ చెప్పారు.

మోటర్ సైకిల్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో.. వ్యక్తి మృతి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండల ఊట్కూర్ స్టేజీ వద్ద మంగళవారం మోటర్ సైకిల్‌ను ట్రాలీ ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై పుష్పాల రామారావు తెల్పిన వివరాల ప్రకారం.. గార్ల మండలం కిష్టాపురానికి చెందిన సపావట్ శివ(30) తన పెద్దకుమారుడి టీసీ కోసం కారేపల్లి మీదిగా గాంధీపురంకు మోటర్ సైకిల్ పై వస్తున్నాడు. ఊట్కూర్ స్టేజీ సమీపంలో ఇల్లందు - ఖమ్మంకు వెళ్తున్న ఆటో ట్రాలీని గానసల సాయి అనే వ్యక్తి అతివేగంగా వచ్చి మోటర్ సైకిల్‌పై వెళ్తున్న శివను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య సునిత ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ బాయ్స్ పాఠశాలను సందర్శించిన ఎంపీజే



నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ బాయ్స్ పాఠశాలను మంగళవారం ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం, మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదులుని కలిసి, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలపై .చర్చించారు. అనంతరం ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం విద్యార్థులతో కలిసి పాఠశాల మొత్తం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిం మాట్లాడుతూ.. పిల్లలు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారని వాటిని పరిష్కరించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సైదులుని కోరుతూ విన్నవించారు. స్కూల్‌లో పరిశుభ్రత విషయమై చూడగా బాత్ రూమ్స్‌కి డోర్ లేక పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు, తెలిపారు. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బ తిని దుర్వాసన వస్తుంది అని అన్నారు. వీటి వల్ల పిల్లలు అనారోగ్యానికి గురి అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీజే జిల్లా ఉపాధ్యక్షుడు ఎంఏ గఫార్, కార్యదర్శి ఎం డి జమీల్, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులు సేవాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఏపిజివిబి మేనేజర్ రాచకొండ రవిచంద్ర



నవతెలంగాణ-ముదిగొండ

బ్యాంకు ఖాతాదారులు, రైతులు బ్యాంకు మిత్రల సేవాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ రాచకొండ రవిచంద్ర అన్నారు. ముదిగొండలో బ్యాంకు మిత్రల సేవాకేంద్రాన్ని మంగళవారం ఆయన లాంఛనీయంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపిజివిబి జోనల్ మేనేజర్ వి.రమేష్, బ్యాంకు మిత్రలు గొడవర్తి పావని, రాము, పసుపులేటి కళ్యాణి, నాగమణి, బ్యాంకు సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

అలుగు పారుతున్న పాలేరు జలాశయం...



నవతెలంగాణ-కూసుమంచి

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలతోపాటు, చుట్టుపక్కల జిల్లాల నుండి వస్తున్న భారీ వరద నీరు వాగుల ద్వారా మంగళవారం పాలేరు జలాశయానికి చేరడంతో జలాశయం నిండుకుండలా మారింది. దీంతో పాలేరు జలాశయం నీటిమట్టం 23 అడుగులు పూర్తిస్థాయి నీటిమట్టంకి చేరింది. దీంతో చెరువు అలుగు పారుతుంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరటంతో జలాశయం ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కూసుమంచి

వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం జీవో నెం. 81 విడుదల చేయడంపై మంగళవారం మండల వీఆర్ఏలు హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో విఆర్ఎల రాష్ట్ర కార్యదర్శి బానోత్ రవికుమార్, వీరన్న, మండల వీఆర్ఏల అధ్యక్షుడు దారా శ్రీనివాసరావు, వీఆర్ఏలు గుడ్ల రమేష్, షేక్ అన్వర్, బొడ్డు నరేందర్, నిమ్మల అనిల్ నాగమణి పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కట్టుబడిన కేసీఆర్

- మైనార్టీ సెల్ జిల్లా నాయకులు గౌసుద్దీన్



నవతెలంగాణ-కారేపల్లి

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కట్టుబడి పని చేస్తున్నారని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు ఎస్‌కె.గౌసుద్దీన్ అన్నారు. మంగళవారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలో జనభాలో అధికంగా పేదలు ఉన్నారని గుర్తించిన ముఖ్యమంత్రి కేసిఆర్ వారికి ఆర్థిక సాయ పథకాన్ని వర్తింపు చేస్తూ నిర్ణయం తీసుకోవటం హర్షనీయమన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం తపించే నేత కేసీఆర్ అని ఆయన సారథ్యంలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తెలంగాణ ప్రజలు పొందున్నారని తెలిపారు. సంక్షేమ ఫలాలు పొందుతున్న ప్రతి ఒక్కరు కేసీఆర్‌ని కొనియాడుతున్నారని మరోసారి సీఎంగా కేసీఆర్ కావటం ఖాయమైందన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ - ఎర్రుపాలెం

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మంగళవారం మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య, సిఐటియు మండల అధ్యక్షుడు సంజీవరావు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు దివ్వెల వీరాంజనేయులు, గ్రామ పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు గంతాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పెద్దిమల్ల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి కలపాల రవి, ఉప కార్యదర్శి సూరి, కోశాధికారి గోపాలరావు, కార్మికులు నరేష్, వెంకట్, నరసింహారావు, కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కామేపల్లి : పంచాయతీ కార్మికుల దీక్షా శిబిరానికి జడ్పీటీసీ వెంకటప్రవీణ్ నాయక్ చేరుకొని సంఘీభావం తెలిపారు. సమ్మెకు మద్దతు తెలిపి 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కామేపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య మాలోతు శంకర్ నాయక్, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు దుగ్గి కృష్ణ, సర్పంచ్ కిన్నెర నాగయ్య ఎస్సీ సెల్ అధ్యక్షులు రాయబారపు కవిరాజు, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఆలోత్ మోహన్ పాల్గొన్నారు.

కల్లూరు : గ్రామ పంచాయతీ కార్మికులు జోరువానలోనూ సమ్మె కొనసాగిస్తున్నారు. శిబిరాన్ని ఎఐటియుసి మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మందా వెంకటేశ్వర్లు సందర్శించి సంఘీభావం తెలిపారు.

పల్లె ప్రగతి నగదు అందజేత

నవతెలంగాణ-వేంసూరు

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 15న గ్రామపంచాయతీ కార్యాలయాల్లో జెండా వందనం తదితర కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు నిర్వహణకు 2500 నగదు మంజూరు చేసింది. ఈ సమాచారం సర్పంచులకు తెలియకపోవడం సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచటంతో నవతెలంగాణ వెలుగులోకి తేవడంతో సర్పంచులుచ కార్యదర్శులకు సమాచారం అందించి పల్లె ప్రగతి సంబంధించిన నగదు తీసుకెళ్లాలని తెలిపారు. అధికారుల ఆదేశాలు మేరకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహణకు గ్రామ పంచాయతీలకు అధిక భారం పడి కొంతమంది సర్పంచులు నేటి వరకు అప్పులు తీర్చక ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజులుగా నగదు పంచాయతీలకు పంపిణీ చేయకుండా ఉంచటం పట్ల ప్రజలకు పలు అనుమానాలు కలుగుతున్నాయి ఈ సమాచారాన్ని వెలుగులోకి తేవడం పట్ల పలువురు సర్పంచులు నవ తెలంగాణకు అభినందనలు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే అధ్యక్షతన రైతు సమావేశం

నవతెలంగాణ-వైరా

వైరా ప్రాజెక్ట్ నుండి ఖరీఫ్ వరి సాగుకు నీరు విడుదల చేయుటకు ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ అధ్యక్షతన బుదవారం ఉదయం గంటలకు క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు నీటి పారుదలశాఖ డిఈపి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయకట్టు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని డిఈ కోరారు.

తొండల గోపవరంలో వైద్య శిబిరం

నవతెలంగాణ-మధిర

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా పిహెచ్సి వైద్యులు డా.పృథ్వి ఆధ్వర్యంలో మధిర మండలం ఖమ్మంపాడు సబ్ సెంటర్ పరిధిలో తొండలగోపవరం రైతు వేదిక నందు మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి చిరు వ్యాధులకు చికిత్స చేసినారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో దీర్ఘకాలిక జబ్బులు ఉన్నవారికి షుగర్, బిపి, టాబ్లెట్‌లు మరియు జిల్లా ప్రధానహాస్పటల్‌లో స్కానింగ్‌లు కార్డియాక్ ఇబ్బందులు ఉన్నవారిని వెళ్ళాలి అని సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పిహెచ్సి సిబ్బంది లంకా కొండయ్య, ఎఎన్ఎమ్ భారతి, ఆశ విజయమ్మ పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలి

- కలెక్టర్ విపి. గౌతమ్



నవతెలంగాణ- ఖమ్మం

యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ విపి.గౌతమ్ అన్నారు. మంగళవారం నగరంలోని యస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో 2019-2023 సంవత్సరపు విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాంచ్ ఏదైనా చేరవలసిన లక్ష్యాన్ని మరువకూడదన్నారు. కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల కోరిక మన్నించి గ్రాడ్యుయేషన్ డేకి అనుమతించడం జరిగిందన్నారు. ఎస్బిఐటి విద్యార్థులు 293 పైగా ప్లేస్ మెంట్లు సాధించి కళాశాల గర్వపడే స్థాయికి తెచ్చినందుకు వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ గంధం శ్రీనివాసరావు, ఎకడమిక్ డైరెక్టర్స్, డాక్టర్ ఎవివి. శివప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ జి.సుభాష్ చందర్, డాక్టర్. జె.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కరువుతీరా వర్షం

ఖమ్మం జిల్లాలో

1491 మి.మీ

బోనకల్‌లో అత్యధికం 124.2 మి.మీ

పలు మండలాల్లో లోటు వర్షం భర్తీ

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి:

నిన్న మొన్నటి వరకు వర్షాభావ పరిస్థితులతో కొట్టుమిట్టాడిన జిల్లా అల్పపీడన ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వానలతో లోటు వర్షపాతం నుంచి బయటపడుతోంది. జిల్లాలో ఈ సీజన్‌లోనే అత్యధిక వర్షం 1491 మి.మీ మంగళవారం నమోదైంది. అత్యధికంగా బోనకల్‌లో 124.2, కూసుమంచిలో 112 మి.మీ వర్షం కురిసింది. అత్యల్పంగా 14.8 మి.మీ వర్షం సత్తుపల్లిలో కురిసింది. జిల్లాలో ఒకటి, రెండు మండలాలు మినహా అన్నీ వర్షాభావ పరిస్థితిని అధిగమించాయి. కరువుతీరా వానలు పడుతుండటంతో రైతుల్లో ఆనందం తొణికిసలాడుతోంది. వర్షాల రాకపై జిల్లా పరిషత్ సమావేశంలోనూ ప్రజాప్రతినిధులు మంగళవారం హర్షం వెలిబుచ్చారు.



+ సగటు వర్షపాతానికి చేరువలో...

జూలై నెలలో సగటు వర్షపాతానికి చేరువలో వర్షాలు నమోదవుతున్నాయి. జూలైలో సాధారణ వర్షపాతం 272 మి.మీ కాగా ఐదురోజులు మిగిలి ఉండగానే 201.3 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో మూడురోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నివేదిక నేపథ్యంలో ఈనెల సాధారణ వర్షపాతాన్ని జిల్లా అధిగమించే అవకాశం ఉంది. ఖరీఫ్ ఆరంభం జూన్ 1వ తేదీ నుంచి ఈనెల 25వ తేదీ వరకు 328.8 మి.మీ వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా 261.7 మి.మీ వర్షం కురిసింది. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 105.2 మి.మీ కాగా గతేడాది 121.4 మి.మీ వర్షం అంటే 15.4 మి.మీ అధిక వర్షం నమోదైంది. ఈ ఏడాది కేవలం 49.5 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. కురవాల్సిన దానికన్నా 52.9 మి.మీ తక్కువ వర్షం కురిసింది. గత నెల కేవలం ఏడు రోజులు మాత్రమే వర్షాలు పడ్డాయి. ఈనెలలో 25 రోజులకు గాను 19 రోజులు వర్షాలు కురవడం గమనార్హం.

+ వర్షాభావం అధిగమిస్తూ...

సరిగ్గా ఐదారు రోజుల క్రితం వరకు ఏ ఒక్క మండలంలోనూ సరైన వానే పడలేదు. జిల్లాలోని 21 మండలాల్లో ఒక కామేపల్లిలో కురవాల్సిన దానికంటే అధికంగా, కారేపల్లిలో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన ఏ మండలంలోనూ లోటువర్షాలే ఉన్నాయి. నేలకొండపల్లి, ముదిగొండ, చింతకాని మండలాల్లో అత్యంత లోటువర్షపాతం నమోదైంది. ఈనెల 19వ తేదీ నుంచి మూడు రోజుల పాటు తెరపి ఇచ్చి రెండు రోజులుగా మొదలైన వానలతో ఒక్కసారిగా లోటు నుంచి అన్ని మండలాలు బయటపడుతున్నాయి. రఘునాథపాలెం 21.8, నేలకొండపల్లి 23.9, ముదిగొండ 27.3, చింతకాని 25.3, కొణిజర్ల 20.7 మి.మీ లోటు వర్షాలు ఉన్నాయి. ఈ ఐదు మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ సాధారణ వర్షపాతం నమోదైంది. కారేపల్లి 44.2 , కామేపల్లి 67.6, బోనకల్ 24.6 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. ఈ వర్షాలతో నిన్నమొన్నటి వరకు నీరు లేక నీరసించిన చెరువులు, కుంటలు ఒక్కసారిగా జలకళ సంతరించుకుంటున్నాయి. వాగులు, వంకలు జోరుగా ప్రవహిస్తున్నాయి. భూగర్భజలాలు కూడా ఉబికి బావులు, బోర్లలో ఊటలు పెరుగుతుండటంతో రైతాంగం హర్షం వెలిబుచ్చుతోంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న చిన్న బీరవల్లి వాగు

- రాకపోకలు నిలిపివేసిన అధికారులు
- చేపల కోసం పరుగులు తీసిన గ్రామస్తులు





నవతెలంగాణ - బోనకల్

గత వారం రోజులుగా మండలంలో జోరుగా కురుస్తున్న వర్షాల వల్ల చిన్న బీరవల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వరద నీరు వాగుపై ప్రవహిస్తుంది. ఈ వరద నీటిలో చేపలు ఎక్కువగా రావడంతో చిన్న బీరవల్లి, చుట్టుపక్కల గ్రామస్తులు చేపల కోసం పెద్ద ఎత్తున పరుగులు తీశారు. వాగు మీద నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎంపీడీవో బోడేపూడి వేణుమాధవ్ ఎంపీఓ వ్యాకరణం వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే అక్కడికి చిన్న బీరవల్లి గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాలు కూడా చేపల కోసం పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వాగు మీద నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు ఎవరూ చేపల కోసం వెళ్లవద్దని ఎంపీడీవో బడేపూడి వేణుమాధవ్ ఎంత కోరినా గ్రామస్తులు వినిపించుకోలేదు. దీంతో పోలీస్ స్టేషన్కు ఆయన సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ దారేల్లి బాలస్వామి తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని ఎవరో ఇటువైపు రావద్దని పోలీసులు, మండల అధికారులు గ్రామస్తులకు స్పష్టం చేశారు. అయినా చేపల కోసం జనం పరుగులు పెడుతూనే ఉన్నారు. దీంతో అధికారులు ఆ వాగు మీద గుండా పూర్తిగా రాకపోకలు నిలిపివేశారు. చేపల కోసం వచ్చిన వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. చిన్న బీరవల్లి వాగు వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుందని ఆ వాగుపై ఎవరూ రాకపోకలు కొనసాగించవద్దని మండల అధికారులు కోరారు.

సత్తుపల్లిలో రూ. 25కోట్లతో...
బీఎస్సీ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

- ప్రత్యేక జీవోను విడుదల చేసిన ప్రభుత్వం
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలో రూ. 25కోట్లతో బీఎస్సీ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసిందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రాంత విద్యార్థుల కోసం సత్తుపల్లిలో నర్సింగ్ కళాశాల కావాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్యమంత్రి హరీశ్‌రావును కోరడం జరిగిందన్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఈ ప్రాంతంలో కళాశాల ఆవశ్యకతను కూలంకుషంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదించిందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖకు ప్రభుత్వ సెక్రెటరీ ఎస్ఏఎం రిజ్వి మంగళవారం కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ప్రత్యేక జీవోను విడుదల చేశారు. ఈ కళాశాల కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వరంగల్ అనుబంధంతో ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ న్యూఢిల్లీ గుర్తింపుతో 60 సీట్ల కెపాసిటీతో నాలుగేండ్ల బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సును ప్రారంభించేందుకు అనుమతులు జారీ అయ్యాయన్నారు. వచ్చే అక్టోబరు నుంచే అడ్మిషన్లు ప్రారంభించి భవన నిర్మాణాలు పూర్తయ్యే వరకు ప్రయివేట్ భవనాలను అద్దెకు తీసుకొని కళాశాలను నడిపేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకుంటాయన్నారు. తాను కోరిన వెంటనే స్పందించి తక్షణమే బీఎస్సీ నర్సింగ్ కళాశాలను మంజూరు చేయడంతో పాటు వెంటనే కళాశాల భవన నిర్మాణాలను ప్రారంభించాలంటూ సంబంధిత శాఖలను ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్యమంత్రి హరీశ్‌రావు ఆదేశించడంపై ఆనందం వ్యక్తంచేస్తూ ముఖ్యమంత్రికి, వైద్యమంత్రికి సండ్ర ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలతో పాటు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు గొప్ప అదృష్టమన్నారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకు 90శాతం, ఓపెన్ కేటగిరీలో 10శాతం చొప్పున సీట్ల కేటాయింపు ఉంటుందని ఎమ్మెల్యే సండ్ర తెలిపారు. ఇదేగాక సత్తుపల్లికి ఇటీవల పాలిటెక్నిక్ కళాశాలను కూడా ప్రభుత్వం మంజూరు చేయించానన్నారు. ఈ రెండు కళాశాలల ఏర్పాటు ఈ ప్రాంత విద్యార్థులకు ఓ వరంగా మారనున్నాయని సండ్ర అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ కూసంపూడి మహేశ్, సత్తుపల్లి, పెనుబల్లి ఎంపీపీలు దొడ్డా హైమవతిశంకరరావు, లక్కినేని అలేఖ్య, జెడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావు, డీసీసీబీ డైరెక్టర్లు చల్లగుండ్ల కృష్ణయ్య, మోదుగు పుల్లారావు, బీఆర్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

- వ్యవసాయ అధికారి ఎం.రూప

నవతెలంగాణ-కల్లూరు

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి చేలు ఎర్రబడకుండా వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి ఎం.రూప రైతుల్ని కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గత వారం రోజుల నుండి ఎడతెరిపి లేకుండా జల్లులు పడుతున్నాయని, దీంతో పత్తి మొక్కలు ఎర్రబడిపోవడం, వేరుకుళ్ళు, మొక్కలు చనిపోవడం విపరీతంగా గడ్డి మొక్కలు పెరగటం, దీని వల్ల రైతులు ఆశించిన రీతిలో పత్తి ఏపుగా పెరగదని అన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే పత్తి చేలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. వర్షాలను ఆసరా చేసుకొని ఎకరాకు 25 కిలోల యూరియా పది కిలోలు పొటాష్ ఎరువులను మొక్కలకు 5- 7 సెంటీమీటర్ల దూరంలో వెయ్యాలి అన్నారు. కలుపు నివారణ కోసం పైరు 20 నుంచి 25 రోజుల్లో క్విజల్ పాప్ ఇథైల్ 400మి.లీ. పైరి తియోబాక్ సోడియం 250మి.లీ ఎకరానికి పిచికారి చేస్తే గడ్డి మొక్కలు, తీగజాతి మొక్కలు నివారించుకోవచ్చునన్నారు.

మణిపూర్‌లో అకృత్యాలకు మోడీ బాధ్యత వహించాలి : ఐద్వా



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 11వ వర్థంతి వేడుకలను మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలోని బిటిఆర్ భవనం నందు మంగళవారం ఐద్వా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి సెహగల్ చిత్రపటానికి ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల కార్యదర్శి పెండ్యాల సుమతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ మాట్లాడుతూ గత 80 రోజులుగా మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు మోడీ- అమిత్ షాలే కారణమని విమర్శించారు. వందలాదిమంది మహిళలు, చిన్నారులు, అమాయకుల చావుకు కారణమైన వారిద్దరు వెంటనే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నేటి ఆధునిక యుగంలో మతాల, వర్గాల పేరుతో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం హేయమైన చర్య అన్నారు. సుప్రీంకోర్టు స్పందించే వరకు మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లపై మోడీ మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. మణిపూర్ మహిళలకు దేశంలోని యువత, మహిళలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బండి పద్మ నాయకురాలు పోతురాజు సావిత్రి, కొక్కినేని సైదమ్మ, గొడ్డేటి రాజేశ్వరి, మొగిలిశెట్టి చంద్రమ్మ, అనసూర్య, మండవ సరిత, లక్ష్మీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో భారీ వర్షం

పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

నవతెలంగాణ- ఖమ్మంరూరల్

మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, ఉపనదులు, చెరువులు మంగళవారం పొంగి పొర్లుతున్నాయి. మున్నేరు ఉపనది నిండుగా ప్రవహిస్తుంది. మున్నేరుపై ఉన్న పొలిశెట్టిగూడెం, తీర్థాల, గోళ్లపాడు, రాజీవ్ స్వగృహ వద్ద ఉన్న చెక్ డ్యాంలు పొంగి పొర్లుతున్నాయి. తీర్థాల వద్ద సంగమేశ్వర ఆలయం మెట్లను తాకుతూ మున్నేరు ప్రవాహం కొనసాగుతుంది. ఆకేరు ఉపనది నిండుగా ప్రవహిస్తుంది. తీర్థాల వద్ద వంతెన పైనుంచి ఆకేరు ప్రవాహం కొనసాగుతుంది. వంతెన పైనుంచి ఆకేరు ఉపనది ప్రవహిస్తుండటంతో అధికారులు గోళ్లపాడు, తీర్థాల గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. కస్నాతండా వద్ద ఆకేరు వంతెనకు సమాతరంగా ప్రవహిస్తుంది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. తీర్థాల వద్ద ఆకేరు ఉపనది వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఓ రైతు తన ఆవులు, దూడలను తోలుకుంటూ వంతెన దాటుతుండగా ఓ దూడ నీటిలో కొట్టుకు పోయింది. తరువాత ఆ దూడను స్థానికులు బయటికి తీశారు.

CHANGE OF NAME

I, VORUKONDA UMA VENKAT RAO S/o VEERA NARAYANA R/o Hno 9-1-42, Kaman Bazar, Khammam 507001 TS have changed my name from VORUKONDA UMA VENKAT RAO to VURUKONDA UMA VENKAT RAO and henceforth I shall be called as **VURUKONDA UMA VENKAT RAO** for all purposes.

(TH TMRAO

రహదారి విస్తర్ణకు రూ.55 కోట్లు మంజూరు



నవతెలంగాణ-ఖమ్మంరూరల్

వల్లెగూడెం-మంగళగూడెం రహదారి విస్తర్ణ కోసం రోడ్లు భవనాల శాఖ నుంచి రూ.55 కోట్లు మంజూరైనట్లు టిఆర్ఎస్ ఖమ్మం రూరల్ మండలాధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ అన్నారు. మండలంలోని జలగంనగర్ వద్ద గల ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బెల్లం వేణు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న రహదారిని ప్రజల అవసరాలను గుర్తించి పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రహదారి విస్తర్ణ కోసం నిధులు మంజూరు చేయించారని అన్నారు. ఈ రహదారి విస్తర్ణ కోసం గతంలో ఎంతో మంది అధికారులు, నాయకుల చుట్టూరా ప్రదక్షిణలు చేసినా ఫలితంలేదన్నారు. గతంలో ఏ నాయకుడు చేయలేని పనిని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి చేసి చూపారని కొనియాడారు.కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, జడ్పీటీసీ యండపల్లి వర ప్రసాద్, సుడా డైరెక్టర్ గూడ సంజీవరెడ్డి,సర్పంచులు వెంకటరెడ్డి, యండపల్లి రాధిక, జగదీశ్, నాయకులు కొప్పుల ఆంజనేయులు, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు :ఖమ్మం

ఇ.పి నెంబర్ 69/2018 ఇన్

ఓ.యస్ నెం 146/2008

బిట్వీన్:

కొల్లి రంగారావు మరియు ఇతరులు

......DHr/వాదులు

మరియు

గుడవర్తి భ్రమరాంబ

....JDr/ప్రతివాది

టు

గుడవర్తి భ్రమరాంబ తండ్రి: సంగమేశ్వరావు, వయస్సు: 65సం॥లు, వృత్తి: గృహిణి, ఇ.నెం. :11-10-709/11,బుర్హన్‌పురం, ఖమ్మం.

నోటీసు

పైన తెలిపిన ఇ.పి.నెంబర్ 69/2018లో మీరు ప్రతివాది అయ్యి ఉన్నారు. సదరు ఇ.పి లో మీకు కోర్టు వారు ఎన్నిసార్లు నోటీసులను పంపినప్పటికి మీకు నోటిసులు ముట్టనందున ఈ ప్రకటన ద్వారా గుడవర్తి భ్రమరాంబ గారికి తెలియచేయునది ఏమనగా పైన తెలిపిన ఇ.పి నెంబర్ 69/2018 కేసు గౌరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ ఖమ్మం నందు తేదీ **06/09/2023** న వాయిదా ఉన్నది. కావునా ఆరోజు ఉ॥గం॥ **10-30** ని॥లకు మీరు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా గాని హజరై మీ ఆక్షేపణలు, అభ్యంతరాలు తెలియజేయగలరు. లేనిచో సదరు కేసును మీ పరోక్ష మందు తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వులతో //

ఖమ్మం ది.25.7.2023

కొల్లి సత్యనారాయణ

కట్టెబోయిన మాధవి

వాదితరపు న్యాయవాదులు,

ఖమ్మం. సెల్ 9399322422

మహారాజశ్రీ మోటార్ యాక్సిడెంట్స్ క్లయిమ్స్ ట్రిబ్యునల్ (ప్రిన్సిపల్ జిల్లా జడ్జి) వారి కోర్టు ఖమ్మం

MATOP NO.339/2019

బిట్వీన్:

నాగటి వెంకన్న

....క్లయిమ్ పిటీషనర్

మరియు

1) కనమర్లపూడి దినేష్

2) చోల మండలం జనరల్ ఇన్సూరెన్స్ కం. లిమిటెడ్, ఖమ్మం.

......రెస్పాండెంట్స్

టు

ఆర్-1) కనమర్లపూడి దినేష్, తండ్రి : యాదగిరి, వయస్సు : మేజర్, వృత్తి : ఆటో డ్రైవింగ్ నెం. ఎపి 20 టిసి 4646, నివాసం : ఇ.నెం. 2-139/ఎ, మద్దులపల్లి గ్రామం, ఖమ్మం రూరల్ మండలం, ఖమ్మం జిల్లా.

నోటీసు

పైన తెలిపిన క్లయిమ్ పిటీషనర్, రెస్పాండెంట్ నెం.1 అయిన మీపై మోటార్ వాహన ప్రమాద నష్ట పరిహారం కొరకు పైన తెలిపిన కోర్టు వారి నందు దావా దాఖలు చేసినారు. ఇట్టి దావా ది. 11-8-2023న వాయిదా ఉన్నది. మీరు స్వయంగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని పైన తెలిపిన కోర్టు వారి ఎదుట ది. 11-8-2023న ఉ.గం. 10.30 ని॥లకు హాజరు కాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వులతో //

ఖమ్మం ది.25.7.2023

బెంకటి వెంకటేశ్వర్లు

బెంకటి సందీప్

ముప్పిడి సతీష్

న్యాయవాదులు, ఖమ్మం.

ఖమ్మం. సెల్ 9848017262

IN THE COURT OF THE FAMILY JUDGE, AT KHAMMAM

CRL. M.P. NO. 02 OF 2022 IN M.C. NO. 14 OF 2017

Between :

1.Vutukuru Aswini, W/o. Ranga Rao,

2. Vutukuru Koundinya, S/o. Ranga Rao, being minor rep. by his mother, petitioner No.1 Both R/o. Khammam.

.....Petitioners

AND

Vutukuru Ranga Rao

..... Respondent

NOTICE

To,

Vutukuru Ranga Rao, S/o. Radha Krishna Rao, age : 35 yrs, Occ : Pvt. Employee, R/o. H.No. 11-10-770/4, Raparthi Nagar, Khammam City.

The petitioner 1 and 2 are the wife and son of respondent who filed the above petition for the Enforcement of order, in which you are avoiding to receive summons. The Hon'ble court pleased to Order paper Publication against you. Take notice that, the case stands posted on **16-08-2023** for your appearance. You are required to appear before the above court on **16-08-2023, by 10.30** AM either in person or through an advocate. Failing which the matter shall be heard exparte.

(By order of the Court)

AMANAGANTI VENKATA RAMANA

Advocate for Petitioners Khammam.

Khammam. Dt. 25-7-2023


అనుదినం...జనస్వరం
www.praja.khammam@gmail.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం 26, జులై 2023

పెండింగులో ఉన్న ఓటర్ దరఖాస్తులను అప్లోడ్ చేయాలి

కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ పాల్వంచ



పెండింగ్ ఉన్న ఓటర్ దరఖాస్తులు బుధవారం వరకు ఎన్నికల కమిషన్ వెబ్సైట్‌లో అప్లోడ్ చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ హైదరాబాద్ నుండి ఫారం 6,7,8 నమోదు ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ ఐడిఓసి కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నూతన ఓటర్లు ఫారం 6 ద్వారా 16099 దరఖాస్తులు రాగా 14749 విచారణ పూర్తి చేయగా 350 పెండింగ్ ఉన్నాయని ఉన్నాయని చెప్పారు. అదే విధంగా మరణించిన ఓటరు తొలగింపుకు 4292 ఫారం 7 జారీ చేయగా మంగళవారం వరకు 3826 విచారణ ప్రక్రియ పూర్తి కాగా 448 పెండింగ్ ఉన్నాయన్నారు. అలాగే ఓటరు చిరునామా మార్పులు, చేర్పులకు ఫారం 8కు ద్వారా 21812 దరఖాస్తులు రాగా 21357 దరఖాస్తులు విచారణ ప్రక్రియ పూర్తి కాగా 455 పెండింగ్ ఉన్నాయని చెప్పారు. అన్ని కలిపి ఫారం 6,7,8లకు 41205 దరఖాస్తులకు గాను 39952 విచారణ ప్రక్రియ పూర్తి చేశామని, మిగిలిన 1253 దరఖాస్తులు బుధవారం వరకు ఎన్నికల కమిషన్ పోర్టల్‌లో అప్లోడ్ చేస్తామని చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓలు స్వర్ణలత, రత్నకళ్యాణి, ఎస్డీసి శివాజీ పాల్గొన్నారు.



నేటి నుండి సోలార్ కార్మికుల నిరవధిక సమ్మె

జయప్రదం చేయండి : సీఐటీయూ, ఐఎఫ్టీయూ

నవతెలంగాణ-ఇల్లందు

నేటి నుండి సోలార్ కార్మికుల నిరవధిక సమ్మె చేయనున్నారని, జయప్రదం చేయాలని సీఐటీయు, ఐఎఫ్టియు నేతలు ఎస్ఏ నబి, షేక్ యాకుబ్ షావలి పిలుపునిచ్చారు. సింగరేణి సోలార్ కార్మికుల జనరల్ బాడీ సమా వేశం, చంద్ర కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ భవనంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ ఇల్లందు నియోజకవర్గ కన్వీనర్ ఎస్ఏ నబి, షేక్ యాకుబ్ షావలి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పాల్గొని మాట్లాడారు. ఇల్లందు సింగరేణి సోలార్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు నామమాత్రపు వేతనాలు చెల్లిస్తున్నారన్నారన్నారు. ఈ నామమాత్రపు వేతనాలకు వ్యతిరేకంగా గత రెండు సంవత్సరాల నుంచి సింగరేణి యాజమాన్యం, టెండర్ పొందిన బిహెచ్ఇఎల్ సోలారిస్ యాజమాన్యాలకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం కార్మికులకు కనీస వేతనాలు కేటగిరీ వారీగాచెల్లించి చట్టబద్ధహక్కులు అమలుకు వెంటనే సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకోవాలని కోరారు. లేనియెడల నిరవధిక సమ్మె కార్మికుల సమస్యల పరిష్కారమయ్యే అంతవరకు కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ రాజు, బాలు, ప్రేమ్ సింగ్, రమకృష్ణ, ఉపేందర్, శంకర్ పాల్గొన్నారు.

కేజీబీవీ జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు

- చివరి తేదీ ఆగస్ట్ 5
- స్పెషల్ ఆఫీసర్ వి.పద్మ

నవతెలంగాణ-అళ్ళపల్లి



మండల పరిధిలోని అనంతోగు గ్రామం కేజీబీవీ జూనియర్ కాళాశాల (ఇంటర్)లో ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం చదివే విద్యార్థినీలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని కేజీబీవీ జూనియర్ కాలేజ్ స్పెషల్ ఆఫీసర్ వి.పద్మ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వచ్చే నెల ఆగస్టు 5వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగనున్నాయని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు మాత్రమే ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన మండలంలోని అన్ని కులాల, వర్గాలకు చెందిన విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయం ధృవీకరణ పత్రాలు వెంట తీసుకుని కాలేజీలకి రావాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం చదివే విద్యార్థినీలతో పాటు పక్క మండలాల వారూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE AT : KOTHAGUDEM
I.P. NO. 13/2023

Between :
Peddi Rambabu, R/o. Burgampadu ....Insolvent Petitioner
AND
1. Abudul Kaleem
2. Venugopal Reddy
3. V. Satheesh Babu
4. Sk. Mosen
5. Md. Azaruddin
6. P. Venkata Appa Rao
7. Sk. Zhaer
8. P. Sudhakar
....Respondents

Public Notice

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై ఉదహరించిన వాది ఇన్‌సాల్‌వెంట్ పిటీషనర్ (దివాలదారుడు) పై ఉదహరించిన ప్రతివాదులపై ఐ.పి.కేసు వేసియున్నారు. సదరు **కోర్టు వారు ఇట్టి కేసును ది. 11.09.2023 తేదీన మీ హాజరుకై వాయిదా వేసియున్నారు.** మీరు వ్యక్తిగతంగా గానీ లేక మీ న్యాయవాది గారి ద్వారా గాని పై **తారీఖున ఉ.గం. 10.30 ని॥లకు హాజరు కాగలరు.** లేని యెడల కోర్టు వారు మీకు పరోక్షంగా తీర్పు చెప్పెదరు.

//కోర్టు వారి అనుమతితో//

ముత్యాల రామచంద్రయ్య (కిషోర్)
డి. సంధ్య
వై. జగదీష్
కొత్తగూడెం న్యాయవాదులు,కొత్తగూడెం
ది.25.7.2023 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

यूनियन बैंक Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
అశ్వరావుపేట బ్రాంచ్,
అశ్వరావుపేట మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

స్వాధీనత ప్రకటన

రూల్ 8(1)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశ్వరావుపేట బ్రాంచ్ యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుకోవాల్సిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు నోటీసు అందిన తేది నుండి 60 రోజులలోగా సదరు నోటీసులో తెలిపిన మొత్తం రూ. 11,10,207/- (అక్షరాల పదకొండు లక్షల పది వేల రెండు వందల ఏడు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ తిరిగి చెల్లించవలసిందిగా ఋణగ్రహీత : శ్రీమతి దాసరి కన్యక, భర్త : శ్రీనివాసరావు, ఇ.నెం. 10-91, పొట్టి శ్రీరాములు స్ట్రీట్, అశ్వరావుపేట-507301, శ్రీ దాసరి శ్రీనివాస్, తండ్రి : గంగరాజు, ఇ.నెం. 10-91, పొట్టి శ్రీరాములు స్ట్రీట్, అశ్వరావుపేట-507301 (సహ ఋణగ్రహీత) మరియు శ్రీ మన్నెపల్లి విజయ్ బాబు, తండ్రి : ధర్మ నారాయణ రావు, ఇ.నెం. 11-82, ఆర్.సి.టి. బస్‌స్టాండ్ దగ్గర, అశ్వరావుపేట-507301 (హామీదారులు) లకు ది. 09-03-2023 తేది నాటి డిమాండ్ నోటీసు జారీ చేశారు.

సదరు పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత/సహ ఋణగ్రహీతతో పాటు హామీదారు కూడా విఫలమైనందున, ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా ! సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవాల్సిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు / ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ తెలిపిన ఆస్తులను దిగువ సంతకందారు ది. 25-07-2023 నాడు లాంఛనముగా స్వాధీనపరచుకున్నారు.

ముఖ్యంగా ఋణగ్రహీత/సహఋణగ్రహీత/హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా ! సదరు ఆస్తులతో ఎవరూ ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తులతో జరిపే ఎట్టి లావాదేవీలైన రూ. 11,10,207/- (అక్షరాల పదకొండు లక్షల పది వేల రెండు వందల ఏడు రూపాయలు మాత్రమే) మరియు దానిపై వడ్డీ మొత్తానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అశ్వరావుపేట బ్రాంచ్ యొక్క ఋణ సంబంధ తాకట్టుకు లోబడి ఉంటాయి.

స్థిరాస్థి యొక్క వివరములు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వరావుపేట గ్రామం & మండలం పరిధిలో సర్వే నెం. 1277, ఇ.నెం. 6-12/12, పొట్టి శ్రీరాములు స్ట్రీట్ దగ్గర, ప్లాట్ నెం. 27 & 28 పోర్షన్, విస్తీర్ణం 98.00 చ॥గ॥లు గల ఆర్.సి.సి. డబుల్ స్టోరీడ్ నివాసయోగ్యమైన ఇల్లు యావదాస్తికి హద్దులు : ఉత్తరం : కొణిజర్ల రవీంద్ర గారి స్థలం, తూర్పు : ఒంటిపల్లి లక్ష్మణరావు గారి స్థలం, దక్షిణం : చిట్లూరి వెంకటేశ్వరరావు గారి స్థలం, పడమర : గ్రామ పంచాయితీ రోడ్డు.

తేది : 25-07-2023
స్థలం : అశ్వరావుపేట
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

పాఠశాలలో వర్షం నీళ్లను తొలగించండి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-చంద్రుగొండ



చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ ఎత్తు పెంచాలని, డ్రైనేజీ నిర్మించి వర్షపు నీరు పోయే విధంగా చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు పెద్దినీ వేణు డిమాండ్ చేశారు. మంగళవారం కురుస్తున్న వర్షానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ నిలుచున్న వర్షపు నీళ్లను పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ ఈ పాఠశాలలో 450 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు అన్నారు. వర్షం వచ్చినప్పుడు విద్యార్థులు నరకయాతన పడుతున్నారని ఆయన అన్నారు. ఇలా నీరు నిల్వ ఉండటం వల్ల కొంతమంది విద్యార్థులు జ్వరాలు, దురదలతో పాఠశాలకు రావట్లేదని అన్నారు. ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు రాయి రాజా, విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రామడుగు వెంకట చారి, నాయకులు పోట్రు వీరభద్ర రావు, గ్రామస్తులు వెంకటేశ్వర్లు, జి.సత్యం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

"గూడెంలో కాక రేపుతున్న" హైకోర్టు తీర్పు



హైకోర్టు తీర్పుతో సంబరాలు జరుపుకుంటున్న జలగం వెంకట్రావు అనుచరులు

- తీర్పు పై సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాం : వనమా
- సంబరాల్లో మునిగి తేలుతున్న జలగం వర్గీయులు

నవతెలంగాణ-పాల్వంచ

వనమా వెంకటేశ్వరరావు పై మంగళవారం రాష్ట్ర హైకోర్టు అనర్హత రేటు వేస్తూ తీర్పు రావడంతో కొత్తగూడెం నియోజవర్గంలో రాజకీయం కాక రేపుతుంది. తీర్పు వెలువడిన నుంచి జలగం వెంకట్రావు వర్గీయులు నియోజకవర్గం వ్యాప్తంగా బాణసంచా కాల్చి కేకులు కట్ చేసి ప్రదర్శనలు, సంబరాలు జరుపుకుంటున్నారు.

ఎమ్మెల్యే సభ్యత్వంపై హైకోర్టు తీర్పును సుప్రీంకోర్ట్‌లో సవాలు చేస్తా : వనమా

హైకోర్టు తీర్పును గౌరవిస్తూ వనమా వెంకటేశ్వరరావు సుప్రీంకోర్టులో అపీల్ చేస్తామని ఎమ్మెల్యే వనమా ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గం ప్రజలు నన్ను గెలిపించాలని, కౌంటింగ్ సంబంధించిన అంశం కాదని, ఇది ప్రజా తీర్పు అని, టెక్నికల్ అంశం ఆధారంగా జలగం వెంకట్రావు కోర్టుకు వెళ్లి నాలుగు సంవత్సరాలుగా నియోజవర్గానికి దూరంగా ఉంటూ ప్రజల కష్టసుఖాలు పట్టించుకోకుండా ప్రజా ప్రతినిధిని ఇబ్బంది పెట్టడమేనని ఆరోపిస్తున్నారు. జన బలంతో మెజార్టీవోలతో గెలిచినవారు ఎమ్మెల్యే అవుతారని ప్రజాక్షేత్రంలో గెలవాలే తప్ప దొంగ కేసులతో ఓడిన దగ్గర్నుంచి ప్రజల కష్టసుఖాలు పట్టించుకోకుండా తిరిగే వారు ఎప్పటికీ ఎమ్మెల్యే కాలేరన్నారని జలగం వెంకట్రావు పై విర్చుకబడ్డారు. సాక్షాత్తు దేశ ప్రధాని విద్యార్హతపై ఎన్నికల అఫిడవిట్ తప్పులు దొరకగా, ఉందని అలాగే కేంద్ర మంత్రి శ్రుతి ఇరానీ, పలువురు కేంద్ర మంత్రులు కూడా ఎన్నికల అఫిడవిట్‌లో రకరకాల తప్పులు ఉంటాయని, ఇవన్నీ టెక్నికల్ అంశాలని కొట్టిపారేస్తున్నారు . నైతికంగా చూస్తే ప్రజాక్షేత్రంలో కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలు నన్ను గెలిపించాలని వనమా చెప్తున్నారు. ఇలా ఉండగా జలగం వెంకట్రావు వేసిన కేసు ద్వారా వెంకటేశ్వరరావు అనురాధ ప్రకటించడంతో వనమ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ నుండి పార్టీ మారిన ఎమ్మెల్యేలు కూడా సంచనంగా మారింది మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు అనర్హత వేటు కాక రేపుతుంది

హైకోర్టు తీర్పుతో జలగం అనుచరులు సంబరాలు

వనమా వెంకటేశ్వరరావు పై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన అనర్హత వేటు తీర్పు అవినీతిపై నీతి గెలుపని జలగం వెంకట్రావు అనుచరులు అన్నారు. వనమా వెంకటేశ్వరరావును అనర్హుడిగా ప్రకటిస్తూ జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా తీర్పు వచ్చిన నేపథ్యంలో పాల్వంచలో జలగం అనుచరులు సంబరాలు జరుపుకున్నారు. అంబేద్కర్ సెంటర్లో జై జలగం అంటూ భారీ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గానికి పట్టిన పీడ వదిలిందని ఇకనుంచి నో దందా అన్న తీరిగా ఉంటుందని, నియోజకవర్గ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అనుచరులు మంజూరు హలీ సైదులు, చందు నాయక్, బెల్లం భాస్కర్, హసీఫ్, అదిల్, కొల్లూరి రాము, శ్రీపాద సత్యనారాయణ, సూరిబాబు, మురళి, మౌలాలి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వనమా ఇంటి దగ్గర సమావేశమైన టీఆర్ఎస్ నాయకులు

ప్రజల మనిషి వనమా : కొత్వాల

ఎమ్మెల్యే వనమా ప్రజల మనిషిని జిల్లా కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. హైకోర్టులో వనమా పై అర్హత పిటిషన్ పై తీర్పు రావడంతో నియోజవర్గంలో ఉన్న కార్యకర్తలు, నాయకులు పాతపాలంచలోని వనమా స్వగృహానికి చేరుకున్నారు. హనుమాన్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ప్రజా క్షేత్రంలో గెలవాలి తప్ప ఇలాంటి దొంగ కేసులు వేసి గెలవడం గొప్పకాదు అన్నారు. నాలుగు సంవత్సరాలుగా నియోజవర్గాన్ని వదిలేసి వెళ్లిన వ్యక్తి ప్రజల బాధలు కష్టసుఖాలు పట్టించుకోని జలగం వెంకట్రావు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రాజు గౌడ్, కొత్త నియోజకవర్గంలో ఉన్న ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జంట ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరం

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని సున్నం బట్టిలో గల సున్నం బట్టి, పెద్దవాగు ప్రాజెక్టు బాలురు ఏహెచ్ఎస్ జంట ఆశ్రమ పాఠశాలల్లో అశ్వారావుపేట (వినాయకపురం) ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాందాస్ పర్యవేక్షణలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. తరుణ వ్యాధులతో బాధపడుతున్న 58 మంది విద్యార్థులను పరీక్షించి చిరు వ్యాధులుగా నిర్ధారించి చికిత్స అందించారు. జ్వరంతో బాధపడుతున్న ఒక్కరిని గుర్తించి సాదారణ జ్వరంకు చికిత్స అందించారు. విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం హాస్టల్ పరిసరాలు పరిశీలించి బ్లీచింగ్ చల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీరా, వెంకటేశ్వర్లు, హెచ్ఈఓ రాజు, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాస్, విజయ రెడ్డి, ప్రసాద్, ఏఎన్ఎం చెల్లమ్మలు పాల్గొన్నారు.



వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా వైద్య అధికారి జేవిఎల్ శిరీష

నవతెలంగాణ-అశ్వాపురం

వర్షాకాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ, ప్రజలకు అవగాహన కల్పించా లని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జేవిఎల్ శిరీష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు గ్రామాలలో నిర్వహించే మెడికల్ క్యాంపులను సద్వినియోగ పరచుకోవాలని, అనారోగ్య సమస్యలు వచ్చిన వెంటనే సమీపంలో ఉన్న ఆశ, ఆరోగ్య కార్యకర్తను సంప్రదించాలని తెలియజేశారు. అదేవిధంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ వేడిగా ఉన్న ఆహారము, శుభ్రమైన నీటిని మాత్రమే తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, సీసీ ఇమ్రాన్ పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసిన జెడ్పీటీసీ దంపతులు

నవతెలంగాణ-బూర్గంపాడు

పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంత రామును బూర్గంపాడు జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, రామ కొండా రెడ్డి దంపతులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలో ఉన్న పలు సమస్యలను వివరించారు. ప్రత్యేకంగా రోడ్లు, డ్రైన్లు ఇతర సమస్యలపై వారు వివరించారు. ఈ విషయంలో కమిషన్ సానుకూలంగా స్పందించారు.



కార్యాలయం ముందు ఆందోళన



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మంచినీటి సమస్య కౌన్సిలర్, మున్సిపల్ అధికారులకు పట్టదా..

- మంచినీళ్ల కోసం జోరు వానలో పాత కొత్తగూడెం నుండి నిరసన ర్యాలీ
- మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీ బిందెలతో నిరసన
- సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

పాత కొత్తగూడెం మంచినీటి సమస్య స్థానిక కౌన్సిలర్‌కి, మున్సిపల్ అధికారులకు పట్టదా...? అని సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ప్రశ్నించారు. మున్సిపల్ పరిధిలోని పాత కొత్తగూడెంలోని మూడు, నాలుగు వార్డులలో మంచినీటి సమస్య పరిష్కరించాలని జోరు వానలో ప్రజలు ఖాళీ బిందెలతో పాత కొత్తగూడెం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు మాట్లాడుతూ పాత కొత్తగూడెంలో గత కొన్ని సంవత్సరాలుగా మంచినీటి సమస్య ఉందని అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకువచ్చిన సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కేవలం కిన్నెరసాని పైపులైన్ ద్వారా మాత్రమే మంచినీటి సౌకర్యం ఉందని ఆ కిన్నెరసాని పంపు కూడా 15 రోజులకు ఒకసారి రావడంతో ప్రజలు నీళ్ల కోసం అనేక అవస్థలు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సైతం ప్రజలు నీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారని, ప్రజలు చాలాసార్లు స్థానిక ఏరియాలో ఖాళీ బిందెలతో తమకు నీళ్లు కావాలని నిరసన తెలియజేసినప్పటికీ, ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని ఆయన దుయ్యబట్టారు. ప్రతి ఇంటికి నల్లవేసి మంచినీటి సౌకర్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మంచినీటి సమస్య పరిష్కారం చేసేంతవరకు తాత్కాలికంగానైనా ట్యాంకర్ల ద్వారా మంచినీళ్లు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మికి వినతి పత్రం అందించారు. స్పందించిన చైర్పర్సన్ పాత కొత్తగూడెం మంచినీటి సమస్య కొరకు రూ.2లక్షలు మంజూరు చేశామని, వర్షాలు తగ్గిన తర్వాత మంచినీటి సమస్య పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో నిర్మించిన మినీ వాటర్ ట్యాంకులు మరమ్మత్తులు చేయడానికి ఇంజనీరింగ్ అధికారులను పంపించి పరిశీలన చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కమిటీ సభ్యులు సందకూరి లక్ష్మి, ఆవుల శ్రీరాములు, నాయకులు కొలిపాక వెంకటేశ్వర్లు, సాహెబీ, మున్నిలక్ష్మి, దుర్గా శ్రీనుపాల్గొన్నారు.

ఐటీడీఏ పీఓ ఆకస్మిక పర్యటన

అంగన్వాడీలు చిన్నారుల పట్ల అశ్రద్ధ వహించవద్దు : పీఓ

నవతెలంగాణ-చర్ల



నూతనంగా భద్రాచలం ఐటీడీఏ పీఓగా విధులు చేపట్టిన ప్రతిక్ జైన్ మంగళవారం చర్ల మండల పరిధిలోగల పెద్దమిస్సులేరు ఆశ్రమం పాఠశాల, చర్ల కేంద్రంగా గల వుజుపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో వాతావరణం మారినందున గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అందుకు సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు, వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పీఓ సూచించారు. మంగళవారం ఆయన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసి పాఠశాలలోని తరగతి గదులు, డైనింగ్ హాల్, డార్మెటరీ, పిల్లల లైబ్రరీ రూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు సమయానుకూలంగా మెనూ ప్రకారం భోజనము అందించాలని, పాఠశాలల్లోని టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. ప్రతి విషయాన్ని పై అధికారులకు తెలియజేయాలని అన్నారు. ఉన్జుపల్లి ఆశ్రమ పాఠశాలలో లైబ్రరీ నిర్వహణ తీరు సరిగా లేదని హెచ్ఎం పై మండిపడుతూ లైబ్రరీ కోసం ప్రత్యేక గదిని కేటాయించాలని, ప్రధానోపాధ్యాయులు సిబ్బంది అందరూ స్థానికంగా ఉండాలని అన్నారు. అనంతరం పిల్లల చేత బేసిక్స్ స్కిల్స్‌ను వారి చేత చదివించి, పిల్లలు బేసిక్స్ స్టిల్స్ పట్ల ఇంప్రూవ్ కావాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పిల్లలకు నేర్పించాలని అన్నారు. అనంతరం పెద్ద మెడిసిలేరు పాఠశాలలోని విద్యార్థినీల తరగతి గదులు పరిశీలించి వారితో కలిసి భోజనం చేసినానంతరం, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం చర్ల, కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించి, వర్షాకాలం సిజనల్ వ్యాధులు ప్రజలే అవకాశం ఉన్నందున డాక్టర్లు వైద్య సిబ్బంది స్థానికంగా ఉండి గిరిజనులకు ప్రత్యేక వైద్య చికిత్సలు చేయాలన్నారు. అనంతరం తెగడ అంగన్వాడి సెంటర్‌ను సందర్శించి అంగన్వాడి సెంటర్‌కు వచ్చే చిన్నారులకు న్యూట్రిషన్ ఫుడ్ సక్రమంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉంజుపల్లి హెచ్ఎం సాయన్న, పెద్ద మెడిసిలేనరు హెచ్ఎం చంద్రకళ, పిహెచ్సి డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహాసభలో జర్నలిస్టు అనిల్‌రెడ్డికి అరుదైన అవార్డు

నవతెలంగాణ-భద్రాచలం



అంతర్జాతీయ మహాసభలో జర్నలిస్టు అనిల్‌రెడ్డికి అరుదైన అవార్డు లభించింది. థర్డ్ వరల్డ్ కాంగ్రెస్ ఆన్ నేషనల్ ట్రెడిషనల్ మెడిసిన్ మహాసభలు హెూలీస్టిక్ మెడిసిన్ రిసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగాయి. ఈ మహాసభకు ప్రపంచ దేశాల నుండి 600 మంది సాంప్రదాయ వైద్యులు హాజరయ్యారు. హెచ్ఎంఆర్ఎఫ్ డైరెక్టర్ ఆఫ్ జనరల్ దీపక్ రౌత్, వరల్డ్ వైస్ చైర్మన్ డాక్టర్ షేక్ సుభాని, పిహెచ్‌సిసి ఫౌండర్, డైరెక్టర్ ఆఫ్ జనరల్ ప్రొఫెసర్ డాక్టర్ పిఎస్ సాగర్, ఆధ్వర్యంలో జరిగిన ఈ అంతర్జాతీయ సాంప్రదాయ వైద్య మహాసభలకు ముఖ్య అతిథులుగా ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్ అడ్జడికేటర్ డా.ప్రవీణ్ కుమార్, నేపాల్ దేశానికి చెందిన డాక్టర్ రామ్ ఆధార్ యాదవ్ (హెల్త్ మినిస్ట్రీ), అనంత్ బిరధర్ మినిస్ట్రీ ఆఫ్ ఆయుషి, సిబి లోహ్య టెక్నికల్ అడ్వైజర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంప్రదాయ వైద్యంతో ఎటువంటి జబ్బునైనా నయం చేయవచ్చునని, ఇప్పటికే ప్రపంచమంతా సాంప్రదాయ వైద్యం వైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

ఔషధ మొక్కల పెంపకం వాటి గుణాలు, రోగి జబ్బుల లక్షణాలు సాంప్రదాయ వైద్యంపై ప్రత్యేక కథనాలు అందించి, అనేకమంది రోగులకు అవగాహన కల్పించేలా చేసి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్రం నుండి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కర్ర అనిల్ రెడ్డిని నేపాల్ దేశానికి చెందిన డాక్టర్ రామ్ ఆధార్ యాదవ్ (హెల్త్ మినిస్ట్రీ) చేతుల మీదుగా కోవిడ్ పురస్కార్ అవార్డుతో ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ అనేక దేశాల నుండి వచ్చిన వందల మంది సాంప్రదాయ వైద్యుల మధ్య తెలంగాణ రాష్ట్రం నుండి నన్ను గుర్తించి సత్కరించడం చాలా గర్వంగా ఉందన్నారు.

ఈ అంతర్జాతీయ సాంప్రదాయ వైద్య మహాసభల్లో ఇండియా, యూకే, బంగ్లాదేశ్, నేపాల్. సింగపూర్. శ్రీలంక, పిలిపియన్స్, కెనడా, ఆస్ట్రేలియా, మలేషియా ఇండోనేషియా నుండి మహాసభలకు డెలిగేట్స్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మణుగూరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు ఐటీలలో రెండో విడత ప్రవేశాల కోసం ఈ నెల 31 లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ మణుగూరు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు ప్రభుత్వ ఐటీఐలోని ఎలక్ట్రిషన్‌లో 30, ఫిట్టర్‌లో 14, డ్రాఫ్ట్ మెన్ సివిల్ 20, డీజిల్ మెకానిక్ 45, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (కోప) 44, సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31లోగా సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలో దరఖాస్తులు ఆన్లైన్ చేసుకోవడానికి ప్రత్యేక సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. www.ititelanga. gov.in అనే వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఇటీవల సప్లమెంటరీలో పదవ తరగతి పాస్ అయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం 9440206990కు ఫోన్ చేయగలరని కోరారు.

ఘనంగా (హెచ్-142) యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-పాల్వంచ



తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (హెచ్-142) బలోపేతానికి కృషి చేయాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.రామారావు అన్నారు. సంఘ 11వ వార్షికోత్సవాన్ని మంగళవారం కేటీపీయస్ సంఘ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేటీపీయస్ ఏ కాలనీలోని ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విద్యుత్ ఉద్యోగ సంఘాల నుండి 25 మంది సంఘంలోకి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసచారీ, సత్యారాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యద్, శివరాం, సుమన్, కోటేశ్వరరావు, అనిల్ కుమార్, చిన్న శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎంఎస్ రాష్ట్ర కోశాధికారి దేశెట్టి మృతి

ఇల్లందు : అఖిల భారత రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కోశాధికారి, ఎన్డీ మహబూబాబాద్ జిల్లా సీనియర్ నాయకులు దేశెట్టి కా.రామచంద్రయ్య మంగళవారం మధ్యాహ్నం ఆయన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా రెడ్యాలలో మరణించారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. రామచంద్రయ్యకు విప్లవ జోహార్లు తెలియజేస్తున్నట్లు ఎన్డీ జిల్లా నాయకులు జే.సీతారామయ్య, ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యదల్లపల్లి సత్యం, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు మోకాళ్ల రమేష్, పిఓడబ్ల్యు రాష్ట్ర నాయకురాలు బయ్య శారద, ఐఎఫ్టీయు జిల్లా కార్యదర్శి రాసుద్దిన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీ నేత వనమా పై కుట్రలు



పాల్వంచ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏకైక బీసీ ఎమ్మెల్యే వనమాపై కుట్రలు చేసి ఎమ్మెల్యే పదవికి దూరం చేసే వ్యక్తులను బీసీ సంఘాలు తీవ్రంగా ఖండించారు. కోర్టు తీర్పు రావడంతో ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డిమల్ల వెంకటేశ్వరరావు, బత్తుల మధుచంద్, జాతీయ బీసీ సంఘం జిల్లా యువజన అధ్యక్షులు పరమేష్ యాదవ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు బరపటి ప్రసాద్, పెరిక సంఘం జిల్లా అధ్యక్షులు ముదురుకోళ్ల కిషోర్, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి ఖమ్మం జిల్లా కాపు సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో గెలిచిన బీసీ నేత వనమా వెంకటేశ్వరరావు పై ఈ విధమైనటు వంటి అసత్య ఆరోపణలు చేసి, ఫిర్యాదు చేయటం పట్ల ముక్తకంఠంతో ఖండించారు. న్యాయస్థానం పై న్యాయవ్యవస్థ పై నమ్మకం ఉన్న వనమా న్యాయస్థానం ద్వారా సరైన తీర్పుతో మరల ప్రజాక్షేత్రంలోకి ప్రజలకు సేవ చేసేందుకు వస్తారని అన్నారు.

విలేజ్ బస్సు ఆఫీసరుగా బత్తుల

చంద్రుగొండ : టీఎస్ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, ఎండి వి.సి.సజ్జనార్‌ను కలసి ఆర్టీసీ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని విలేజ్ బస్ ఆఫీసర్ వ్యవస్థను తీసుకొచ్చారు. దీనిలో భాగంగా కొత్తగూడెం డిపో నుంచి చంద్రుగొండ, ఇమ్మడి రామయ్య బంజర, అయ్యన్నపాలెం గ్రామాలకు విలేజ్ ఆఫీసర్గా బత్తుల నాగేశ్వరరావును నియమించారు. చంద్రుగొండ పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా కోరారు. మొబైల్ నెంబర్ 9951946697 సంప్రదించాలని కోరారు.



24 గంటల వైద్యం అందుబాటులో ఉండాలి

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్

నవతెలంగాణ-సుజాతనగర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు 24 గంటలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట బీఎస్పీ శ్రేణులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చుట్టుపక్కల ఉన్న 15 గ్రామాలకు సరైన వైద్యం అందాలంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలని సూచించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రిని నిర్మిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా ప్రతి నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రిని, ప్రతి జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను తీసుకువస్తామని హామీ ఇచ్చారని, మరల ఎలక్షన్లు వచ్చినా హామీ అమలు కాలేదని అన్నారు. 15 రోజుల్లో 24 గంటల వైద్యం అందుబాటులో లేని పక్షంలో బీఎస్పీ పార్టీ తరఫున ఆమరణ నిరాహార దీక్ష చేసేందుకు సైతం తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సలహాదారు గంధం మల్లికార్జున్ రావు, జిల్లా కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, కాకటి బాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన గూడెం టీటీ క్రీడాకారులు



కొత్తగూడెం : కరీంనగర్‌లో జీఎస్ టేబుల్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఉత్తర తెలంగాణ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించిన కొత్తగూడెం క్రీడా కారులు సత్తా చాటారు. ఈ పోటీలలో ఉత్తర తెలంగాణాలోని వివిధ జిల్లాల నుండి సుమారు 350 మంది ఆయా విభాగాల్లో పోటీ పడ్డారు. సుమారు 70 మంది క్రీడా కారులు పురుషుల సింగిల్స్ విభాగంలో పోటీ పడగా కొత్తగూడెంకు చెందిన లోకేష్ చక్కటి ప్రతిభను కనబరిచి ప్రథమ స్థానం సాధించగా, పురుషుల డబుల్స్ విభాగంలో కొత్తగూడెంకు చెందిన జాతీయ వెటరన్ క్రీడాకారుడు రీయాజ్‌షేక్, లోకేష్‌ల జంట ద్వితీయ స్థానం సాధించి నగదుతో పాటు, ట్రోఫీలను సాధించారు. పోటీలో పాల్గొని విజేతలుగా నిలిచిన క్రీడా కారులను పలువురు అభినందించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలుగా నిలవడం పట్ల సీనియర్ క్రీడాకారులు బట్టు ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్, థామస్, వెంకటరమణ, విశ్వకిరణ్, బన్ను, ఇమ్మానియెల్, ఆంతోని పాల్, రియాజ్, జూనియర్, షామంత్, చందు, అఫ్జల్ బేగం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జయప్రదం చేయాలి

పినపాక : ఆగష్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మడివి రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జానంపేట గ్రామంలో కబ్బాకు రమేష్ అధ్యక్షతన మండల తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షులు దుబ్బ గోవర్ధన్ మాట్లాడారు. ఈ సమావేశంలో మడివి రమేష్, రాము, నూప వాసు, మోడియం రాజు, కారం మునెమ్మ, బడిశా నర్సయ్య, మడివి జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

- బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వరప్రసాద్

నవతెలంగాణ-చర్ల



కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక నిర్ణయం వీఆర్ఏల క్రమబద్ధీకరణ అని, వందల ఏళ్లగా సాదాసీదా జీతంతో నెట్టుకువస్తున్న వీఆర్ఏలను క్రమబద్ధీకరించడం ద్వారా గొప్ప సాహసోపేత మానవతా నిర్ణయమని, అందుకుగాను బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఋణపడి ఉంటామని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు తోటమల్ల వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు.

బీజేపీ పాలనలో ఆడవాళ్లకు రక్షణ కరువైంది

- దిశ జిల్లా అధ్యక్షురాలు మద్దెల అన్నపూర్ణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మణిపూర్‌లో గిరిజన మహిళలకు జరిగిన అన్యాయానికి నిరసనగా దిశ మహిళా టీం ఆధ్వర్యంలో భద్రాచలం బ్రిడ్జి చెక్ పోస్ట్ నుంచి వానను సైతం లెక్కచేయకుండా అంబేద్కర్ సెంటర్ వరకు నిరసన తెలుపుతూ ర్యాలీ చేసారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు మద్దెల అన్నపూర్ణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వంలో మహిళలపై రోజురోజుకు దాడులు ఎక్కువ అవుతున్నాయని మణిపూర్‌లో గిరిజన తెగకు చెందిన మహిళలను అర్ధ నగ్నంగా ఊరేగించి ఆపై లైంగికదాడి జరిపి అత్యంత పాషవికంగా హత్య చేసిన నేరస్తులను ఇప్పటివరకు ఏమి చేయకపోవడంపై బీజేపీ ప్రభుత్వం మతోన్మాద చర్య కనిపిస్తుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపూర్ నింతులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం నాయకులు లక్ష్మి కుసుమ, సుజాత తదితర దిశ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని తక్షణం బర్తరఫ్ చేయాలి

- సీపీఐ(ఎం), సీపీఐ జిల్లా కార్యదర్శులు కనకయ్య, సాబీర్ పాషాలు
- జోరు వానలో మణిపూర్ బాధితులకు అండగా నిరసన

నవతెలంగాణ-కొత్తగూడెం





మణిపూర్ రాష్ట్రంలో గత రెండు నెలల కాలంగా సాగుతున్న మారణకాండ, స్త్రీలపై అఘాయిత్యాలు, గృహ దహనాలు ఆపాలని ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పాలని, బాధితులకు అండగా నిలవాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల రాష్ట్ర కమిటీల పిలుపులో భాగంగా మంగళవారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ఉభయ పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జోరు వర్షంలో సైతం తడుస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శులు అన్నవరపు కనకయ్య, ఎస్‌కె. సాబీర్ పాషాలు మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునే విధంగా మణిపూర్‌లో కాళికేయుల దుర్మార్గాల తీరులో మహిళలపై అమాయక ప్రజలపై దాడులు చేస్తూ.. గృహ దాహనాలు పాల్పడుతూ, మహిళలను చిత్ర హింసలు పెడుతూ, వివస్త్రలను చేసి చేసి గ్యాంగ్ రేప్లు చేసి చంపి వేయడం జరిగిందని, అంతేకాకుండా ఇప్పటి వరకు 150 మందిని పొట్టన పెట్టుకున్నారని వారు ఆవేదన వెలుబుచ్చారు. మణిపూర్‌లో మెజార్టీగా ఉన్న మైతీ తెగకు, కుకి, నాగా తెగలకు మధ్య అక్కడ బిజెపి ప్రభుత్వం రిజర్వేషన్ల పేరుతో చిచ్చురేపిందని విమర్శించారు. మెజార్టీగా ఉన్న మైతి తెగ వారికి బీజేపీ సపోర్ట్ చేస్తూ ఓట్లు సీట్లు అధికారం కోసం ఇంతటి దారుణ అకృత్యాలకు దిగటం సిగ్గుమాలిన చర్యని తీవ్రంగా దుయబట్టారు. తక్షణం దేశ ప్రధాని నోరు విప్పాలని పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపి బాధితులకు అండగా నిలవాలని మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాన్ని తక్షణమే బర్తరఫ్ చేయాలని, ముఖ్యమంత్రి బీరేంద్ర సింగ్‌ను డిస్మిస్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వై.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సమితి సభ్యులు కంచర్ల జములయ్య, మహిళా సమైక్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.రత్న కుమారి, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, ఐద్వా నాయకురాలు సందకూరి లక్ష్మి, కూరపాటి సమ్మయ్య, బిక్కులాలు, సీపీఐ, సీపీఐ(ఎం) నాయకులు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, విజయలక్ష్మి, షాహిన్, షమీమా అబ్బులు, కిలారు ప్రసాదు, నవీన్, భద్రం, రమేష్, పాషా తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం), సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

భద్రాచలం : మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి తెగలపై జరుగుతున్న అమానవీయమైన దాడులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, బీజేపీ-ఆర్ఎస్ఎస్ అండతోనే ఈ దాడులు జరుగుతున్నాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజ్ సునీల్ కుమార్‌లు అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మణిపూర్‌లో జరుగుతున్న మారణ హోమానికి నిరసనగా సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ఆదివాసీ తెగలకు చెందిన మహిళలపై జరుగుతున్న దాడులను, హింసను అరికట్టి భారతదేశ ఔన్నత్యాన్ని కాపాడాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని తక్షణమే మణి పూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రేణుక, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బి.వెంకటరెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, ఎన్. లీలావతి, పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, సీపీఐ పట్టణ నాయకులు మా రెడ్డి శివాజీ, విశ్వనాథం, మా రెడ్డి గణేష్, పట్టణ నాయకులు డి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : బూర్గంపాడు మండల కేంద్రంలో అంబేద్కర్ సెంటర్‌లో సీపీఐ(ఎం), సీపీఐ, రాష్ట్ర పార్టీల పిలుపులో భాగంగా మంగళవారం మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అరాచకత్వానికి, హత్యలకు నిరసనగా మహిళలను నగ్నంగా ఊరేగించిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి మువ్వా వెంకటేశ్వరావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు శ్రీనివాస రావు, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, తిరపతయ్య, కంత్రి ప్రతాప్, యాకోబ్ పాష, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరిగిన సంఘటకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బాధ్యత వహించి తక్షణం రాజీనామా చేయాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యార్లగడ్డ భాస్కరరావు, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఆ రాష్ట్ర సీఎం, ప్రధాన మంత్రి మోడీ మోడీ తక్షణం రాజీనామా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు తంగేళ్ల ముడీ శివకృష్ణ, సహాయ కార్యదర్శి సుంకుపాక ధర్మ, నక్క నాగమణి, రాధిక, మహిళా సమితి నాయకురాలు శాంతి, కృష్ణవేణి, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు : మణిపూర్ బాధితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జంగం మోహన్రావు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మీకుమారి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు ఆర్.లక్ష్మీనారాయణ, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఎస్‌కే సర్వర్, ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి.వీరస్వామి, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్.వి.నాయుడు, కార్యవర్గ సభ్యులు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా మణిపూర్ మారణ హోమం పై సంఘీభావంగా సోమవారం స్థానిక మండల సమితి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక మూడు రోడ్ల కూడలిలో గల సయ్యద్ మియా జానీ భవన్ నుంచి బస్టాండ్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా ఎండీఓ పూర్వ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామకృష్ణ, మండల సహాయ కార్యదర్శి సయ్యద్ రఫీ, మహిళా నాయకురాలు సత్యవతి, షేక్ రిజ్వానా, షేక్ షమ్మీ కుమారి, ఏఐటీయూసీ లారీ యూనియన్ నాయకులు రహంతుల్లా, షేక్ నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

పినపాక : స్వాతంత్రం వచ్చి 75 ఏండ్లు పూర్తయినా కూడా నేటికీ మహిళలపై ఇలాంటి అగత్యాలు జరగడం చాలా సిగ్గుచేటని నియోజకవర్గ టీపీసీసీ సభ్యుడు డా.చందా సంతోష్ మండిపడ్డారు. పినపాక మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకురాలు నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో

మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన దారుణ సంఘటన పైన తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘ నాయకులు మండిపడ్డారు. మండల పరిధిలోని జానంపేట గ్రామంలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మడుగు రమేష్ మాట్లాడారు. బుధవారం నుండి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లుగా తెలియజేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షులు దుబ్బా గోవర్ధన్, కబ్బాకు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : మణిపూర్లో జరుగుతున్న అల్లర్లు, మహిళలపై సామూహిక అత్యాచారాలు, హత్యలు, నగ్న ప్రదర్శనలు, వందలాది మంది పౌరుల హత్యలు, గృహ దహనాలు తదితర హింసాత్మక సంఘటనలనకు మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్, ప్రధాని మోడీ ప్రభుత్వాలే బాధ్యత వహించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరు మధు, సీపీఐ జిల్లా నాయకులు కే.సారయ్య, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఎస్.ఏ నబి, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ అన్నారు. మంగళవారం ఇల్లందు జగదాంబ సెంటర్లో వామ పక్ష పార్టీల ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

ఈ మానవహారంలో తుపాకుల నాగేశ్వరరావు, మన్యం మోహన్ రావు, కూకట్ల శంకర్, దారవత్ రాందాస్, మహమూద్, లక్ష్మన్ పాసి శ్రీను రాము, హుస్సేన్, గాంధీ, నాగేశ్వరరావు, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, ఎట్టి నరసింహారావు, దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, నాయిని రాజు, బోసు, యాకూబ్ షావలి, భాస్కర్, పృధ్వి, రామిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ : మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి అన్నారు. మణిపూర్ ఘటనను నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సమితి పిలుపులో భాగంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి దొడ్డ రవి, సీపీఐ నాయకులు రాహుల్, గుండాల నాగరాజు, విశ్వేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, లింగస్వామి, సీపీఐ(ఎం) నాయకులు రహీం, తులసీరామ్, రాములులి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : మణిపూర్ ఘటనను నిరశిస్తూ రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సీపీఐ(ఎం), సీపీఐ పార్టీల ఆధ్వర్యంలో కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాల దిష్టి బొమ్మను దహనం చేశారు. లక్ష్మీనగరం స్టేట్ బ్యాంకు ఎదురుగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా సీపీఐ(ఎం) డివిజన్ కో కన్వీనర్ కారం పుల్లయ్య, సీపీఐ నాయకులు నోముల రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొర్సా చిలకమ్మ, మర్మం చంద్రయ్య, యలమంచి శ్రీనుబాబు, మహమద్ బేగ్, గుడ్ల రాంబాబు, తోకల నరేష్, తుర్స అర్జున్, కాక బాలరాజు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి తాటిపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవమారణ హోమాన్ని తలపిస్తున్న మణిపూర్ ఘటన: మణిపూర్ ఘటన మారణహోమాన్ని తలపిస్తున్నాయని బీఆర్ఎస్, టిడిపి, ఏఎస్పి నాయకులు ఘటనను తీవ్రంగా ఖండించారు. తహశీల్దార్ కార్యలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించాలని తహశీల్దార్ కార్యలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మీ, జెడ్పీటీసి తెల్లం సీతమ్మ టిడిపి మండల అధ్యక్షులు కొమరం దామోదర్‌రావు, ఏఎస్‌పి నాయకులు సోంది మల్లూరు తదితరులు పాల్గొన్నారు.

మండల పాస్టర్లు, సంఘం అసోసియేషన్ ఆధ్వర్యంలో

మణిపూర్ ఘటనను నిరశిస్తూ మండల ఫాస్టర్స్, సంఘం అసోసియేషన్ విశ్వాసుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ములకపాడు సెంటర్ నుండి లక్ష్మీనగరం స్టేట్ బ్యాంకు వరకు సుమారు 200 వందల మంది శాంతి ర్యాలీ నిర్వహించారు. శాంతి ర్యాలీకి మద్దతుగా సీపీఐ(ఎం) నాయకులు యలమంచి శ్రీనివాసరావు(శ్రీనుబాబు) మర్మం చంద్రయ్య, సిపిఐ నాయకులు నోముల రామిరెడ్డి, తాటిపూడి రమేష్‌లు పాల్గొనగా ఈ కార్యక్రమంలో ఫాస్టర్ల సంఘం మండల అద్యక్షులు ఉబ్బా యోహాన్, ఉపాద్యక్షులు వెన్న దానియేలు, కార్యదర్శి బర్ల సురేష్, మడివి క్రీస్తుదాసు, సోంది యేసేబు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల పాటు జిల్లాకు భారీ వర్షాలు

- యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ



మూడు రోజుల పాటు జిల్లాకు భారీ వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ సూచన మేరకు ప్రజలు, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. ఈ మూడు రోజుల పాటు వాతావరణ శాఖ మోడల్ ఆరెంజ్ అలర్ట్ హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. గ్రామ, మండలం అలాగే జిల్లా స్థాయి అధికారులు కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలు పొంగి పొర్లుతున్న వాగులు దాటొద్దని చెప్పారు. పొంగే వాగులపై రవాణా సేవలు నిలిపివేయాలని చెప్పారు. నిండు కుండల ఉన్న జలాశయాలను వీక్షించడానికి అవకాశం లేకుండా నియంత్రణ చేయాలన్నారు. రహదారుల పైకి నీరు చేరిన ప్రాంతాల్లో రవాణా సేవలు నిలిపి వేయాలని ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. రహదారులపై పడిన చెట్లు తక్షణమే తొలగించాలని ప్రజా రవాణాను పునరుద్ధరించాలని చెప్పారు. ఎడతెరిపి లేకుండా వర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న ఇళ్ళు కూలిపోయే ప్రమాదం ఉందని అలాంటి వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు. విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని విద్యుత్ అధికారులను చెప్పారు. అత్యవసర సేవలకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08744-241950 కంట్రోల్ రూముకు కానీ, వాట్సప్ నంబర్ 9392919743కు మెసేజ్ కానీ వీడియో కానీ చేయాలని చెప్పారు. కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో 9392919750, భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో 08743-232444, వాట్సప్ నంబర్ 7981219425లకు మెసేజి లేదా వీడియో పంపాలని చెప్పారు. 24 గంటలు పని చేయు విధంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములకు ఫోన్ చేయాలని ప్రజలకు సూచించారు. అత్యవసర సేవలకు ఎన్‌డీఆర్ఎఫ్ సేవలు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- సంఘర్షణ సైకిల్ యాత్రను ప్రారంభించిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు

నవతెలంగాణ-చర్ల



రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, చర్ల మండలం కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని సంక్షేమ హాస్టల్స్, పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్, గురుకులు కేజీబీవీలులో నెలకొన్న సమస్యలను తెలుసుకోవడం కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంఘర్షణ సైకిల్ యాత్రను శుక్రవారం చర్ల మండలంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నందు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్లో, ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ధరలకు అనుకూలంగా మెనూ ఛార్జ్ పెంచాలని అలాగే జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను, ఎంఈఓ డిఈఓ, డిప్యూటీ డీఈఓ, పోస్టులను భర్తీ చేయాలని, ప్రతి సంవత్సరం విద్యార్థులకు నాలుగు జతల దుస్తులను అందించాలని, పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పూర్తిస్థాయిలో అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అద్దె భవనాలు నడుస్తున్న గురుకులు, సంక్షేమ హాస్టల్స్, సొంత భవనాలు నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, భద్రాచలం కేంద్రం గా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, కొత్తగూడెం జిల్లాలో మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, మండల కమిటీ, ప్రజాసంఘాల నాయకులు, సభ్యులు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు



ప్రాథమిక పాఠశాలల పనివేళలల మార్పు ఉత్తర్వులు ఉపసంహరించాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పనివేళలను ఉదయం 9 గంటలకు బదులు 9.30 గంటలకు ప్రారంభించటం అశాస్త్రీయమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అభిప్రాయ పడుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.కిషోర్ సింగ్, ప్రధాన కార్యదర్శి ఎస్.కృష్ణ స్పష్టం చేశారు. మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల పని వేళలు మార్చాలంటే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులు తదితర భాగస్వాముల (స్టేక్ హెూల్డర్స్) అభిప్రాయాలను సేకరించి నిర్ణయించాల్సి ఉందన్నారు.

బిక్షాటనతో జీపీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-అశ్వారావుపేట



జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె బుధవారం నాటికి 20వ రోజుకు చేరింది. ఈ క్రమంలో స్థానిక పంచాయతీ కార్మికులు ప్రదర్శన నిర్వహించి, వానను సైతం లెక్కచేయకుండా ప్రధాన రహదారి మార్గంలో జోలె పట్టి బిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేసారు. ఈ సమ్మెకు సీపీఐ జిల్లా నాయకులు సయ్యద్ సలీం, మండల అధ్యక్ష కార్యదర్శులు జి.రామకృష్ణ, సయ్యద్ రఫీ పాల్గొని సంఘీభావం తెలియజేశారు. అనంతరం సయ్యద్ సలీం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, జేఏసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు యాదగిరి వెంకటప్పయ్య, కేసుపాక నరసింహారావు, గౌరవాధ్యక్షులు కామేశ్వరరావు, మూల అప్పన్న, మండల ట్రెజరర్ ముత్తారావు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ళపల్లి : జీపీ కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించేలా ఉత్తర్వులు జారీ చేయాలని వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీపీ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా ఆళ్ళపల్లి గ్రామ పంచాయతీ నుండి బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ షేక్ రహీమ్, స్థానిక కార్మికుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరమ ప్రభుదాస్, మల్కపురి శేఖర్, కీసరి కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : జీపీ కార్మికుల 20వ రోజు సమ్మెలో భాగంగా సీపీఐ అనుబంధ మహిళా సమైక్య నాయకురాలు తుపాకుల శాంతి, సీపీఐ(ఎం) ప్రజాసంఘాల నాయకులు దొడ్డ లక్ష్మీనారాయణ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ 20 రోజులుగా సమ్మె చేస్తుంటే ఈ ప్రభుత్వం కనీస కనికరం లేదని, పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారానికి మా వంతు కృషి చేస్తామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో గాజుబోయిన కృష్ణవేణి, నక్క నాగమణి, జాన్ బీ, సత్యవతి, రాధిక, 31 గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : బూర్గంపాడు మండలం సారపాక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు జోరు వర్షంలో పోటీ కార్మికులను మంగళ వారం అడ్డుకున్నారు. గ్రామపంచాయతీ కార్మికులు 20రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో సారపాక పంచాయతీ కార్యదర్శి మహేష్ పోటీ కార్మికులను తీసుకొచ్చి రోజుకు రూ.వెయ్యి, భోజనాలు చార్జీలు ఇచ్చి పని చేయించటానికి ప్రయత్నం చేస్తున్నారని సమాచారంతో సమ్మె చేస్తున్న కార్మికులు పోటీ కార్మికులను అడ్డుకున్నారు. పంచాయతీ కార్మికులకు అండగా సీపీఐ(ఎం) మండల కమిటీ అండగా ఉంటుందని మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ యాకోబు, సతీష్, రాజు, ఏడుకొండలు, పద్మ రాధా, సునీత, నాగమణి, సరూప, సువాలి, పొన్నం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : జీపీ కార్మికులు ఎండీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న శిబిరానికి న్యూడెమోక్రసీ నాయకులు హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను నివారించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ తొగర సామెల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, నాయకులు సువర్ణపాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





సాహిత్యమే నాతోడై నిలిచింది

బయటి ప్రపంచం ఎలా ఉంటుందో తెలియకుండా పెరిగిన ఓ సాధారణ అమ్మాయి. అలాంటిది కవిత్వం, కథ, నవల, వ్యాసం, అనువాదం, సమీక్ష, విమర్శనా వ్యాసాలు ఇలా ఒక్కటి కాదు దాదాపుగా తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియలన్నిటిలో ఆమెకు ప్రవేశం ఉంది. 800 గ్రంథాలకు సమీక్షలు చేశారు. 12 గ్రంథాలు తెలుగు నుండి ఆంగ్లంలోకి అనువదించారు. పది కవితా సంపుటాలు, మూడు కథా సంపుటాలు, మూడు నవలలు రాశారు. ఆమే ప్రముఖ రచయిత్రి **శైలజా మిత్ర**. సాహిత్యానికి తాను చేసిన సేవకు గుర్తుగా తెలుగు యూనివర్సిటీ నుండి కీర్తి పురస్కారం సైతం అందుకున్న ఆమె పరిచయం ఆమె మాటల్లోనే...

చిత్తూరు జిల్లాలోని, చిన్నగొట్టిగల్లు గ్రామంలో పుట్టాను. మాది మధ్యతరగతి కుటుంబం. అమ్మ తెలికిచెర్ల అనసూయాదేవి, గృహిణి. మా నాన్న తెలికిచెర్ల శేషగిరిరావు (రిటైర్డ్ మండల్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్). వీరికి మేము ఆరుగురు సంతానం. నాకు ముగ్గురు అన్నయ్యలు, ఒక అక్క, ఒక చెల్లి. నేను ఐదవదాన్ని. మేము ఏం తిన్నామో ఏమో గుర్తులేదు కానీ క్రమశిక్షణ నరనరాన ప్రవహించేలా ఉండేది మా ఇంటి వాతావరణం. ఏది జరిగినా టైమ్ ప్రకారం జరగాలనేదే మా నాన్న ఆశయం. ఒక్క మాట బయటకి వినిపించకూడదు. శబ్దం వచ్చేలా నవ్వకూడదు. అలా కాదని ఏమి జరిగినా కఠిన శిక్షలు అమలు చేసేవారు. చదువు తప్ప మరో మాట వినిపించేది కాదు. ఎన్ని మార్కులు? అనేదే కొలమానం. అలాంటి ఇంట్లో పెరిగిన నేను. స్కూల్లో పాడటం తప్ప మాట్లాడటమే తెలియదు. ఇలా స్వతంత్ర భావమంటే ఏంటో తెలియని వాతావరణంలో పెరిగాను. ఇంత చేసినా నాకు అమ్మకన్నా నాన్నంటే ఎంతో ఇష్టం, గౌరవం. ఉన్నతంగా జీవించడం అంటే డబ్బు సంపాదించడం కాదు. ఔన్నత్యంతో జీవించడం అని చెప్పే నాన్న మాటలు నన్ను ఎప్పుడూ వెంటాడుతుండేవి. జీవితమంటేనే తెలియని ఆ రోజులు తలుచుకుంటుంటే సంతోషంగా ఉంటుంది అంటే అవే బావున్నాయి కదానిపిస్తుంటుంది.

గాత్రం మూగబోవడంతో...

చిన్నతనం నుండీ కర్నాటక సంగీతమంటే ప్రాణం. స్కూలు, కాలేజీ రోజుల్లో ప్రతి కార్యక్రమంలో పాల్గొనేదాన్ని. పాటలే నా ప్రపంచంగా బతికేదాన్ని. డిగ్రీ వరకు పూర్తి చేశారు. పెండ్లి తర్వాత 1987లో హైదరాబాద్‌లో అడుగు పెట్టాను. తర్వాత దాదాపు పదేండ్ల పాటు పిల్లలు, వారి సంరక్షణ, కుటుంబ బాధ్యతలతో సాహిత్యం, సంగీతం అనే మాటలు మరచిపోయాను. కొన్ని అనారోగ్య కారణాల వల్ల నా గాత్రం మూగపోవడంతో పాడలేకపోయా. దాంతో చాలా కుంగిపోయా. అయితే నేను అప్పటి వరకు పాడిన పాటలు చాలా వరకు నేను రాసినవే కావడంతో నాలో సాహిత్యం కూడా ఉందని గుర్తించి కొందరు పెద్దలు ప్రోత్సహించారు. అపుడప్పుడూ కవితలు రాస్తూ ఆంధ్రభూమికి పంపుతుండేదాన్ని. డిగ్రీ పూర్తి చేసినా సరైన ఉద్యోగం కూడా చేయలేకపోయాను.



సాహిత్యానికీ ఓ ప్రపంచం

1996లో మా నాన్న చనిపోయారు. అప్పుడు అమ్మ నాతోనే ఉంది. అమ్మను పరామర్శించడానికి వచ్చిన ఒక దూరపు బంధువు డా॥ పోతుకూచి సాంబశివరావు మా ఇంటికి వచ్చారు. మాటల సందర్భంలో అమ్మ నా కవితల గురించి చెప్పింది. వాటిని చూసి 'నీకు సాహిత్యంలో మంచి భవిష్యత్ ఉంది' అని ప్రోత్సహించి వారి సభలకు ఆహ్వానించేవారు. సాహిత్యానికి కూడా ఒక ప్రపంచం ఉందని అప్పుడే నాకు అర్థమయింది. అప్పటి నుండి ఆ సభల్లో చాలా యాక్టివ్‌గా పని చేయడం మొదలుపెట్టాను. అలాగే నా రచనలు కూడా పెరిగాయి.

పెండ్లి తర్వాత స్వేచ్ఛ దొరికింది

పెండ్లి తర్వాత ఓ కొత్త వాతావరణం దొరికింది. అక్కడ ఎంత మాట్లాడినా ఏమీ అనరు. ఎంత నవ్వినా ఎందుకని ప్రశ్నించరని తెలిసి నా ఆనందానికి అవధుల్లేవు. అయితే ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? అనే విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కున్నా. అదొక వింత అనుభూతి. అయితే స్వేచ్ఛ దొరికింది. మా అత్తయ్య సుశీలమ్మ అమ్మను మించి చూసుకునేవారు. ఆడపడుచులు స్నేహితుల్లా కలిసిపోయారు. కుటుంబంలో ఆర్థిక సమస్యలున్నా నన్ను ఒక్క మాట అనేవారు కాదు. నా భర్త స్నేహితుడిలా నా మాటకు విలువిచ్చేవారు. ఎదిగిన తర్వాత నా పిల్లలు కూడా నాకెంతో సహకరించారు. కొన్ని ఇబ్బందులు వచ్చినా సంతోషంగానే జీవించాను. పెండ్లి తర్వాతే ఎంఏ తెలుగు, రచన జర్నలిజం కాలేజీలో పిజిడిసిజె చదువుకున్నాను.

సాహితీ పెద్దల ప్రోత్సాహం

1997లో నా తొలి కవితా సంపుటి 'శంఖారావం' ప్రచురించాను. అది డా॥సి.నారాయణరెడ్డి ఆవిష్కరించడంతో నా జీవితంలో సాహితీ దీపం వెలిగింది. 'నీ కవిత్వంలో జీవం ఉంది. నువ్వు నిలబడ గలవు. అయితే కవిత్వానికి కృషి అక్కర్లేదు. వాస్తవం ఉంటే చాలు. కష్టపడి రాసేది కవిత్వం కాదు. ఇష్టపడి రాస్తేనే అది కవిత్వం అవుతుంది' అని అప్పుడు ఆయన అన్న మాటలు నాకంతగా అర్థం కాలేదు. గుంటూరు శేషేంద్ర శర్మకు నా రచన పంపాను. వారు పంపిన కార్డులో 'నీ కవిత్వం పరిమళ భరిత కాంతి బింబం, కొనసాగించు ఆశీస్సులతో' అని పంపారు. ఇలా సాహితీ పెద్దల ప్రోత్సాహంతో నాపై నాకు నమ్మకం వచ్చింది. బయటి ప్రపంచంలోకి వెళ్ళే కొద్ది చాలా విషయాలు తెలుసుకున్నాను. సాహితీ ప్రపంచంలో మనల్ని మనం కాపాడుకోవడం కూడా చాలా అవసరమని గుర్తించాను. అప్పటి నుండి ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయడానికే ప్రయత్నించాను.

నవలలు ధారావాహికలుగా

నేను ఇష్టంగా రచించిన కవితా సంపుటి 'అంతర్మథనవేళ'. ఈ గ్రంథానికి శ్రీశ్రీ ఉత్తమ కవితా పురస్కారం అందుకున్నాను. ఆ తర్వాత రచించిన కవితా సంపుటి 'రాతి చిగుళ్ళు'. దీనికీ మంచి గుర్తింపు వచ్చింది. ఆరుద్ర సాహితీ పురస్కారం, ఉమ్మడి శెట్టి కవితా పురస్కారం గెలుచుకుంది. 'అడ్డా' కథా సంపుటికి రమ్యసాహితీ, పెనుగొండ వారి ఉత్తమ కథా రచయిత్రిగా పురస్కారం అందుకున్నాను. ఇవే కాకుండా మూడు నవలలు రచించాను. మొదటిది 'ఏనావది ఏ తీరమో" ఆంధ్రభూమిలో ఉగాది నవలల పోటీలో సాధారణ బహుమతికి ఎంపికై అందులోనే ధారావాహికంగా ప్రచురింపబడింది. అయితే ఒక గ్రంథంగా రూపుదిద్దుకోలేదు. అందుకే సోషియల్ మీడియాలో అందరూ చదివేలా ఏర్పాటు చేసాను. రెండవ నవల 'ఆకుపచ్చని జాబిలి' చిత్ర మాసపత్రికలో ప్రచురింపబడింది. మూడవ నవల 'నేలమీది నక్షత్రాలు' పొయట్రీ.కామ్ అనే వెబ్‌సైట్‌లో ధారావాహికంగా ప్రచురించబడింది. అలాగే దాదాపు 600 గ్రంథాల వరకు సమీక్ష, విమర్శ చేసేందుకు 'నేటినిజం' అవకాశం కల్పించింది. ఇవే కాకుండా దాదాపు వంద సమీక్షల వరకు వివిధ పత్రికల్లో వచ్చాయి.

కొన్ని ఇబ్బందులు ఎదుర్కొని

కవిత్వం, కథలతో పాటు నవలలు, వ్యాసాలు, సమీక్షలు, విమర్శనా వ్యాసాలు, ఇంటర్వ్యూలు వరుసగా రచనలు చేసాను. ఆంగ్లంపై కాస్తంత పట్టు ఏర్పడటంతో 'సిల్వర్ లైన్స్' అనే ఆంగ్ల కవితా సంపుటిని ప్రచురించాను. తర్వాత అనువాదంపై ఆసక్తి కలిగి నా సొంత రచనలతో పాటు దాదాపు 12 మంది రచనలు తెలుగు నుండి ఆంగ్లంలోకి అనువాదం చేసాను. అయితే అనువాదం చేసిన తర్వాత ఆర్థిక విషయంలో, గుర్తింపు విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాను. వారికి గట్టిగా సమాధానం చెప్పే ధైర్యం లేక అనువాదాలు చేయడమే మానేశాను.

ఒక ఉనికి అవసరం


వ్యక్తిత్వం కోల్పోతే మనిషి బతికున్నా చనిపోయినట్లే. అందుకే జీవితం ఒకరి చెప్పు చేతల్లో ఎందుకుండాలి? అనిపించేది. స్త్రీ కావచ్చు, పరుషుడు కావచ్చు ఎవరికైనా ఒక ఉనికి అవసరం. అది వారికున్న ప్రతిభ ఆధారంగానే వస్తుంది. సంగీతం, సాహిత్యం, నృత్యం, ఎంబ్రాయిడరీ, అల్లికలు వంటివన్నీ నాకు నచ్చిన, వచ్చిన ప్రతిభలే. కాకుంటే కాలానుగుణంగా కొన్ని వాటంతట అవే మరుగున పడిపోతాయనేది నా విషయంలోనే నిజమయ్యింది. సాహిత్యం ఒక్కటే ఇప్పటి వరకు నాకు తోడుగా నిలిచింది. సాహిత్య పరంగా ఎన్నో పురస్కారాలు, సత్కారాలు అందుకున్నాను. అన్నింటికి మించి నా రచనలకు ఓ ప్రత్యేకమైన గుర్తింపు నిచ్చించి పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వారి నుండి అందుకున్న కీర్తి పురస్కారం. అలాగే ఉత్తమ విమర్శకురాలిగా అమృతలత ద్వారా నాకు అందించిన అపురూప అవార్డు నా సాహితీ ప్రమాణాన్ని పెంచాయనే చెప్పాలి. ప్రతి పురస్కారం సమాజం పట్ల మరింత బాధ్యత పెంచేదిగానే భావిస్తాను.



– సలీమ

గ్రీన్‌ఫీల్డ్ హైవే సర్వే ఉద్రిక్తం

(మొదటిపేజి తరువాయి)



కుండపోతగా వర్షం కురుస్తున్నా కొదుమూరు, వందనం గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఆదివారం నాడు సర్వే చేసేందుకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకోవడంతో మంగళవారం ఖమ్మం, వైరా సర్కిళ్ల పరిధిలోని 300 మందికి పైగా పోలీసులను మోహరించి సర్వే చేపట్టారు. రైతులకు మద్దతుగా వస్తున్న సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. సీపీఐ(ఎం) చింతకాని మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కమిటీ సభ్యులు ఉపేందర్‌ను అరెస్టు చేసి కొణిజర్ల పోలీసుస్టేషన్‌కు తరలించారు.

రెండు ఊళ్ల దిగ్బంధం..

ఉదయాన్నే కొదుమూరు, వందనం గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నిర్వాసిత రైతుల ఇళ్లు, రోడ్లపైన మరికొందరు పహారా కాశారు. రైతులు ఎవరూ ఇండ్ల నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. రెండు గ్రామాల నుంచి వెళ్లే దారులన్నీ బారికేడ్లతో మూసివేశారు. అటుగా వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎవరు? ఏమిటి? అని ఆరా తీశారు. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలను సైతం అన్ని వివరాలు తెలుసుకున్నాకే అనుమతించారు. వాహనాలపై వచ్చేవారి ఆధారాలను తనిఖీ చేశారు. ఐడీ కార్డులను పరిశీలించారు. రైతుసంఘాలు, వివిధ పార్టీల నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఉన్నతాధికారుల నుంచి సీరియస్ ఆదేశాలు రావడంతోనే ఈ సర్వే చేస్తున్నామని, ఎట్టిపరిస్థితుల్లో ఎవరు అడ్డుపడినా సర్వే ఆగదని ముందుగానే అధికారులు వివిధ పార్టీలు, రైతుసంఘాల నేతలకు చెప్పారు. జోరు వాన, మోకాళ్లలోతు బురదలోనూ సర్వే కొనసాగించారు.

అరెస్టులు.. అడ్డగింతలు..

తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబుతో పాటు మరికొందరిని ఖమ్మం శివారు పుట్టకోటలోనే పోలీసులు అడ్డగించి, వెనక్కు పంపారు. సీపీఐ(ఎం)మండల నాయకులను అరెస్టు చేసి, కొణిజర్ల స్టేషన్‌కు తరలించారు. అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, ఏసీపీలు రవి, నర్సయ్య, రెహమాన్, ఖమ్మం, వైరా కమిషనరేట్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు 300 మంది వరకు పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

సర్వే నిర్వహణ తీరు...

మండలంలోని కొదుమూరు, వందనం, నాగిలిగొండ, నేరడ, ప్రొద్దుటూరు రెవెన్యూలలో సుమారు 300 ఎకరాలు గ్రీన్‌ఫీల్డ్ హైవే కింద సేకరించాలి. వీటిలో కొదుమూరు, వందనం మినహా మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తయింది. ప్రజాభిప్రాయ సేకరణనూ వ్యతిరేకించారు. ఈ రెండు గ్రామాల ప్రజలు ఎంతకూ ఒప్పుకోకపోవడంతో దౌర్జన్యంగా మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సర్వేను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అభిలాష్ అభినవ్ పర్యవేక్షించారు. ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, వెంకట్రావు, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్, మేనేజర్ పద్మ, సైట్ ఇంజినీర్లు తేజా, వెంకట్, చింతకాని, కొణిజర్ల, ఖమ్మం రూరల్ తహశీల్దార్లు మంగీలాల్, సైదులు, సుమ, ఇతర రెవెన్యూ సిబ్బంది నిర్వహించారు.

బలవంత భూసేకరణ సరికాదు..

బొంతు రాంబాబు, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి

ఓవైపు జోరుగా వర్షం వస్తున్నా ఉదయాన లేచేసరికి రెండు గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. రెవెన్యూ అధికారులు బలవంత భూసేకరణ చేపట్టారు. ఎకనమిక్ కారిడార్ పేరుతో అదానీ కోసం చేస్తున్న బలవంతపు భూసేకరణను రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కేసీఆర్ సర్కారు ఆపాలి. రైతులు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా వాటిని లక్ష్యపెట్టకుండా సేకరిస్తున్నారు. కొత్త కలెక్టరేట్‌కు చెల్లించినట్లుగా ఖమ్మానికి సమీపంలో ఉన్న ఈ గ్రామాల భూములకు కూడా పరిహారం చెల్లించాలి.

నిర్బంధించి సర్వే చేస్తున్నారు..
వేముల సతీష్, కొదుమూరు

రెండు జాతీయ రహదారులు మా భూమిలో నుంచి వెళ్తున్నాయి. ఉన్న నాలుగు ఎకరాలు పోతున్నాయి. రూ.కోటిన్నర ఎకరం ఉంటే రూ.25 లక్షలు పరిహారం ఇస్తున్నారు. ఇండ్ల నుంచి బయటకు రాకుండా పోలీసులను పెట్టి బలవంతంగా సర్వే చేస్తున్నారు. రైతులను నిర్బంధించి సర్వే చేయడం న్యాయమేనా?

భారీ వర్షం.. పొంగుతున్న వాగులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి/మహాదేవ్‌పూర్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు ధ్వంసమై రాకపోకలు స్తంభించాయి. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి. దాంతో వాతావరణ శాఖ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించింది. వరంగల్ జిల్లాలో సగటున 18.6 సెం.మీ. వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మహబూబాబాద్ జిల్లాలో 10.3, ములుగు జిల్లాలో 3.8 శాతం సగటు వర్షపాతం నమోదైంది.

వరంగల్ జిల్లా వట్టివాగు ఉధృతితో నెక్కొండ మండలకేంద్రం నుంచి గూడూరు మధ్య రాకపోకలు స్తంభించాయి. పంటలు, చేలు నీట మునిగాయి. రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. చెన్నారావుపేట మండలంలో నర్సంపేట, పాతముగ్దుంపురం రహదారిపైకి వరదనీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరదతో గోపనపల్లి, అనంతారం మధ్య రాకపోకలు బందయ్యాయి. కల్లెడ, అన్నారం షరీఫ్ గ్రామాల మధ్య ఆకేరువాగు ఉధృతితో రావూరు, కల్లెడ బ్రిడ్జిపై రాకపోకలు నిలిచాయి. హన్మకొండ జిల్లా ఐనవోలు మండలంలో పంథిని వద్ద వరంగల్-ఖమ్మం రహదారిపై రాకపోకలు, వరదతాకిడికి ఐనవోలు మండల కేంద్రం నుంచి గర్మిల్లపల్లి గ్రామానికి మధ్య రహదారులు, కల్వర్టులు పూర్తిగా దెబ్బతిన్నాయి. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో భీమునిపాదం జలపాతం ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సందర్శకులకు అనుమతి నిరాకరించారు. ధర్మసాగర్ మండలం ధర్మపురంలో పిడుగుపడి 25 గొర్రెలు మృత్యువాతపడ్డాయి.

మత్తడిపోస్తున్న చెరువులు

ములుగు జిల్లా రామప్ప చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం 38 అడుగులు కాగా ప్రస్తుతం వరద ఉధృతితో 29.1 అడుగులకు చేరింది. రామన్నగూడెం వద్ద గోదావరి నీటి మట్టం 71.87 అడుగులకు చేరింది. లక్నవరం చెరువు పూర్తి స్థాయి నీటిమట్టం 33 అడుగులు కాగా ప్రస్తుతం 28.1 అడుగులకు చేరింది. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం మాదన్నపేట చెరువుకు వరద చేరడంతో మత్తడి పోస్తున్నది. పర్వతగిరి మండలం గోపనపల్లి ఊరచెరువుకు వరద తాకిడితో మత్తడి పడింది.

ప్రాజెక్టుల నుంచి దిగువకు నీరు విడుదల

భూపాలపల్లి జిల్లా మహాదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 5,64,570 క్యూసెక్కుల వరదనీరు వస్తుండటంతో 75 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. కన్నాయిగూడెం మండలం సమ్మక్క బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో 7,89,940 క్యూసెక్కుల వరదనీరు వస్తుండగా 59 గేట్లు ఎత్తి కిందికి నీటిని వదిలారు. వరంగల్ జిల్లాలోని ఖానాపురం మండలం పాకాల సరస్సులోకి నీటి మట్టం 21 అడుగులకు చేరింది.

బ్యారేజీల బ్యాక్ వాటర్‌తో భారీగా నష్టం

కొంత ఆలస్యంగానైనా వర్షాలు కురవడంతో రైతుల్లో వెల్లువెరిసిన ఆనందం కొన్ని రోజుల్లోనే ఆందోళనగా మారింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టుకు వరద ఉధృతి పెరిగింది. దీనికి అనుసంధానంగా జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలూ నిండి బ్యాక్ వాటర్ పంట పొలాల్లోకి చేరుతోంది. దాంతో నదికి రెండు వైపులా రెండు మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రవహిస్తూ వందల ఎకరాల పంటలను ముంచుతోంది. బ్యాక్ వాటర్ కారణంగా వేల ఎకరాల్లో పత్తి, వరి, మిర్చితోపాటు ఇతర పంటలు నీళ్లపాలవుతున్నాయి. ఇలా పంట నీట మునిగినప్పుడల్లా అధికారులు సర్వే జరిపి, పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారే శాశ్వత పరిష్కారం చూపడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నారం బ్యారేజీ కింద అన్నారం చంద్రుపల్లి, మద్దులపల్లి, నాగేపల్లి పూసుకుపల్లి, కుంట్లం, బలిజాపూర్, కన్నెపల్లి, మెటపల్లి, పలుగుల గ్రామాలకు సంబంధించిన సుమారు 350 ఎకరాలు మునుగుతున్నాయని ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ పరిధి మహాదేవపూర్, బొమ్మాపూర్, సూరారం, బెగ్లూర్, బ్రాహ్మణపల్లి, అంబట్‌పల్లి, కుదురుపల్లి, ఎడపల్లి గ్రామాలకు సంబంధించిన సుమారు 340 ఎకరాల పంటలు తరచూ నీట మునుగుతున్నాయని మండల రైతు సంఘం నాయకులు వామన్‌రావు తెలిపారు. 2019 నుంచి ఇదే తంతు జరుగుతున్నా రైతులను ఆదుకున్న దాఖలాలు లేవన్నారు.

పలు జిల్లాల్లో వర్షాలతో నష్టం

వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. ధరూర్ మండలంలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 24 అడుగులు కాగా 23 అడుగుల మేర వరద నీరు చేరింది. భుగ్గ వాగు, నర్సాపూర్ వాగు, ఎన్నారం వాగు, జిన్నారం నాలుగు వాగుల ద్వారా ప్రాజెక్టులోకి భారీగా వచ్చి చేరుతోంది. రోడ్డు పైకి నుంచి నీరు ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రంగారెడ్డి జిల్లా నార్సింగి గ్రామానికి చెందిన క్యాతం యాదయ్యయాదవ్.. తన పొలం వద్ద మందపెట్టిన 200 గొర్రెల్లో 26 మృత్యువాత పడ్డాయి. దాదాపు రూ.రెండు లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.

ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల వద్ద ఆకేరు వాగు బ్రిడ్జి పై నుంచి వరద పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఓ రైతు తమ పశువుల తోలుకుని వంతెన దాటుతుండగా ఒక ఆవు నీటిలో కొట్టుకుపోయింది. ఖమ్మం నగరంలో మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. పాత బస్టాండ్ సెంటర్‌లో మోకాళ్లలోతు నీరు నిలువడంతో వాహనదారులు, విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో వర్షపు నీరు ఇండ్లలోకి చేరుతున్నాయి. కూసుమంచి మండలం నరసింహులగూడెం - కిష్టారం గ్రామాల మధ్య ఉన్న వాగు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పాలేరు జలాశయం నిండుకుండను తలపిస్తున్నది. పూర్తి స్థాయి నీటి మట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం 22 అడుగులకు నీరు చేరింది. వైరా రిజర్వాయర్ 18.3 అడుగులకు గాను 17.3 అడుగులకు నీరు చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం గోదావరి మంగళవారం సాయంత్రం 6 గంటలకు 38.8 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. రాత్రికి మూడు నుంచి నాలుగు అడుగులు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

రాజకీయ లబ్ది కోసమే మణిపూర్ మంటలు

(మొదటిపేజి తరువాయి)

పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ లిబర్టీ చౌరస్తా నుంచి ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ప్రదర్శనను నిర్వహించారు. 'మణిపూర్ సీఎం రాజీనామా చేయాలి, ప్రధాని మోడీ ప్రజలకు క్షమాపణ చెప్పాలి, బీజేపీ కో హఠావో... దేశ్‌కో బచావో, మణిపూర్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ గద్దెదిగాలి, మహిళలను నగ్నంగా ఊరేగించిన వారిని ఉరితీయాలి, మత రాజకీయాలు, విద్వేషాలకు వ్యతిరేకంగా పోరాడతాం, హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి'అంటూ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినాదాలు చేశారు.

మణిపూర్ హింస వెనుక కేంద్రం పెద్దలు : తమ్మినేని

మణిపూర్ హింస వెనుక కేంద్రం పెద్దలున్నారనీ, వారి ఆశీర్వాదంతోనే సీఎం బీరెన్‌సింగ్ అల్లర్లను ప్రోత్సహిస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. అక్కడ తలలు నరకడం, సామూహిక లైంగికదాడులకు పాల్పడడం, దోపిడీలు, భయంకరమైన హింసాకాండ కొనసాగుతున్నదని అన్నారు. కుకీ, మైతీ అనే తెగల మధ్య జరుగుతున్న ఘర్షణగా చెప్తున్నా అది వాస్తవం కాదన్నారు. రెండు, మూడు నెలల నుంచి హింసాకాండ కొనసాగుతున్నా కేంద్రం, మణిపూర్ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని చెప్పారు. బీజేపీ ఎంపీ స్థానాలు రెండు నుంచి 300కు పెరిగాయన్నారు. చేసిన అభివృద్ధి గురించి చెప్పి ప్రజలను ఓట్లు అడగడం లేదన్నారు. మత ఘర్షణలను సృష్టించి 2024లో మళ్లీ అధికారంలోకి రావాలని కుట్ర చేస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లును ముందుకు తెస్తున్నదని అన్నారు. మహిళలు, పురుషులు సమానంగా ఉండే చట్టాలను తేవాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. రాజద్రోహం, ఉపా వంటి చట్టాలను ప్రయోగిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ యూసీసీ పేరుతో మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆ బిల్లు తెస్తే హిందూ, ముస్లింల మధ్య ఘర్షణ వస్తుందనీ, దానివల్ల ఎన్నికల్లో బీజేపీ ఓట్లు పొందొచ్చన్న కుట్ర ఉందనీ, ఆ కుట్రబుద్ధిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించడం కోసమే 26 ప్రతిపక్ష పార్టీలు ఐక్యమయ్యాయని వివరించారు. రాష్ట్రంలోనూ అలాంటి ఐక్యత కోసం కృషి చేస్తున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ యూసీసీపై స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేశారు. వైసీపీ, టీడీపీ ఖండించడం సంతోషకరమని చెప్పారు.

సంపదను అదానీకి కట్టబెట్టే కుట్ర : నారాయణ

మణిపూర్‌లో సంపదను అదానీకి కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదనీ, 54 వేల ఎకరాల భూమిని అప్పగించారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. భూగర్భ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని చెప్పారు. మణిపూర్ చైన్ ద్వారా ఆయుధాలతో ఉగ్రవాదులు దేశంలోకి చొరబడుతున్నారని అన్నారు. కేంద్రం, మణిపూర్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వారి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడ అల్లర్లను అరికట్టాలనీ, శాంతిని నెలకొల్పాలంటూ ఇప్పటి వరకు ప్రధాని మోడీ కోరలేదన్నారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యే ముందు రోజు మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియోలను ఉద్దేశపూర్వకంగా విడుదల చేశారని అన్నారు. విపక్షాలు ఈ అంశంపై చర్చకు పట్టుబడతాయనీ, సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించినందున చర్చకు అవకాశం లేదంటూ కేంద్రం తప్పించుకుంటున్నదని వివరించారు. ప్రజాసమస్యలు చర్చకు రాకుండా కుట్ర చేసిందన్నారు. మోడీ ప్రభుత్వం ఒక్క క్షణం కూడా అధికారంలో ఉండేందుకు వీల్లేదని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అధికారాన్ని శాశ్వతంగా నిలబెట్టుకునేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని విమర్శించారు.

బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదని చెప్పారు. మణిపూర్‌లో మహిళల పట్ల వ్యవహరించిన తీరు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమనీ, వారిని కఠినంగా శిక్షించేందుకు కొత్త చట్టాలను తేవాల్సిన అవసరముందని సూచించారు. లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిలో 80, 90 శాతం బీజేపీకి చెందిన వారే ఉన్నారని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నపుడే నాడు గుజరాత్‌లో గోద్రా ఘటన, నేడు మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్నదని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా మాట్లాడుతూ భేటీ పడావో భేటీ బచావో అంటూ నినదించిన ప్రధాని మోడీ వారి విషయంలో ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులు జరుగుతుంటే కేంద్రం, మణిపూర్ ప్రభుత్వం ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ సర్కారు అంటే మహిళలకు రక్షణ లేకుండా చేయడమేనా?అని అడిగారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ, సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం దశరథ్ సమన్వయకర్తలు వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్‌బాబు, జె బాబురావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవితోపాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యాసంస్థలకు సెలవు

(మొదటిపేజి తరువాయి)

బుధ, గురువారం రెండురోజులపాటు అన్ని విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. అందుకు సంబంధించి తక్షణమే ఉత్తర్వులను జారీ చేయాలంటూ విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈనెల 20 నుంచి వరుసగా మూడు రోజులపాటు రాష్ట్రంలోని విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. సోమ, మంగళవారం మాత్రమే విద్యాసంస్థల్లో తరగతులను నిర్వహించారు.

ఇప్పుడు మళ్లీ బుధ, గురువారం రెండురోజులపాటు సెలవులు ప్రకటించడం గమనార్హం. అందుకు సంబంధించిన ఉత్తర్వులను విద్యాశాఖ సంచాలకులు ఎ శ్రీదేవసేన విడుదల చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రయివేటు, ఎయిడెడ్ పాఠశాలలన్నింటికీ సెలవులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. సెలవులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆర్జేడీలు, డీఈవోలను ఆమె ఆదేశించారు. అయితే ఈనెల 28న మొహర్రం తొమ్మిదో రోజు ఐచ్ఛిక సెలవు, శనివారం మొహర్రం పదో రోజు సాధారణ సెలవు, మరుసటి రోజు ఆదివారం. దీంతో వచ్చే సోమవారం విద్యాసంస్థలు తెరుచుకుంటాయని చర్చ జరుగుతున్నది.

కుకీలపై సంఘపరివార్ దుష్ప్రచారం

కుకీలు మయన్మార్ నుంచి వచ్చినవారిగా చిత్రీకరణ
- అన్నదమ్ముల్లాంటి కుకీ, మైతీల మధ్య చిచ్చు

మణిపూర్‌పై ప్రత్యేకం కథనం



మణిపూర్‌లో సంఘ్‌పరివార్ విద్వేష విత్తును నాటింది. ఇక్కడ, ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు గల సంస్థలు ద్వేషపూరిత ప్రచారానికి ఉపయోగించే రెండు అంశాలు కొండ ప్రాంతంలో గసగసాల సాగు, అటవీ నిర్మూలన. ఈ రెండు సమస్యలకు కుకీలే కారణమని కొన్నాళ్లుగా ఆర్‌ఎస్‌ఎస్ విస్తృత ప్రచారం జరుపుతున్నది. ఇందుకోసం ఆన్‌లైన్ మీడియాను పెంచి పోషించింది. అన్నదమ్ముల్లాంటి కుకీ, మైతీల మధ్య చిచ్చుకు దీన్నే ఆయుధంగా వాడుకుంటుంది. మణిపూర్ హైకోర్టు మెయితీలకు షెడ్యూల్డ్ తెగ హోదాను ఇవ్వడాన్ని పరిగణనలోకి తీసుకున్న తరువాత, రాష్ట్రంలో చెలరేగిన అల్లర్లు దాదాపు 84 రోజులుగా రగులుతున్నాయి.

న్యూఢిల్లీ నుంచి ప్రత్యేక ప్రతినిధి
జె.జగదీశ్వరరావు

నిజమే, మణిపూర్‌లోని పర్వత ప్రాంతంలో 15,000 ఎకరాలకు పైగా గసగసాలు పండిస్తున్నారు. దీనిని కుకీ రైతులు పండిస్తారు. ఇదే వారి ప్రధాన ఆదాయ వనరు. అయితే డ్రగ్స్ మాఫియాతో గసగసాల సాగుకు ముడిపెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. గసగసాలు తినదగినవి. దీని పూలను మందుల తయారీకి వాడుతున్నారు. డ్రగ్స్ మాఫియా మైతీ వర్గానికి చెందిన రాజకీయ నాయకులు, వ్యాపారుల చెప్పు చేతుల్లోనే ఉంది. అడవుల వేట విషయంలోనూ ఇదే పరిస్థితి. నరికిన చెట్లను మైతీ అధినేతలు కొనుగోలు చేస్తారు. కుకీలు దీని నుంచి చిన్న మొత్తాన్ని పొందుతారు. అయితే ఈ అడవిని మైతీ వ్యాపారులు స్వాధీనం చేసుకోవాలని కుట్ర పన్నుతున్నారు. మాఫియా గ్రూపులను అణిచివేసేందుకు చర్యలు తీసుకోకుండా సంఘ్ పరివార్, బీజేపీ ప్రభుత్వం కుకీ వ్యతిరేక ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నాయి. మరోవైపు దశాబ్దాలుగా నివాసముంటున్న కుకీలు మయన్మార్ నుంచి అక్రమంగా వలస వచ్చిన వాళ్లుగా చిత్రీకరిస్తూ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు.

దీంతో ఏర్పడిన విషపూరిత వాతావరణం మణిపూర్‌ను అల్లర్ల భూమిగా మార్చింది. ఇప్పుడు లోయలో కుకీలు, పర్వత ప్రాంతాల్లో మైతీలు నివసించడం అసాధ్యం. ఇంతలో మతపరమైన దాడులు జరిగాయి. కుకీలు ఎక్కువగా క్రైస్తవులు కావడంతో సంఘ్ పరివార్ కుకీ వ్యతిరేక ప్రచారం ముసుగులో క్రైస్తవ వ్యతిరేకతను చాటగలిగింది. లోయలోని మైతీ క్రైస్తవుల 276 చర్చిలను కూల్చివేయడమే ఇందుకు నిదర్శనం. మైతీ చర్చిలు సాధారణంగా తాత్కాలిక నిర్మాణాలు. ప్రతి ప్రాంతంలోని చిన్న వర్గాల అవసరాల కోసం నిర్మించిన ఈ చర్చిలు తక్కువ సమయంలోనే కూల్చివేయబడ్డాయి. బాగా కట్టిన ఇరవై ఐదు కుకీ చర్చిలు కూడా ధ్వంసమయ్యాయి.

మణిపూర్‌లో బీజేపీ రహస్యంగా, బహిరంగంగా మద్దతిచ్చే ఉగ్రవాద సంస్థలైన అరంబై తెంగోల్, మైతీ లీపున్‌లతో ఒకవైపు, కుకీ సాయుధ గ్రూపులతో మరోవైపు యుద్ధం లాంటి పోరాటం జరుగుతోంది. మైతీ దుండగులు చెలరేగుతుండగా రాష్ట్ర పోలీసులు నిష్క్రియంగా ఉన్నారు. పోలీసు ఆయుధాల నుంచి 4000కు పైగా తుపాకులు ఎక్కడ మాయమయ్యాయన్న ప్రశ్నకు సమాధానం లేదు. అదే సమయంలో, ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ కూడా నలభై కుకీ ఉగ్రవాదులను చంపామని పేర్కొన్నారు. 2017 మణిపూర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ మాత్రం కుకీ తిరుగుబాటు సంస్థలతో రహస్య చర్చలు జరిపారు.

వంద మందికి పైగా మరణించినట్టు అధికారికంగా ధ్రువీకరించబడినప్పటికీ, వివిధ ఏజెన్సీలు సుమారు 200 మరణాలు సంభవించినట్టు సూచిస్తున్నాయి. వెయ్యి మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఐదు వేలకు పైగా ఇండ్లు దగ్ధమయ్యాయి. దాదాపు రెండు వందల గ్రామాలు అగ్నికి ఆహుతయ్యాయి. 60,000 మంది శరణార్థులుగా మారారు. మూడు, నాలుగు అంతస్తుల ఇండ్లు నేలమట్టమయ్యాయి. రాష్ట్రంలోని సీనియర్ నేతలకు కూడా భద్రత లేదు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వోద్యోగుల ఇళ్లపై దాడులు జరుగుతున్నాయి. మాజీ సైనికుని భార్యతో సహా మరో ఇద్దరిని నగ్నంగా ఊరేగించారు. మహిళలపై దాడులు, లైంగికదాడులు పెరిగాయి. స్వాతంత్ర సమరయోధుని భార్యను సజీవ దహనం చేశారు. హత్యకు గురైన కుకీల మృతదేహాలు ఇంఫాల్‌కు కూడా చేరుకోలేక మార్చురీలో కుప్పలుగా పోసి ఉన్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి, మణిపూర్ లోక్‌సభ సభ్యుడు రాజ్‌కుమార్ రంజన్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో పరిస్థితిపై మాజీ ఆర్మీ స్టాఫ్ విపి మాలిక్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జనరల్ నిశికాంత సింగ్ దీనస్థితిని ట్విట్టర్‌లో పంచుకున్నారు. మణిపూర్ పరిస్థితి లెబనాన్ పరిస్థితిని పోలి ఉందని మరియు పాలన లేని భూమిగా మారిందని ట్వీట్ చేశారు. 40 ఏళ్లుగా సైన్యంలో పనిచేసిన ఓ అధికారి ఈ విధంగా స్పందించారు.

మణిపూర్ పరిస్థితి పొరుగు రాష్ట్రాల్లోనూ ప్రతిబింబిస్తోంది. మణిపూర్‌లో మైనారిటీలపై వేధింపులను అంతం చేసేందుకు మిజోరాంకు చెందిన మైతీలు జోక్యం చేసుకోవాలని మిజోరం విద్యార్థుల ప్రజా వేదిక ఎంఎస్‌డీపీ డిమాండ్ చేసింది. మిజోరాంలో మైయితీలు క్షేమంగా ఉండగా, మణిపూర్‌లో తమ సోదరులు పడుతున్న కష్టాలను చూడనట్లు నటించలేరు. మణిపూర్ సమస్యను సత్వరమే పరిష్కరించకుంటే భవిష్యత్తు దుర్భరంగా మారుతుందని ఎంఎస్‌డీపీ ప్రకటించింది. ఈశాన్య రాష్ట్రాల్లో నెలకొన్న అశాంతి బీజేపీ వాదనలకు విరుద్ధంగా ఉంది. బీజేపీ పాలనలో ఈశాన్య రాష్ట్రాలు శాంతి, ప్రగతిని సాధించాయన్న వాదన సన్నగిల్లుతోంది. సంఘ్ పరివార్ విద్వేష బీజాలను మాత్రమే నాటింది.

ప్రారంభోత్సవానికి సిద్ధమైన మీడియా అకాడమీ భవనం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ మీడియా అకాడమీ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. హైదరాబాద్‌లోని నాంపల్లి చాపల్ రోడ్డులో ఉన్న పాత ప్రెస్ అకాడమీ స్థానంలో దీనిని నిర్మించిన సంగతి తెలిసిందే. వేయి గజాల స్థలంలో నాలుగు అంతస్తుల్లో 29,548 చదరపు అడుగుల్లో అద్భుతంగా దీనిని నిర్మించారు. ఈ భవనం ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఆహ్వానించారు. ఆయన సమయం కోసం చూస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాత అకాడమీ భవనంలో ఫిబ్రవరి 2015లో జరిగిన అకాడమీ మొదటి సర్వసభ్య సమావేశంలో కొత్త భవనం నిర్మించాలని సూచించారు. ఆ మేరకు 2017లో భవన నిర్మాణానికి రూ.15 కోట్లు విడుదల చేశారు. సీఎం కేసీఆర్ కర్త, కర్మ క్రియగా ఈ భవనం రూపుదిద్దుకున్నది. భవనంలో జర్నలిస్టుల కోసం నాలుగు తరగతి గదులు, కార్యాలయ సిబ్బంది కోసం ఒక అంతస్తు. 250 మంది కూర్చునే సామర్థ్యం గల ఆడిటోరియం, గ్రంథాలయం, చైర్మెన్, తదితరులకు ప్రత్యేక గదులు నిర్మించారు. తరగతి గదుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన కంప్యూటర్ల రూమ్‌ను కూడా నిర్మించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ నిర్మాణం జరిగింది. ఇటీవల నిర్మాణం పూర్తయిన సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తో కలిసి సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ రాజమౌళి తదితర అధికారులు అకాడమీ భవన నిర్మాణం పర్యవేక్షించారు. భవనం పనులన్నీ తుదిదశకు వచ్చినందున, మిగిలిన అరకొర పనులు పూర్తిచేసి మెరుగులు దిద్దవలసిందిగా ఆర్ అండ్ బి అధికారులను కోరారు. త్వరలో నగరం నడిబొడ్డున మీడియా అకాడమీకి కార్పొరేట్ స్థాయి సొంత భవనం సిద్ధమయింది. ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ వల్ల, జర్నలిస్టుల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధి వల్ల ఇది సాధ్యమైందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. త్వరలో మీడియా అకాడమీ భవనం ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించుకుంటామని చెప్పారు.

స్లాన్ చెస్ చాంప్ కర్తవ్య



హైదరాబాద్: స్లాన్ తొలి అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటెడ్ చెస్ టోర్నీలో గుజరాత్‌కు చెందిన అనద్కట్ కర్తవ్య చాంపియన్‌గా నిలిచాడు. యూసుఫ్‌గూడ ఇండోర్ స్టేడియం వేదికగా మంగళవారం ముగిసిన టోర్నీలో కర్తవ్య 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఫైనల్ రౌండ్‌లో కర్తవ్య..ఇంటర్నేషనల్ మాస్టర్ కష్ణతేజను ఓడించడం ద్వారా టైటిల్ విజేతగా నిలిచాడు. అయితే ఎనిమిదేసి పాయింట్లతో అనూజ్ శ్రీవర్తి, రామనాథన్ బాలసుబ్రమణ్యం, మందర్ ప్రదీప్ సమంగా నిలువగా, టై బ్రేక్ స్కోర్లతో రెండు, మూడు, నాలుగు స్థానాలకు వీరిని విజేతలుగా ప్రకటించారు. టైటిల్ దక్కించుకున్న కర్తవ్యకు ట్రోఫీతో పాటు లక్ష రూపాయల ప్రైజ్‌మనీ లభించింది. టోర్నీలో మొత్తం 97 మందికి పది లక్షల నగదు ప్రోత్సాహకాలు అందించారు. టోర్నీలో ఏడు దేశాల నుంచి ఈసారి 525 మంది ప్లేయర్లు పోటీపడ్డారని నిర్వాహకుల తెలిపారు. పోటీల ముగింపు కార్యక్రమానికి సీబీఐ మాజీ జేడీ లక్ష్మినారాయణ, చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్‌కప్‌కు ముందు ఆసీస్‌తో
టీమిండియా వన్డే సిరీస్..

- పూర్తి షెడ్యూల్ ఇదే: బీసీసీఐ

న్యూఢిల్లీ : స్వదేశంలో టీమిండియా 2023-24లో ఆడనున్న మ్యాచ్‌ల వివరాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) వెల్లడించింది. ఏడాది కాలంలో భారత సీనియర్ పురుషుల జట్టు సొంతగడ్డపై 16 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుందని తెలిపింది. ఇందులో 5 టెస్టులు, మూడు వన్డేలు, 8 టీ20 మ్యాచ్‌లు ఉన్నట్టు ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది. టీమిండియా-ఆస్ట్రేలియా మధ్య వన్డే సిరీస్ జరుగనుందన్న బీసీసీఐ.. మొహాలీ, ఇండోర్, రాజ్‌కోట్ వేదికలుగా ఉంటాయని పేర్కొంది. వన్డే వరల్డ్‌కప్ కంటే ముందే అంటే.. సెప్టెంబరు 22- 27 వరకు ఈ సిరీస్ జరుగనుందని వెల్లడించింది. ఐసీసీ ఈవెంట్ తర్వాత టీమిండియా ఆసీస్‌తో 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుందని తెలిపింది.

నవంబరు 23న వైజాగ్‌లో మొదలై డిసెంబరు 3న హైదరాబాద్ మ్యాచ్‌తో ఆసీస్ టూర్ ముగుస్తుందని పేర్కొంది. ఇక కొత్త ఏడాదిని అఫ్గనిస్తాన్‌తో పరిమిత ఓవర్ల క్రికెట్‌తో ఆరంభించనుందని భారత క్రికెట్ బోర్డు వెల్లడించింది. మొహాలీ, ఇండోర్, బెంగళూరులలో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడుతుందని పేర్కొంది. అదే విధంగా భారత్‌లో అఫ్గనిస్తాన్ తమ మొట్టమొదటి టెస్టు మ్యాచ్‌ను బెంగళూరులో ఆడబోతోందని తెలిపింది. ఆ తర్వాత జనవరి 25 నుంచి ఇంగ్లండ్‌తో టీమిండియా ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ఆరంభం కానుందని వెల్లడించింది. హైదరాబాద్, వైజాగ్, రాజ్‌కోట్, రాంచి, ధర్మశాల ఇందుకు వేదికలుగా ఉంటాయని బీసీసీఐ ప్రకటించింది.

2024 ఒలింపిక్స్ జ్యోతి నమూనా ఆవిష్కరణ



జిన్నువా(ఫ్రాన్స్): 2024 పారిస్ ఒలింపిక్స్, పారా ఒంపిక్స్ జ్యోతి నమూనాను మంగళవారం ఆవిష్కరిం చారు. ప్రపంచ ఏడు వింతల్లో ఒక్కటైన ఈఫిల్ టవర్‌ను పోలిన ఈ టార్చ్ నమూనాను ప్రఖ్యాత డిజైనర్ మాథ్యూ లెహెన్నూర్ రూపొందించారు. 2024 ఒలింపిక్స్ జరిగేందుకు సరిగ్గా ఏడాది ఉన్న నేపథ్యంలో ఈ జ్యోతి నమూనాను పారిస్ అధ్యక్షుడు టోనీ ఎస్టాంగ్వెస్ట్ అందజేశారు. ఇది 70 సెంటీమీటర్ల ఎత్తుతో తేలికపాటి రేడియంట్ స్టీల్‌తో తయారు చేయబడి, షాంపైన్ రంగుతో విభిన్నంగా ఉందని, అలాగే దిగువ భాగంలో సెయిన్ నది కదలికలను అనుకరించే ఉపశమన నమూనా కలిగి ఉన్నట్లు తెలిపారు.

నవచిత్రం

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. చిన్న సినిమాగా మొదలైన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ లాంటి పెద్ద సంస్థ రిలీజ్ చేయబోతోంది. మైక్ మూవీస్ బ్యానర్ తెరకెక్కించిన ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించారు. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని ఈనెల 29న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా హీరో సంజయ్ రావు మీడియాతో ముచ్చటించారు.


సంజయ్ రావు

'ఈ కథ మా నాన్న (బ్రహ్మాజీ) ద్వారా నా దగ్గరకు వచ్చింది. డైరెక్టర్ నాకు స్టోరీ చెబుతూనే ఆయన తెగ నవ్వుకున్నారు. నాకు కాన్సెప్ట్ బాగా నచ్చింది. వెంటనే ఒకే చేశా. నేను డాగ్ లవర్ కావడంతో షూటింగ్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎంజాయ్ చేశా. కాని క్యారెక్టర్ పరంగా చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఈ సినిమాలో ప్రణవి రోల్ ఫుల్ లెంగ్త్‌లో ఉంటుంది.


అందర్నీ నవ్వించే సినిమా

చాలా ముఖ్యమైన పాత్ర ఆమెది. అయితే ఇందులో చాలా మంది డబుల్ మీనింగ్ డైలాగ్స్ ఉంటాయని అనుకుంటున్నారు. అలాంటివేమి ఉండవు. జనరల్‌గా రాత్రి పూట బాయ్ ఫ్రెండ్, గర్ల్ ఫ్రెండ్ మాట్లాడుకునేదే ఉంటుంది. ఈ రియాలిటీకి యంగ్ జనరేషన్ కనెక్ట్ తప్పకుండా కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో బేబీ (కుక్క)దే కీరోల్. అదే సినిమాను మొత్తం డిసైడ్ చేస్తుంది. సినిమా చూస్తున్నంత సేపూ అందరూ బాగా నవ్వుకుంటారు.

సెట్స్‌లో మా నాన్నను ఓ నటుడిగానే చూస్తా. మా ఇంట్లో ఒక రూల్ ఉంది. పని విషయం గడప బయటనే మాట్లాడుకోవాలి. లోపల పని గురించి మాట్లాడితే.. గడప దాటి వెళ్లాల్సిందే. సినిమాలు, పాత్రల విషయంలో మా నాన్న ఇన్‌పుట్స్ ఇవ్వరు. నేను వెళ్లి అడిగితే సలహా ఇస్తారు. లీడ్ రోల్‌లోనే విభిన్న పాత్రలు చేయాలని ఉంది. ఒక యాక్టర్‌గా ప్రూవ్ చేసుకోవాలని ఉంది. శింబు హీరోగా నటిస్తున్న ఓ తమిళ సినిమాలో విలన్‌గా నటిస్తున్నా. హీరోగా రెండు సినిమాలు ఉన్నాయి. ఒక సినిమా షూట్ స్టార్ట్ అయింది. 'ఓ పిట్టకథ' చిత్రానికి కో డైరెక్టర్‌గా పనిచేసిన సాయికృష్ణ దర్శకత్వంలో ఈ సినిమా చేస్తున్నాను.

'పుష్ప2' షూటింగ్‌లో నాన్నతో అల్లు అర్జున్ 'మీ అబ్బాయి సినిమా ట్రైలర్ అదిరి పోయింది. సినిమా ఎలా ఉంటుందో తెలియదు. ట్రైలర్ మాత్రం చాలా బాగుంది..' అని అన్నారట. అంతేకాదు కారు ఎక్కే ముందు ఫయాద్ ఫజిల్‌కి కూడా ఈ ట్రైలర్‌ను కచ్చితంగా చూడాలని చెప్పారట. నేను నాన్న, బన్నీ స్ఫూర్తితోనే పరిశ్రమలోకి అడుగుపెట్టా.

4కె ఫార్మెట్‌లో రీ-రిలీజ్


'భైరవద్వీపం'లో బాలకృష్ణ

బాలకృష్ణ, లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు కాంబినేషన్‌లో రూపొంది సంచలన విజయం సాధించిన చిత్రం 'భైరవద్వీపం'.

ఒక ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించి, ప్రేక్షకులను అందులోకి తీసుకువెళ్లిన ఈ చిత్రం 14 ఏప్రిల్ 1994న విడుదలైంది. రావి కొండల రావు రాసిన మ్యాజికల్ స్టోరీకి దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు అందించిన స్క్రీన్‌ప్లే, మాధవపెద్ది సురేష్ సంగీతం, కబీర్ లాల్ సినిమాటోగ్రఫీ, డి.రాజ గోపాల్ ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. చందమామ, విజయ కంబైన్స్ బ్యానర్ నిర్మాత బి. వెంకటరామి రెడ్డి నిర్మాణ విలువలు ప్రతి జనరేషన్‌ని ఆకట్టుకునేలా అత్యున్నత స్థాయిలో ఉండటం విశేషం. 9 నంది అవార్డులను సొంతం చేసుకున్న ఈ ఎవర్‌గ్రీన్ క్లాసిక్‌ని ఈ తరం ప్రేక్షకుల కోసం ఆగస్ట్ 5న 4కె క్వాలిటీతో క్లాప్స్ ఇన్ఫోటైన్‌మెంట్ రీ-రిలీజ్ చేస్తోంది. ప్రేక్షకులకు అత్యుత్తమ సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు ఈ చిత్రాన్ని 4కెలో చంద్ర శేఖర్ కుమారస్వామి, క్లాప్స్ ఇన్ఫోటైన్‌మెంట్ పి.దేవ్ వర్మ రిలీజ్ చేస్తున్నారు.

ఘనంగా కోడి రామకృష్ణ జయంతి వేడుకలు

శతాధిక చిత్ర దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి వేడుకలు ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగాయి. వాసవి ఫిల్మ్ అవార్డ్స్ సారథ్యంలో నిర్వహించిన ఈ వేడుకలో సినిమా రంగంతోపాటు ఉభయ రాష్ట్రాలలోని పలు రంగాల్లో సేవలు చేస్తున్న సామాజిక సేవాతత్పరులు, ప్రతిభావంతులకు ఘన పురస్కారాలు అందించారు. తెలుగు సినిమా రంగంలో సుస్థిర స్థానం సంపాదించుకున్న కోడి రామకృష్ణ పేరు ఉభయ రాష్ట్రాల్లో నిలిచేలా చేయడం ఈ పురస్కారాల ముఖ్య ఉద్దేశ్యమని కార్యక్రమ సారథి - నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ అన్నారు. నటుడు సుమన్‌కి 'నట కేసరి' బిరుదు ప్రదానం చేశారు.



కోడి రామకృష్ణ కుమార్తె కోడి దివ్య, తెలంగాణ ఎఫ్.డి.సి.చైర్మన్ అనిల్ కూర్మాచలం, నటులు మురళీ మోహన్, బాబు మోహన్, దర్శకులు రేలంగి నరసింహారావు, రోజారమణి, కవిత, దివ్యవాణి, వంశీ రామరాజు, ప్రముఖ వ్యాపారవేత్త బండారు సుబ్బారావు, మద్దుల ప్రకాష్, విజయలక్ష్మి, నంద కుమార్, రాయవరపు భాను ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 'విరూపాక్ష' దర్శకుడు కార్తీక్ వర్మ దండు, 'సామజవరగమన' దర్శకుడు రామ్ అబ్బరాజు, కథా రచయిత భాను, 'అనుకోని ప్రయాణం' దర్శకుడు వెంకట్ పెదిరెడ్ల, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు తదితరులు పురస్కారాలు అందుకున్నారు.

ఏకెపీఎమ్ ఫిలిమ్స్ పతాకాం పై సంధ్య బయిరెడ్డి దర్శకత్వంలో కిరణ్ కస్తూరి నిర్మిస్తున్న చిత్రం 'మేక్ ఎ విష్'. మంగళవారం ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, ఈ చిత్ర నిర్మాణ నిర్వహణగా ఉన్న భవాని శ్రీను (ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్) చేతుల మీదుగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది.

ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ, 'సస్పెన్స్ డ్రామాగా ముగ్గురు స్త్రీల కథతో, వారి ప్రేమ



నయా సస్పెన్స్ డ్రామాతో మేక్ ఏ విష్

కథలతో పాటు వారి సంబంధాల సమస్యల చుట్టూ తిరిగే కథ ఇది. కథ మొత్తం వారి జీవితంలోకి చొరబడిన వ్యక్తితో టైమ్‌లైన్‌లో ముందుకు వెనుకకు తిరుగుతుంది. వాషింగ్టన్ డీసీ, యుఎస్ఎ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో ఈ సినిమా మీ ముందుకు రానుంది' అని తెలిపారు. సంధ్య బాయిరెడ్డి, కిరణ్ కస్తూరి, రచన యాదనపూడి, అభిషేక్ సబ్బే, వరుణ్ వేగినాటి, కార్తీక్ కందాళ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి స్టోరీ: కిరణ్ కస్తూరి, సంధ్య బయిరెడ్డి, మ్యూజిక్ డైరెక్టర్ : ప్రణీత్ మ్యూజికల్, సినిమాటోగ్రఫీ : మహావీర్ అభిమన్యు, అడ్రిఎస్ రిలే, ప్రొడ్యూసర్: కిరణ్ కస్తూరి, డైరెక్టర్: సంధ్య బయిరెడ్డి, నిర్మాణ నిర్వహణ: జి శ్రీనివాస్ (భవాని శ్రీను).

ధనుష్ నటిస్తున్న భారీ పీరియాడికల్ మూవీ 'కెప్టెన్ మిల్లర్'. 1930-40ల నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ధనుష్ కెరీర్‌లోనే హయ్యస్ట్ బడ్జెట్ సినిమాగా రూపొందుతోంది.

అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలింస్ పతాకంపై టి.జి.త్యాగరాజన్ సమర్పణలో సెందిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్ర ఫస్ట్ లుక్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.


ధనుష్

ఉత్కంఠ భరిత పోరాటాలు..

తాజాగా మేకర్స్ మరో బిగ్ అప్డేట్ ఇచ్చారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ చిత్ర టీజర్ రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. టీజర్ ఈనెల 28న విడుదల కానుందనే అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో ధనుష్ గొడ్డలితో ఫెరోషియస్‌గా నడుస్తున్న లుక్ అద్యంతం ఆసక్తికరంగా ఉంది. ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, సందీప్ కిషన్, ప్రియాంక అరుళ్ మోహన్, నివేదితా సతీశ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమా ఏకకాలంలో విడుదల కానుంది. ఈ చిత్రానికి రచయిత, దర్శకత్వం: అరుణ్ మాథేశ్వరన్, నిర్మాతలు: జి. శరవణన్ , సాయి సిద్దార్థ్, సమర్పణ: టీజీ త్యాగరాజన్, సంగీతం: జివి ప్రకాష్ కుమార్, డీవోపీ: శ్రేయాస్ కృష్ణ, ఎడిటర్: నాగూరన్, ఆర్ట్: టి.రామలింగం.


సదా

సదా సినిమా, స్కై ఆర్ట్స్ పతాకాలపై గోణుగుంట్ల విజయ్ కుమార్ సమర్పణలో సదా హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'నంద'. కళ్యాణ్ ఎర్రగుంట్ల నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది.

మదర్ సెంటిమెంట్‌తో నంద

తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేసిన సందర్భంగా కథానాయకుడు, దర్శకుడు సదా మాట్లాడుతూ, 'మదర్ సెంటిమెంట్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే విధంగా తెరకెక్కిస్తున్నాం. చరణ్ అర్జున్ మా చిత్రానికి నాలుగు అద్భుతమైన పాటలు సమకూర్చారు' అని తెలిపారు. ఈ చిత్రానికి డిఓపీ: జైపాల్ రెడ్డి నిమ్మల, సంగీతం: చరణ్ అర్జున్, స్టంట్స్: జీవన్ కుమార్, ఎడిటర్: పవన్ శేఖర్, కొరియోగ్రఫీ: చంద్ర కిరణ్.

స్ట్రీట్ డాగ్ సమర్పణలో ఏనుగంటి ఫిల్మ్ జోన్ పతాకం పై లక్ష్మణ్ చిన్నా, కావ్య రమేష్ హీరో, హీరోయిన్‌గా వెంకట రత్నంతో కలిసి లక్ష్మణ్ చిన్నా స్వీయ దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'నచ్చినవాడు'. మిజో జోసెఫ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్ర ట్రైలర్‌ను పాత్రికేయుల సమక్షంలో మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో, దర్శక, నిర్మాత లక్ష్మణ్ చిన్నా మాట్లాడుతూ, 'స్త్రీ సెల్ఫ్ రెస్పెక్ట్ కథాంశంగా చేసుకుని అల్లిన ప్రేమ కథా చిత్రమిది. విజువల్‌గానే కాకుండా పాత్రల క్యారెక్టరైజేషన్ చాలా కొత్తగా ఉంటుంది. కథకి అనుగుణంగా అందరిని కొత్తవాళ్లను తీసుకున్నాం. అందరు బాగా నటించారు. మ్యూజిక్ డైరెక్టర్ మెజ్జో జోసెఫ్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. ప్రేక్షకులు ఈ సినిమా చూశాక మంచి ఫీల్‌తో ఇంటికి వెళ్తాడు. సినిమా ఖచ్చితంగా అందరికీ నచ్చుతుంది. ఆగస్టు 18న సినిమాని విడుదల చేస్తున్నాం' అని తెలిపారు. 'ఇందులో నేను అను అనే క్యారెక్టర్ చేశాను. తనకి సెల్ఫ్ రెస్పెక్ట్ చాలా ముఖ్యం. చాలా నీతిగా ఉంటుంది. ఎంత కష్టం వచ్చిన సెల్ఫ్ రెస్పెక్ట్ కోల్పోదు. నాకు ఇంత మంచి క్యారెక్టర్ ఇచ్చిన లక్ష్మణ్ చిన్నాకి ధన్యవాదాలు' అని హీరోయిన్ కావ్య రమేష్ అన్నారు.

మహిళల సెల్ఫ్ రెస్పెక్ట్ నేపథ్యంలో..


లక్ష్మణ్ చిన్నా, కావ్య రమేష్

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886